# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 1 - సంచిక 5 ఫిబ్రవరి 2023 వెల : రూ.15

సత్యమేవ జయతే

నెహ్రూ ప్రాపంచిక దృక్పథం

ధర్మాన్ని ఎరుక పరిచిన నైతికయాత్ర

ద మోడీ క్వశ్చన్.. బీబీసీ కథనం

బ్యాంకులను ప్రైవేటీకరిస్తే వచ్చే ప్రమాదాలు

రాజ్యాంగానికి పొంచి ఉన్న ప్రమాదం

రాజ్యాంగాన్ని చేత్తో రాసింది ఎవరో తెలుసా ?

బుద్ధుడు అవతారమూర్తి కాదు, చారిత్రక పురుషుడు

హేతువాదమే మౌఢ్యానికి విరుగుడు

మతం భ్రమపూరిత జలతారు తెర

పెట్టుబడి - స్వేచ్ఛ

మార్క్సిస్టు సౌందర్యశాస్త్రం

ఒక దేశం - ఒకే పువ్వు

కేపిటల్ ఇప్పుడెందుకు ?

ఎలియనేషన్ చదివారా?

ఫాతిమా షేక్‌ను చరిత్ర మరిచిందా

పెట్టుబడిదారీ వ్యవస్థ

భారతదేశంలో ఆహారపు అలవాట్లు

ఫిబ్రవరి - 2023

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 1 - సంచిక : 5

డీవీవీఎస్ వర్మ

- సంపాదకులు

సంపాదక వర్గం

కొప్పర్తి వెంకటరమణ మూర్తి

మందలపర్తి కిషోర్

డి.సోమసుందర్

డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

సత్యమేవ జయతే - సంపాదకీయం 3

నెహ్రూ ప్రాపంచిక దృక్పథం - విద్యా భూషణ్ రావత్ 4

ధర్మాన్ని ఎరుకపరిచిన నైతిక యాత్ర - ప్రొ॥ జి.హరగోపాల్ 8

ద మోడీ క్వశ్చన్.. బీబీసీ కథనం - ఎం.కోటేశ్వరరావు 9

బ్యాంకులను ప్రైవేటీకరిస్తే వచ్చే ప్రమాదాలు - ప్రభాత్ పట్నాయక్ 13

రాజ్యాంగానికి పొంచి ఉన్న ప్రమాదం - కె.రామచంద్రమూర్తి 16

రాజ్యాంగాన్ని చేతో రాసింది ఎవరో తెలుసా? 18

బుద్ధుడు అవతారమూర్తి కాదు - డాక్టర్ దేవరాజు మహారాజు 19

హేతువాదమే మౌఢ్యానికి విరుగుడు - ఏబీకే ప్రసాద్ 21

మతం భ్రమపూరిత జలతారు తెర - సురవరం సుధాకరరెడ్డి 24

పెట్టుబడి - స్వేచ్ఛ - కొండూరి వీరయ్య 26

మార్క్సిస్టు సౌందర్యశాస్త్రం - డాక్టర్ తక్కోలు మాచిరెడ్డి 30

ఒక దేశం ఒకే పువ్వు - డాక్టర్ దేవరాజు మహారాజు 32

కేపిటల్‌లో కార్ల్ మార్క్స్ ఏం చెప్పాడు ? పుస్తక పరిచయం - సి.ఎస్.ఆర్. ప్రసాద్ 33

ఎలియనేషన్ : పుస్తక పరిచయం - వి.విజయకుమార్ 35

ఫాతిమా షేక్‌ను చరిత్ర మరిచిందా - ఇక్బాల్ యంజీ 39

పెట్టుబడిదారీ వ్యవస్థ - జి.భార్గవ 40

ప్రాచీన భారతదేశంలో ఆహారపు అలవాట్లు - డి.ఎన్.ఝూ 41




కార్టూన్ : సతీష్ ఆచార్య

దారి దీపం మాసపత్రిక

వివరాలకు సంప్రదించండి

డా॥ బి.రమేష్ చంద్రబాబు,
34-15-1,
దొడ్డిపట్ల వారి తోట వీధి,
తణుకు - 534211,
ప.గో.జిల్లా, ఏపీ
ఫోన్ : 93971 14495

### గాంధీ మార్గం

ఎవరైనా మనకిచ్చేది తాత్కాలికమైనది. కృషితో మనం సాధించుకునేది శాశ్వతమైనది. ప్రేమ ఉన్నచోట జీవితం ఉంటుంది. పగ ఉన్నచోట నాశనం ఉంటుంది.

సంపాదకీయం



# సత్యమేవ జయతే..

సత్యమేవ జయతే అన్న నానుడి కొత్తది కాదు. ఇది కాలాతీతమైంది. సత్యానికి, అసత్యానికి మధ్య నిరంతరం జరిగే సంఘర్షణను సూచిస్తుంది. ఇందులో అసత్యం జయించదు. ఎప్పుడూ సత్యమే జయిస్తుంది. ఒకోసారి సత్యం మసకబారుతుంది. నడకలో అసత్యం జోరు ఎక్కువ. సత్యంది తక్కువ. అసత్యం పుకారుగా దావానంలా వ్యాపిస్తుంది. కాని సత్యం వెలుగు చూడగానే అసత్యం బండారం బైట పడుతుంది. ఇప్పుడు దేశంలోని పాలకవర్గానికి అసత్యమే ఆయుధం. మీడియా, సోషల్ మీడియాలు దీనికి సాధనాలు. అయితే ఆలస్యంగానైనా సత్యం వెలుగు చూసే సరికి అసత్యం గాలి బుడగలు పేలిపోవడం ప్రారంభం అవుతుంది. మోదీ భారతదేశం పేరుతో బీబీసీ విడుదల చేసిన లఘు చిత్రం పాలకవర్గం చేస్తున్న ప్రచార బండారాన్ని బట్టబయలు చేసింది. ఒకనాడు రేడియో, టెలివిజన్‌లు ప్రభుత్వ బాకాలుగా ఉన్నాయని అందుకే నిజమైన వార్తల కోసం బీబీసీని ప్రజలు ఆశ్రయిస్తున్నారని ప్రస్తుతించిన మోదీ ఇప్పుడు బీబీసీ లఘు చిత్రాన్ని నిషేధించడానికి తంటాలు పడుతున్నారు. ఈ దాడి తన మీద మాత్రమే కాదని దేశం మీద జరుగుతున్న దాడిగా ప్రచారం చేయిస్తున్నారు. పైగా ఇది పాకిస్థాన్ సమాచారం కుట్రగా చైనా ధన సహాయం కుట్రగా జరుగుతున్న శత్రు మూక కుట్ర అంటున్నారు.

గుజరాత్‌లో గోద్రా సంఘటన తర్వాత జరిగిన మారణకాండకు ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి, నేటి ప్రధాని మోదీని పాత్రధారునిగా ఈ చిత్రం ఆరోపించింది. ఎంతో అధ్యయనంతో, ఆ నాటి సంఘటనల చిత్రాలతో సాక్షుల వాంగ్మూలలతో ఈ చిత్రాన్ని రూపొందించింది. ఈ సత్యాన్వేషణే పాలక వర్గాన్ని కలవరం పాలు చేసింది. గుజరాత్ నమూనా నిజ స్వరూపాన్ని ఈ చిత్రం ఆవిష్కరించింది. మోదీ తన రాజకీయ ప్రయోజనాలకు రూపొందించుకున్న గుజరాత్ నమూనా అది. దానిని దేశానికి విస్తరింపజేసి తన విజయానికి సాధనం చేసుకున్న నమూనా. ఈ సత్యం వెలుగు చూడకూడదని పాలకవర్గం దానిని నిషేధించడానికి తంటాలు పడుతున్నది. కాని, దేశంలో సోషల్ మీడియాలో ఈ చిత్రం వైరల్ అయింది. అనేక యూనివర్సిటీలలో విద్యార్థులు దీనిని బహిరంగంగా ప్రదర్శించడం మొదలు పెట్టారు. విద్వేష రాజకీయాన్ని దేశంలో యువత నిరసిస్తున్నారనడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. మరోపక్క రాహుల్ గాంధీ ఐదు నెలలపాటు భారత్ జోడో యాత్ర సాగించారు. అది దేశంలోపాలకవర్గం ఎంచుకున్న విద్వేష మార్గాన్ని వ్యతిరేకిస్తూ సాగిన యాత్ర. కోట్లాది మంది భారతీయులు, వివిధ భాషలు, మతాలకు చెందిన వారు ఈ యాత్రలో ప్రత్యక్షంగా పరోక్షంగా పాలు పంచుకున్నారు. ఇది దేశంముందు సత్యాన్ని నిలబెట్టే మరో ప్రయత్నం. గుజరాత్ నమూనా పట్ల ప్రజలు ప్రకటించిన నిరసనకు కూడా నిదర్శనం. ఇప్పుడు దేశం ముందు సత్యం ఆవిష్కృతున్నది అసత్యం తన పరాజయాన్ని తప్పించుకోవడానికి దారులు వెదుకుతున్నది. దానికి పరాజయం తప్పదు. ఎప్పటికైనా సత్యమేవ జయతే. ❑

# నెహ్రూ ప్రాపంచిక దృక్పథం



అనువాదం : అనిశెట్టి శాయికుమార్

**విద్యా భూషణ్ రావత్**

**గత కాలమెంతో మేలు.. వచ్చు కాలము కంటెన్ అనేది కొన్ని విషయాల్లో నిజమేననిపిస్తుంది. ప్రస్తుత దేశ పరిస్థితులు చూస్తే మరీనూ. ఎంత విమర్శించుకున్నా, ఎన్ని లోపాలున్నా, మిగతా సాటి దేశాలకంటే మెరుగైన ప్రజాస్వామ్యంలో ఉన్నాం. దీనికి పునాది వేసింది నెహ్రూ. మోడీతో పోల్చుకుంటే, 'పోయినోళ్ళే మంచోళ్ళని అర్థమవుతుంది. ఈ నెల స్వేచ్ఛాలోచన పత్రికలో నా అనువాద వ్యాసం.**

## (బిబిసి టెలివిజన్‌లో తన తొలి ముఖాముఖి ప్రాతిపదికన)

జవహర్‌లాల్ నెహ్రూ జీవితం, ప్రాపంచిక దృక్పథం, ఎపుడూ సమ్మోహితం చేస్తాయి. ఆయన ఒక గురువులా మాట్లాడతాడు. తన పాత వీడియోలు, పత్రికా సమావేశాలు, ఉపన్యాసాలు వింటుంటే ఎవరైనా పూర్తిగా అందులో లీనమౌతారు. ఎలిజబెత్ రాణి పట్టాభిషేకం సందర్భంగా 1953లో బ్రిటన్ వెళ్ళినపుడు ప్రముఖ పాత్రికేయులతో ఆయన జరిపిన ముఖాముఖిని ఈ నవంబర్ 14న బిబిసి టెలివిజన్ తిరిగి ప్రసారం చేసింది. భారతదేశ ప్రధానమంత్రిగా, ఆసియాలోనే అత్యంత ప్రముఖ వ్యక్తిగా ఆయనను పరిచయం చేసిన పద్ధతి చూడండి. ఐరోపా, ఆఫ్రికా, చైనా, పసిఫిక్ వరకూ వివిధ అంశాల్ని గురించి ప్రముఖ పాత్రికేయులు ఆయనను ఎటువంటి ప్రశ్నలు అడిగేరనే విషయాన్ని, మే 2014 తర్వాత భారతదేశం 'విశ్వ గురువు' అవుతుందని చేప్పేవాళ్ళంతా ముఖ్యంగా ఈ ఇంటర్వ్యూ చూడాల్సివుంది. అత్యంత ప్రతిభావంతులైన పాత్రికేయులు ఆయనను ప్రశ్నిస్తున్నపుడు తనకు సలహాలు చెప్పేవారు గానీ, మద్దతుగా నిలిచేవారు గానీ ఎవరూ లేరు. ఇండియా అప్పుడే కొత్తగా స్వాతంత్రం పొందిన రోజులనీ, అందువల్ల తను ఆసియా ఖండానికి నాయకునిగా గుర్తింపు కొనసాగుతూ ఉన్నదనీ మనం దృష్టిలో ఉంచుకోవాలి.



నెహ్రూ అక్కడి ఉన్నతశ్రేణి పాత్రికేయులతో ప్రశాంతంగా, ఆత్మ విశ్వాసంతో ఏ విధంగా ప్రతిస్పందించాడో చూస్తే, ఈ బిబిసి టెలివిజన్ ముఖాముఖి నెహ్రూ అంతరంగాన్ని చక్కగా ప్రతిబింబించిందని అర్థమౌతుంది. అందులో ఉత్ప్రేక్ష ఏమీ లేకుండా క్లుప్తమైన సమాధానాలు మాత్రమే ఉన్నాయి. తన సమాధానాలన్నీ అడిగిన అంశానికి మాత్రమే పరిమితమై, అడిగిన పరిధిలోనే ఉంటాయి. తన దృక్పథానికి భాష్యం చెప్పాల్సిన పనిగానీ, తిరిగి వివరణ ఇవ్వాల్సిన అవసరం గానీ లేదు. ఆయన సమాధానాలన్నీ సూటిగాను, స్పష్టంగానూ ఉన్నాయి.

వర్తమాన పరిస్థితుల్లో నెహ్రూని గురించి తెలుసుకోవాల్సిన ప్రాముఖ్యత, అవసరం మరింతగా పెరిగాయి. భిన్నరకాల వైఫల్యాలు ఎన్ని ఉన్నా, ప్రపంచవ్యాపితంగా ఎంతో విజయవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా ఉన్న వాటిలో ఒకటిగా ఇండియా విలసిల్లడానికి నెహ్రూ ఇక్కడి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే కారణంగా చెప్పుకోవచ్చు. ఒక పాత్రికేయుడు' ఇండియాలో మీకు ప్రతిపక్షమే లేదుగా' అన్న ప్రశ్నకు సమాధానం చెబుతూ, 'మా పార్లమెంట్‌లో ఉన్న ఐదు వందల స్థానాల్లో మాపార్టీ సభ్యులు 350 మంది ఉంటే, ప్రతిపక్షానికి చెందిన వారు 150 మంది ఉన్నారు. వారు తమ గళాన్ని వినిపిస్తూనే ఉంటారు' అపి అన్నారు. తన సమాధానంలో పార్లమెంటులో ఎంత తీవ్రంగా విషయాలు చర్చిస్తారనే అంశాన్నీ, చట్ట సమానత్వాన్నీ, తాము ప్రభుత్వ ప్రభుత్వ రంగ సంస్థల్ని ఎంత బలోపేతం చేస్తున్నామనే విషయాన్నీ చక్కగా వివరించాడు. అంతేకాకుండా, అంశాలపై

విభేదించి, ఐక్యంగా లేకపోయినా తాము దేశ ప్రజలపై రెండు పార్టీల వ్యవస్థను రుద్దబోమని చెప్పారు. మాకు పార్లమెంటు లోనూ బయటా మంచి ప్రతిపక్షం ఉందని అన్నారు. నెహ్రూ, ఆచార్య నరేంద్రదేవ్, రాంమనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్‌ల ఉపన్యాసాల్ని తాను పార్లమెంటులోను బయట కూడా ఎంతో శ్రద్ధతో వింటానని చెప్పారు. తను జయప్రకాశ్ నారాయణ్‌ని తన రాజకీయ వారసునిగా పేర్కొని, తనను మంత్రివర్గంలోకి ఆహ్వానించిన సంగతి అందరకూ తెలిసిందే.

ఉపఖండాన్ని బాధించే అనేక రకాల విభాగాలు, మతపర భిన్నత్వపు అంశాలూ ఉన్నా, నెహ్రూ దీన్ని లౌకిక భారత ఉప ఖండంగా ఉంచాలని సంకల్పించారు. ముస్లిం లీగ్ ఇక్కడ ఎందుకు నిలవలేకపోయిందో నెహ్రూ స్పష్టంగా పేర్కొన్నారు. ముస్లిం లీగ్ జమిందార్ల పార్టీ కావడం వల్ల, అది భూసంస్కరణలను గురించి భయపడినందు వల్లనే ఇలా జరిగిందన్నారు. సమాన అవకాశాలు ఉండే సమాజం కోసం జమిందారీ వ్యవస్థను రద్దు చేయాలని పట్టుబట్టిన నెహ్రూ స్పష్టంగా తొలివిస్తృత శాసనాన్ని ప్రవేశపెట్టారు. పాకిస్తానీ ఉన్నత వర్గాలు ఆ బిల్లు నుంచీ తమను కాపాడుకున్నాయి. పాకిస్తాన్‌లో ఆయుబ్‌ఖాన్ సైనికపాలన కాలంలో తొలిసంస్కరణ బిల్లు ప్రవేశపెట్టగా, రెండో విడత, మూడో విడత సంస్కరణలు స్వయంగా పెద్ద భూస్వామ్య నేపథ్యం ఉన్న జుల్ఫీకర్ అలీ భుట్టో హయాంలో జరిగాయి. పాకిస్తాన్‌లో తొలిసారి భూసంస్కరణలు జరిగిన 1959లో నీటిపారుదల సౌకర్యమున్న భూములకు ఐదు వందల ఎకరాలు, మెట్ట పొలానికి వెయ్యి ఎకరాలకు పరిమితి విధించారు. దీన్నే అక్కడ భూసంస్కరణలని అంటారు. ఇక దీన్ని గురించి మాట్లాడేదేమీ లేదు. పాకిస్తాన్‌లోని భూస్వాములు కీలకమైన తమ ప్రయోజనాలను కాపాడుకున్నారు. అది ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. భుట్టో 1979లో దీనికి సవరణ చట్టం తెచ్చాడు. ఆ ప్రకారం, నీటి వసతి సౌకర్యం ఉన్న పొలాలకు 150 ఎకరాలు పరిమితిగా, మెట్ట పొలాలకు 300 ఎకరాలకు మించి ఉండే వీలు లేకుండా పరిమితి విధించారు. ఐతే, ఈ భూ పరిమితి చట్టం ఇస్లాం మతానికి, రాజ్యాంగానికీ వ్యతిరేకమని నిర్ణయించి ఆ చట్టాన్ని చెల్లకుండా పాకిస్తాన్ సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. పాకిస్తాన్‌లో పంజాబు నుంచి సింధు దాకా పెద్ద భూస్వాములే రాజ్యమేలుతున్నారు. నీటి సౌకర్యమున్న భూములకు పన్నెండు ఎకరాల పరిమితి విధిస్తూ 1970లో ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన భూసంస్కరణలతో దీన్ని పోల్చి చూడండి. భారత పాకిస్తాన్ల మధ్య సంబంధాలు మెరుగు పడుతున్నాయని, మనం సరైన దారిలోనే వెళుతున్నామని ఆయన చెప్పారు. తనకున్న వైఫల్యాల్ని అలా వుంచి, నెహ్రు బలోపేతం చేసిన ప్రజాస్వామిక వ్యవస్థను చూడండి. ఇక్కడ సాధారణ ప్రజానీకానికి ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు కల్పించగా, ఆంగ్లేయుల కాలపు భూస్వామ్యవర్గం నియంత్రిస్తున్న పాకిస్తాన్లో మాత్రం ఇప్పటిక ఇది కల వంటిదిగానే మిగిలింది. కుల వ్యవస్థ పట్ల నెహ్రూ అనుసరించిన విధానం వల్ల తను వ్యక్తిగత విమర్శకు లోనైనా, నేపాల్ తప్ప రాజకీయ వ్యవహారాలలో కులాన్ని ఆమోదించని ఇతర ఆసియా దేశాలతో ఇక్కడి పరిష్కారాలని పోల్చి చూడగలమా? పాకిస్తాన్ భూస్వామ్య పాలక వర్గాలు దళిత సమస్యను కనీసం గుర్తించడానికి ఇష్టపడకపోవడంతో ఆ దేశపు తొలి న్యాయశాఖా మంత్రి జోగేంద్రనాథ్ మండల్ అక్కడి పౌరసత్వాన్ని వదులుకొని భారత్ తిరిగి వచ్చేట్లు చేశారు.

అక్కడి పాత్రికేయులు నెహ్రూని కమ్యూనిజాన్ని ఖండించేందుకు పురికొల్పడానికి చాలా ప్రయత్నించినా, తను మాత్రం, కమ్యూనిజం నుంచీ భారత ప్రజాస్వామ్యానికి ముప్పు వచ్చేట్లు భావించకపోవడం ఈ బీబీసీ టెలివిజన్ ముఖాముఖిలో నాకు మనోరంజకంగా అనిపించిన విషయం. ఆయన ప్రజాస్వామ్యంలో హింసకు తావు ఉంటుందని ఎప్పుడూ ఒప్పుకోలేదు. ఐతే, కమ్యూనిస్టు పార్టీలు ప్రాచుర్యం పొందడా నికి కొన్ని సమస్యలున్నాయి. వీటితో వ్యవహరించడానికి, దేశాల్ని గురించి, సిద్ధాంతాల్ని గురించీ మన స్వంత బావనలు ఏర్పరచుకోవాలే గానీ, పాశ్చాత్యుల దృష్టి కోణంలో నుంచి చూడకూడదన్నాడు. ఆయన చైనా కమ్యూనిజంపై పాశ్చాత్యుల విమర్శలతో ఏకీభవించలేదు. భారతదేశానికి చైనాతో రెండు వేల కిలోమీటర్ల సరిహద్దు ఉందనీ, అందువల్ల చైనా గురించి వారికంటే తమకే ఎక్కువ తెలుసనీ చెప్పారు. చైనా వారి వలన అనేకసార్లు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నా, భారత ప్రజాస్వామ్యానికి కమ్యూనిజం వలన ఎలాంటి ముప్పులేదని భావించారు. రష్యా, చైనాల అభివృద్ధికి తానెంతో ఆకర్షితుడయ్యారు. 'ఐతే, ఇక్కడో ధోరణి ఉంది. నేను ఆ విధంగా ఉండేట్లయితే, ఒక రాజకీయ వేత్తగా, యూరప్, అమెరికాల దృష్టి కోణంలో నుంచి అదే సిద్ధాంతాలతో చూసేట్లయితే, తేడా ఉంటుంది. భూభాగం నిర్ణయిస్తుంది. చైనా విషయాన్ని తీసుకుందాం. అమెరికా యూరప్‌లలోని జనాలకు చైనా చాలా దూరప్రాంతం. అదే రెండు వేల కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటున్న, తక్షణం పక్కనే ఉన్న భారత దేశానికి భిన్నరూపంలో ఉంటుంది.' అన్నాడు.

అంతర్జాతీయ ప్రసార ప్రచురణ మాధ్యమాలు నెహ్రూను అభివృద్ధి చెందుతున్న దేశాలకు, వలసపాలన నుంచీ బయట పడ్డ దేశాలకూ ప్రాతినిధ్యం వహించే రాజకీయ వేత్తగా చూసిం ది. తన గొంతుకకు నిశ్చయాత్మక శక్తి, ధైర్యమూ ఉన్నాయి. 3,

4 వందల సంవత్సరాల ఐరోపా ఆధిపత్యం తర్వాత, ఈ ఆసియా, ఆఫ్రికా దేశాల్లో తీవ్రమైన ఉప్పెనవంటి చైతన్యం, జాగృతీ ఉన్నాయి. ఇది వారి సొంత క్రమాన్ని భంగపరిచింది. తప్పో, ఒప్పో, ఆసియా తన స్వంత దారిలో ప్రయాణిస్తోంది. దాన్ని మనం అర్థం చేసుకోవాలి. అభినందించాలి లేదా దాని పట్ల కోపం తెచ్చుకోకూడదన్నారు.

వలసవాద వ్యతిరేకపోరాటం కొనసాగుతున్న ఆఫ్రికాను గురించీ, అక్కడ చిన్న చిన్న తెల్లజాతి సమూహాలు జాతి వివక్ష చట్టాల ద్వారా రాజకీయంగా ఆధిపత్యాన్ని కొనసాగించడం గురించీ పాత్రికేయులు నెహ్రూకు గుర్తుచేశారు. వలసపాలన పోయిన తరువాత, అక్కడి తెల్లజాతి సముదాయాల రాజకీయ ఆధిపత్యం వల్ల ఉద్రిక్తతలు, అశాంతి, చోటు చేసుకుంటున్నాయని గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. నెహ్రూ దీనిపై చాలా జాగ్రత్తగా, మేథోతనంతో స్పందించాడు. 'ఆఫ్రికా ఒక విషాదకర అనుభవాలున్న ఖండం అనే సంగతి గుర్తుంచుకోండి. వందల సంవత్సరాలు అది భయంకర బాధలకు గురైంది. అందుకు కారణం వారు మిగతా వారిలాగా అభివృద్ధి చెందకపోవడం కావచ్చు. లేదా వారికి అవకాశాలు దొరకకపోవచ్చు. ఆఫ్రికాలో జరుగుతున్న పరిణామాలు నన్నెంతో బాధకు గురిచేశాయి. తూర్పు ఆఫ్రికాకు, దక్షిణాఫ్రికాకు ఉన్న సమస్యలు చాలా భిన్నంగా ఉన్నాయ"ని ఆయన స్పష్టంగా అర్థం చేసుకున్నారు. ఆఫ్రికాలోని దక్షిణ భాగం ఫ్రెంచ్ వలసగా ఉన్నట్లు ఆయనకు స్పష్టంగా తెలియడం వలన తాను అన్నిచోట్లా తలదూర్చాలనుకోలేదు. దేశానికి ప్రధానమంత్రిగా తనకు పరిమితులున్నాయి. ఆయన చెప్పే మాటలన్నీ భారత ప్రభుత్వ విధానాలుగా లెక్కించడం జరుగుతుంది. తానూ ప్రపంచ ప్రజలతో ప్రభుత్వాధినేతగా ప్రసంగిస్తున్నట్లు తనకు తెలుసు. అందువల్లనే తను ఆచి, తూచి మాట్లాడారు. దేశ ప్రధానిగా తనను తాను ఎంతగా పరిమితం చేసుకున్నదీ, ఒక రచయితగా, పాత్రికేయునిగా లేదా రాజకీయ వేత్తగా తన స్వంత వ్యక్తిత్వాన్ని ప్రదర్శించలేకపోయిన విషయం ఎవరికైనా తేలికగా అర్థమౌతుంది. దక్షిణాఫ్రికా, మధ్య, ఉత్తర ఆఫ్రికాల సమస్యలు భిన్నంగా ఉన్నాయని చెప్పారు. అయినప్ప టికీ, అనేక మంది ఐరోపావాసులు అక్కడ నివసించవచ్చు. ఐతే, అంతిమంగా వారు స్థానిక ఆఫ్రికా ప్రజలతో సహకారంతో పని చేయాల్సి వుంటుంది. వీరంతా లెక్కకు మిక్కిలిగా పెరిగి, ఆఫ్రికా ప్రజల దృష్టిలో ఉన్నారు. వారు ఒకరికొకరు సహకరించు కోవాలి లేదా ఒకరినొకరు అణగదొక్కాలి. ఒకవేళ యురోపి యన్లు ఆఫ్రికా వారిని అణచివేయాలని ప్రయత్నిస్తే, ఆఫ్రికన్లు నిస్సందేహంగా ఐరోపా వారిని పారదోలుతారు. కెన్యా దేశం, ఇంకా కొన్ని ఇతరదేశాల్లో ఐరోపావారికంటే భారతీయులే ఎక్కువగా ఉన్నారనే విషయాన్ని గుర్తు చేసిన ఒక పాత్రికేయుడు, అక్కడ నివసించే భారతీయులకు నెహ్రూ ఏమి సలహా ఇస్తాడని అడిగాడు. ఏ రకమైన జాతి ప్రస్తావన లేకుండా నెహ్రు ఆ ప్రశ్నకు చక్కగా సమాధానమిచ్చాడు. 'ఔను. మా భారతీయులకు మేంచెప్పేం. ఏడాదికేడాదికీ వారు ఆఫ్రికా స్థానికులతో సహకారంతో పనిచేయాలి. వారు ఏరకమైన ప్రత్యేక సౌకర్యాలు కోరగూడదు. వారు ఆఫ్రికా వాసుల్ని దోపిడీ చేయకూడదు. వారిమీద పైచేయితో ఉండాలనుకోగూడదు. ఆఫ్రికా వాసులకంటే ప్రత్యేక హక్కులు గానీ, సౌకర్యాలుగానీ కోరితే మేం అందుకు అంగీకరించం. వారు ఆఫ్రికాలో ఉండాల నుకుంటే, ఆఫ్రికా వారితో సమరస భావంతో కలిసి మెలిసి ఉండాలి లేదా అక్కడి నుంచీ బయటకు రావాలి.

స్థానిక ప్రజలతో కలిసిమెలిసి ఉండాలనీ, అక్కడి అధిక సంఖ్యాకులతో ఏ విధంగా సహకారంతో మేలగాలనేదీ ఏ రకమైన సందేహానికీ తావులేకుండా ఎట్లా చెప్పేరో చూడండి. అప్పుడు నెహ్రూ చెప్పినదాన్ని ద్వేషించిన వాళ్ళు ఇప్పుడు మన కళ్ళముందు ఏమి జరుగుతుందో చూడండి. పాకిస్తాన్ పై ఆంగ్లేయుల విజయాన్ని వేడుకగా జరుపుకుంటున్న వారు, తన కుటుంబం కెన్యాకు వెళ్లి, అక్కడి నుంచీ అమెరికాకు వచ్చిందనే అందరికీ తెలిసిన వాస్తవాన్ని పక్కనపెట్టి, భారతీయ వారసత్వమున్న ప్రధానిని చూసి చంకలు కొట్టుకుంటున్నారు.

ఆఫ్రికాలో ఉన్న భారతీయులు, ఐరోపావాసులకు సలహా ఇస్తూ నెహ్రూ చెప్పిన వాక్యాలు పతాక శీర్షికల్లో ఉండాల్సింది. చరిత్రను వక్రీకరించి లేదా వాస్తవాలు తెలియకుండా, తన ప్రత్యర్థులు కాశ్మీర్ సమస్యపై నెహ్రూను నిందించి, ఐక్యరాజ్య సమితికి వెళ్ళారు. భారత పాకిస్తాన్‌ల వివాద పరిష్కారంలో మధ్యవర్తిత్వం వహించడానికి ఐక్యరాజ్యసమితి లేదా మరే దేశమైనా పూనుకుంటే మంచిదా అని ఒక పాత్రికేయుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా, పాకిస్తాన్ కినుక వహించడం వల్ల ఇండియా ఐరాసకు వెళ్ళాల్సి వచ్చింది. కానీ, ఈ రెండు దేశాలూ తమ సొంత సమస్యలను పరిష్కరించుకునే సామర్థ్యం ఉన్నవిగా ఆయన భావించాడు. పాకిస్తాన్ పాశ్చాత్య ప్రపంచం జోక్యాన్ని కోరుతూ, దీన్ని అంతర్జాతీయ సమస్య చేయాలని చూస్తున్నా, ఈనాటికి భారతదేశం తన విదేశాంగ విధానానికి నెహ్రూ చెప్పిన అంశాన్నే ప్రాతిపదికగా తీసుకుని ముందుకు సాగుతోంది. ఒక్క విషయం మాత్రం స్పష్టం. వర్తమాన కాలంలో జవహర్ లాల్ నెహ్రూ గనక ఉండి ఉన్నట్లయితే, కనీసం టీవీ చానళ్ళలోనైనా, తన మేధోవంతమైన సంభాషణా చాతుర్యంతో గొప్ప ప్రాచుర్యం కలిగి ఉండేవాడు. తాను ఉండి ఉన్నట్లయితే ప్రస్తుత సమస్యలపై మరింత స్పష్టంగా స్పందించి ఉండేవాడు. ఇండియా సంక్షోభానికి నెహ్రూయే కారణమని,

నెహ్రూని ఖండిస్తూ పది వాక్యాలు కూడా రాయలేని నాయకులు వరసగా నేడు ప్రభుత్వాల్ని పాలిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ప్రజాభిప్రాయాన్ని గౌరవించి, షేక్ మహమ్మద్ అబ్దుల్లాను కారాగారం నుంచీ బయటకు తెచ్చి కృషిచేసిన ఆయన విధానాల్ని నేడు సిగ్గు లేకుండా విమర్శిస్తున్నారు. నెహ్రూ రాజకీయవేత్త కావడం భారతదేశ సాహిత్యానికీ, చరిత్రకూ గొప్ప లోటుగా భావించాల్సి వుంది. దేశంలోని ముఖ్య మంత్రులు, ఇతరులతో ఆయన జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, సమాచార మార్పిడి, ఆయన మేదోశక్తికి నిదర్శనంగా కనబడ తాయి. వాస్తవానికి ఈనాడు భారతదేశం తన భిన్నత్వాన్ని నిలుపుకొంటూ ఐక్యంగా ఉండడానికి, ఆధునిక ప్రజాస్వామ్యం లో అల్పసంఖ్యాక, బడుగు బలహీన వర్గాల వారు సాధించిన విజయాలకూ నెహ్రూ నాటిన విత్తనాలే కారణమనేది నేడు భారత్‌దేశం గర్వించాల్సిన అంశం. ఇతర దేశాల్లోని వలసవాద వ్యతిరేక పోరాటాలు నడిపిన నాయకులలో అత్యధికులు నియంతలుగా, తాము చెప్పిందే చట్టం అన్నట్లుగా ఏలుబడి చేసిన విషయం గుర్తు తెచ్చుకుంటే, నెహ్రూ గొప్పదనం మనకు అవగతమౌతుంది. నెహ్రూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశాడు. ఆనాడు మన చుట్టుపక్కల ఉన్న ఇతర దేశాలవైపు దృష్టి సారించండి. భారతదేశం ఒక్కటే ప్రజాస్వామ్య వ్యవస్థతో, రాజకీయ స్థిరత్వంతో నిలబడి ఉంది.

ఈనాడు, 2014 తర్వాత వాట్సప్ ద్వారా మాత్రమే చరిత్రను తెలుసుకుంటున్న, వాట్సాప్‌లో చెప్పే వారి బూట్లు నాకే వారంతా, ప్రపంచ పాత్రికేయులతో నెహ్రూ వ్యవహరించిన తీరు గురించీ, విశ్వ విద్యాలయాల్లో విద్యార్థులతో జరిపిన సంభాషణలను గురించీ, అంతర్జాతీయ సమావేశాలలో ప్రపంచంలోని వివిధ దేశాల నాయకులతో జరిపిన మేథోపర చర్చల గురించీ తెలుసుకునేట్లయితే దిగ్భ్రాంతికి గురవుతారు. ప్రతీ సమావేశ భాషణా, మేదోవంతంగా, మెదడుకు మేతగా ఉంటుంది. ఆయన పదాల ఎంపిక, విరుపులు, భాషా ప్రావీణ్యం, చాలా తేలికగా సమ్మోహనపరిచేట్లు ఉంటాయి. సాపేక్షంగా మన దేశ ప్రజాస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేసిన నెహ్రూ వంటి గొప్ప దూరదృష్టి ఉన్న ప్రధానిని కలిగి ఉండడం మన దేశం చేసుకున్న అదృష్టంగా భావించవచ్చు. మతంతో విషతుల్యమైన మన పొరుగు దేశంలో రాజకీయ వాతావరణాన్ని, సైన్యపు జోక్యాన్నీ, తద్వారా అక్కడి ప్రజల న్యాయమైన ప్రజాస్వామిక హక్కుల్ని కాలరాయడాన్నీ ఉదాహర ణలుగా చూడవచ్చు. భారతదేశంలోని రాజకీయ నాయకత్వం లౌకిక తత్వంతో, భిన్న భాషాజాతుల్ని, సంస్కృతుల్ని, మతాల్ని గౌరవిస్తూ, ఉండడం వలనే భారతదేశం ఇన్నాళ్ళూ చక్కగా మనగలిగింది.

ఐతే, ఈ నాడు నెహ్రూ భారత దేశానికి ఇచ్చిన దార్శనికత ప్రమాదంలో పడింది. ఈ మహా పెద్ద భారత ఉపఖండంలో రాజ్యం భిన్నత్వాన్ని గౌరవించాల్సింది పోయి, ఏకతాభావాన్ని రుద్దాలని కోరుకొంటోంది. వారి దృష్టిలో ఏకత్వ భావన అంటే, ప్రతి ఒక్కరి మీదా, హిందూత్వం, హిందీ భాష, హిందూస్తాన్ అంటూ, బ్రాహ్మణీయ విలువలు రుద్దడంగా స్పష్టంగా తెలుస్తోంది. వాస్తవానికి ఈ విధమైన చర్యలు జాతీయ సమైక్యత ను దెబ్బ తీస్తున్నాయి. భారతదేశం అంటే, ఉత్తర భారతదేశపు కులీనుల పాలనలో నడిచే పాలనా విభాగం కాదు. ఇండియా అంటే, భిన్నభాషలు, మతాలూ, సంస్కృతులు కలిగి ఉండి, భిన్నత్వంలో ఏకత్వంగా ప్రతి ఒక్కరూ ఇతరుల క్షేమం పట్ల శ్రద్ధ వహించే దేశం. ఆ ప్రకారం, భారతీయులుగా పరస్పర సంబంధంతో ఆనందిస్తూ ఉండి, పరస్పర గౌరవ భావంతో మెలిగే, నెహ్రూ ఆశించిన భారతదేశం మనకు కావాలి. వెనకటికి నిరంకుశ రాజ్యాలేలిన రాజులు, చక్రవర్తులూ చేసినట్లు ప్రజా సంక్షేమం పేరిట గుళ్ళు, మసీదులు, ధర్మశాల లు కట్టించినట్లు కాకుండా ప్రజా సమస్యలు కేంద్రంగా దృష్టి సారించే గణతంత్ర రాజ్యంగా ఉండాలి. నేటి ఆగామి యువ భారతం ప్రజల్ని మరింతగా మతాచారాల మూఢత్వంలోకి, బానిస భావాల్లోకి నేట్టేదిగా ఉండకూడదు. అది శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేదిగా, మానవ విలువల్ని గౌరవించేదిగా, మన రాజ్యాంగ నిర్మాతలు, బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రసాదించిన మన ఆధునిక రాజ్యాంగానికి విధేయత కలిగి ఉండేట్లుగా చేయాలి.

జవహర్‌లాల్ నెహ్రూ తొలి టీవీ ఇంటర్వ్యూలో ఆయనపై సంధించిన అన్ని ప్రశ్నలకు ఆయన పూర్తి స్పష్టతతో, ఆత్మ విశ్వాసంతో ఇచ్చిన సమాధానాలు ఆయన వ్యక్తిత్వాన్ని, నిబద్ధతల ను, మనకు చూపుతాయి. అవి టెలివిజన్ ప్రారంభమైన తొలి రోజులనీ, అది ఆయన తొలి ఇంటర్వ్యూ అని గుర్తుంచుకోవాలి. ఆనాటి పాత్రికేయులు ప్రస్తుతం ఉన్న వారిలా ఆయనను పొగిడి, బుట్టలో వేయాలని చూసేవారు కాదు. ఇప్పటి మాదిరి మనం చూస్తున్న ప్రజాసంబంధాల ఏజెన్సీలు లేవు. ముందుగా తయారు కాకుండా, ఏ రకమైన సహాయమూ లేకుండా, అంతర్జాతీయ పాత్రికేయుల ముందు నేటి మన నాయకులు ఎవరైనా, నెహ్రూలా మాట్లాడే సత్తా ఉందని మనం ఆశించగలమా? నిజం చెప్పాలంటే, ఈ రోజున రాత్రింబవళ్ళు నెహ్రూని విమర్శించేవారు పెద్దగా అటు రాజకీయంగా ఇటు మేధోపరంగా ఆత్మన్యూనతతో బాధపడుతున్నారనీ, నెహ్రూ జరిపిన సంభాషణ సత్తా ద్వారా మనకు అర్థమవుతోంది. ఆయన సంభాషణల నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోగలుగుతాం. మన దేశ ప్రయోజనాల కోసం ఆ సంభాషణలు, రచనలు, వీడియోలను ఉపయోగిం చుకోవాలి. ❑

# ధర్మాన్ని ఎరుక పరిచిన నైతికయాత్ర



ప్రొ. జి.హరగోపాల్

**ఆయనతో చర్చించినప్పుడు మేం గమనించింది, మనిషి నిరాడంబరంగా, స్నేహ పూరితంగా మాట్లాడటమే కాక సమస్యలను అవగాహన చేసుకోవడానికి నిజాయితీగా ప్రయత్నం చేస్తున్నాడనిపించింది. చోటా మోటా రాజకీయ నాయకులు అహంకారపూరితంగా మారి, మాట్లాడటానికే సిద్ధంగా లేని కాలంలో ఒక ప్రముఖ పార్టీ నాయకుడికి ఈ లక్షణాలు ఉండడం హర్షించదగ్గ విషయమే. ఆయన అధికారపీఠం మీద కూర్చుంటే ఎలా మారుతారో చూడవలసిందే.**

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర (7 సెప్టెంబర్ 2022–30 జనవరి 2023) కన్యాకుమారిలో ప్రారంభమై జమ్మూ-కశ్మీర్‌లో ముగిసింది. కశ్మీర్ ప్రజలు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో మొత్తం పాదయాత్రకు ఒక విశేషమైన ప్రాధాన్యం వచ్చింది. కశ్మీర్ ప్రజలు కొంత కాలంగా గాలి పీల్చుకోవడానికి కూడా వీలులేని పరిస్థితి నుంచి సామాజిక సామరస్యత పేర ఒక ప్రముఖ పార్టీ రాజకీయ నాయకుడు పాదయాత్ర చేస్తూ తమ మధ్యకు రావడం వాళ్లలో కొత్త ఉత్సాహాన్ని కలిగించినట్లు కనిపించింది. ఒక్క కశ్మీర్‌లోనే కాదు దేశ వ్యాప్తంగా గత దశాబ్దకాలం నుంచి ఒక భయానక పరిస్థితి నెల కొంది. రాజ్యం తన అన్ని ఏజెన్సీలని, అన్ని నిర్బంధ చట్టాలని తమ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా దురుపయోగించడమే కాక ఏ రంగాన్ని కూడా వదిలిపెట్టకుండా ప్రతి రంగం మీద దాడి చేస్తున్నది. ప్రజాస్వామ్యవాదులు, ఉద్యమకారులు, సామాజిక సంస్థల కార్యకర్తలు, కవులు, కళాకారులు, రచయితలు, జాతీయ అవార్డులు పొందిన వారితో సహా అందరూ ప్రభుత్వ ఏజెన్సీల నిర్బంధానికి గురయ్యారు, అవుతున్నారు. తమ రాజకీయాలతో విభేదించిన వారిని అర్బన్ నక్సలైట్లు అని ముద్ర వేసి జైళ్లపాలు చేస్తున్నారు. దీనికి భీమా కోరెగాం ఒక కొట్టవచ్చిన ఉదాహరణ.

రాజకీయాలు ప్రజల జీవన్మరణ సమస్యలను పరిష్కరించే బదులు అభివృద్ధి నినాదంతో గతంలో ఎన్నడూ లేని అసమానతలను సృష్టించాయి. ఈ అభివృద్ధి నమూనాకు బీజాలు వేసింది కాంగ్రెస్ పార్టీయే. ఆ పార్టీ నాయకులు ఈ అభివృద్ధి నమూనాకు మద్దతు ఇచ్చి పెంచి పోషించారు. ఒక దశాబ్దకాలం నిరాఘాటంగా నియోలిబరల్ ఆర్థిక నమూనాని అమలుచేశారు.



ఈ నమూనా సృష్టించిన భిన్న చిక్కుముడులలో చిక్కుకొని చివరకు 2014లో అధికారాన్ని కోల్పోయారు. ఇదే అభివృద్ధి నమూనాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మరింత నిర్దాక్షిణ్యంగా అమలు చేస్తున్నది. కాంగ్రెస్‌కు లేని కొన్ని శక్తులు బీజేపీకి అనుకూలించాయి. ప్రధానంగా, ఈ రాజకీయ పక్షం మాతృ సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, దాని అనుబంధ సంస్థలు క్షేత్రస్థాయి దాకా విస్తరించి ఉన్నాయి. దీనికితోడు కార్పొరేటు మీడియా, సోషల్ మీడియా విపరీతంగా విస్తృతి చెందింది. ఈ పార్టీకి మతపరమైన భావజాలముంది. ఆర్థిక వనరులు అపరిమితంగా అందుబాటులో ఉన్నాయి. రాజకీయాలు ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించే స్థితిలో లేనప్పుడు ప్రజల దృష్టిని వాస్తవమైన సమస్యల నుంచి ఇతర అంశాలకు మళ్లించడం ప్రపంచవ్యాప్తంగా చూస్తున్నాం. ఇప్పుడు మన దేశ రాజకీయాలలో కూడా జరుగుతున్నది అదే. సమాజ పరిణామక్రమంలో మతం పాత్ర ఇంకా మిగిలే ఉన్నది. గురజాడ చెప్పిన 'మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటె మిగిలి వెలుగును' అనే స్థాయికి సమాజం చేరుకోలేదు. రాజ్యం, మార్కెట్, శాస్త్రీయ విజ్ఞానం మతంతో చాలా తలపడ్డాయి. దీనివల్ల పాశ్చాత్య దేశాల్లో మతం చాలా వరకు వ్యక్తిగత విశ్వాసంగా మిగిలింది. అభివృద్ధి చెందుతున్న భారతదేశం వంటి దేశాల్లో భిన్నమైన అంతరాలు, అసమానతలు, ఆధిపత్యాలు తగినన్ని అవకాశాలు లేకపోవడం, విద్య వైద్యం వంటివి అందుబాటులో లేకపోవడం వల్ల మతవిశ్వాసాలు

బలపడుతున్నాయి. రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా నియోలిబరల్ ఆర్థిక నమూనా సమాజాన్ని సంక్షోభంలోకి నెట్టినకొద్దీ రాజకీయాల్లో భావజాలం మారి రాజ్యాంగ విలువలకు భిన్నంగా మత విశ్వాసాలని విద్వేషాలుగా మార్చడంతో సహజీవనం, సమభావనం అనే ఉదాత్త విలువలకు విఘాతం కలిగింది. మతాల మధ్య, సమూహాల మధ్య నిచ్చెనమెట్ల కులాల మధ్య హింస పెరిగింది. దళితుల, ఆదివాసీల, మహిళల మీద కూడా హింస పెరుగుతున్నది. అన్నిరకాల సామాజిక సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత సంక్షోభంలో చిక్కుకున్నాయి. తమ జీవితంలో ఉండే అసమగ్రతకు, ఆందోళనకు, అభద్రతకు లోపభూయిష్ట వ్యవస్థలో కారణాలు చూసే బదులు వీటికి కారణం ఇతర మతస్థులని, సమూహాలనే ప్రచార రాజకీయాల విషవలయంలో చిక్కుకున్నారు. ఈ సమాజం ఎటుపోతున్నది అన్న మౌలిక ప్రశ్న అడగనంతకాలం ఈ సంక్షోభం ఏదో ఒక రూపంలో కొనసాగుతుంది.

ఈ రాజకీయ, సామాజిక, ఆర్థిక సందిగ్ధకాలంలో, అన్ని సమస్యలను కాకపోయినా సమాజంలో సహజీవన అవసరాన్ని, సమ్మిళిత సంస్కృతి విలువని ఎత్తిపట్టడం రాహుల్ గాంధీ తన పాదయాత్ర లక్ష్యంగా పేర్కొన్నారు. పాదయాత్రకు ఊహించిన దానికంటే ప్రజల నుంచి విస్తృత స్పందన వచ్చింది. దీనిని తాను కూడా ఊహించలేదని రాహుల్ గాంధీ కశ్మీర్‌లోని పత్రికా విలేఖరుల సమావేశంలో అన్నారు. ఈ సుదీర్ఘ పాదయాత్రకు అన్ని ప్రాంతాల నుంచి, అన్ని సమూహాల నుంచి స్పందన వచ్చింది. ఈ స్పందన లోతుపాతులను ఇంకా లోతుగా పరిశీలించవలసి ఉంది. కానీ సహజీవన ఆకాంక్ష సమాజంలో ఇంకా మిగిలి ఉన్నదన్న ఒక విశ్వాసాన్ని ఈ పాదయాత్ర కలిగించింది. రాహుల్ గాంధీ పాదయాత్ర ప్రారంభం కాక ముందు గత మే నెలలో హైదరాబాద్ వచ్చినప్పుడు స్థానిక కాంగ్రెస్ కోరిక మేరకు ఐదారుమంది మిత్రులం ఆయనను కలిసి ఒక గంటసేపు మాట్లాడాం. ఈ సందర్భంలో పౌరహక్కుల కార్యకర్తగా దేశంలోని నిర్బంధ చట్టాల గురించి చెపుతూ, ఈ చట్టాలు కాంగ్రెస్ కాలంలోనే ప్రవేశపెట్టారని, వాటికి భారతీయ జనతాపార్టీ మరింత పదునుపెట్టి దేశవ్యాప్తంగా ఉపయోగిస్తున్నదని, ప్రజాస్వామ్య వ్యవస్థకు, పౌరహక్కులకు ఇవి చాలా ప్రమాదకరమని చెపుతూ, ఉపా వంటి చట్టం ప్రభుత్వ యంత్రాంగానికి ఎంత విచ్చలవిడి అధికారాలిచ్చిందో వివరిస్తూ, ఈ చట్టాలను ఎత్తివేయాలని సూచించాం. ఇదే అంశాన్ని తెలంగాణ పౌరహక్కుల సంఘం లిఖిత రూపంలో ఇచ్చిన పత్రాన్ని నేను మూడవ పర్యాయం కలిసినప్పుడు ఆయనకు ఇచ్చాను. ఆ పత్రాన్ని జాగ్రత్తగా తీసుకుని తన జేబులో పెట్టుకున్నాడు. రెండవ పర్యాయం పాలమూరు అధ్యయన వేదిక సభ్యులం ఆయనను కలిశాం. ఈసారి సూటిగా కాంగ్రెస్ పార్టీ అభిమానులం కాదని, కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుడు విధానాలను నిరంతరంగా విమర్శిస్తూ మాట్లాడాం, రాశాం అని చెపుతూ... 'మీరు ప్రవేశపెట్టిన సామ్రాజ్యవాద నియోలిబరల్ అభివృద్ధి నమూనా ప్రజలకు హాని చేయడం వల్ల మీరు 2014 ఎన్నికలలో ఓడిపోయారు' అని అన్నప్పుడు మేం అమలుచేసిన నియోలిబరలిజం ఎంత కాదన్నా సాఫ్ట్ నియోలిబరలిజం, కాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం నియోలిబరలిజాన్ని నిర్దాక్షిణ్యంగా అమలుచేస్తున్నా రెండవ పర్యాయం కూడా ఎందుకు గెలిచారు అనే ప్రశ్న వేశారు. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రజా ఉద్యమాల మీద దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఆయనను కలవడానికి చాలామంది ఎదురు చూస్తుండడంతో సమయాభావం వల్ల లోతైన విశ్లేషణ సాధ్యం కాలేదు. కాంగ్రెస్ పార్టీ విధానాల పట్ల మాకు విమర్శ ఉన్నా, ఫాసిజం అందరి ఇంటి తలుపులు తడుతున్నప్పుడు ఏ చిన్న ప్రజాస్వామ్య ప్రయత్నాన్నయినా సమర్థించాలనే ఉద్దేశంతో ఆయనను కలుస్తున్నాం అని చెప్పాం. అలాగే తెలంగాణలో ఆయన యాత్ర ముగుస్తున్న సందర్భంలో మరోసారి కలిసినప్పుడు దక్షిణ భారతదేశంలో తన పరిశీలనను వివరిస్తూ, పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల ఆలోచనలు చాలా అస్పష్టంగా ఉన్నాయి, ఎందుకు? అనే ప్రశ్న అడిగాడు. ఈ పర్యాయం చర్చ కొంత విస్తృతంగానే జరిగింది. ఈ మూడు పర్యాయాలు ఆయనతో చర్చించినప్పుడు మేం గమనించింది, మనిషి నిరాడంబరంగా, స్నేహపూరితంగా మాట్లాడటమే కాక సమస్యలను అవగాహన చేసుకోవడానికి నిజాయితీగా ప్రయత్నం చేస్తున్నాడనిపించింది. చోటా మోటా రాజకీయ నాయకులు అహంకారపూరితంగా మారి, మాట్లాడటానికే సిద్ధంగా లేని కాలంలో ఒక ప్రముఖ పార్టీ నాయకుడికి ఈ లక్షణాలుండడం హర్షించదగ్గ విషయమే. ఆయన అధికారపీఠం మీద కూర్చుంటే ఎలా మారుతారో చూడవలసిందే.

సాధారణ సమయాల్లో ఈ పాదయాత్రకి ఇంత ప్రాముఖ్యత ఉండేది కాదు. కాని ఒక దశాబ్దకాలం రాజకీయాలు, సామాజిక సంబంధాలలో చాలా తీవ్రమైన వక్రీకరణకు గురైనప్పుడు ఈ ప్రయోగానికి ఒక ప్రాయోజికత ఉంది. భారత ప్రజల సహజీవన సంస్కృతిని కాపాడడమే కాక మత, కుల, లింగపర వివక్షతో పాటు, నిచ్చెనమెట్ల సంబంధాలు ప్రజాస్వామ్యీకరించాలి అనే స్వాతంత్రోద్యమ ఆకాంక్ష, అలాగే స్వాతంత్ర్యానంతరం జరుగుతున్న ప్రజాస్వామ్య పోరాటాల ఆశయాన్ని ఎలా కాపాడుకోవాలి అనే సందిగ్ధ దశలో మనం ఉన్నాం. ఈ విలువలని కాపాడి (మిగతా 15లో)

# ద మోడీ క్వశ్చన్..
# బీబీసీ కథనం




ఎం.కోటేశ్వరరావు

**కొన్ని అంశాలను ఎంతగా మూసి పెట్టాలని చూసినా సాధ్యం కాదు. తమకు హానికరం కాదనుకున్న అనేక నివేదికలను పశ్చిమ దేశాలు వెల్లడిస్తుంటాయి. వాటిని చూసి మన దేశంలో అనేక మంది పాత సంగతులను ఎందుకు వెల్లడించకూడదు అనుకుంటారు. గోద్రా రైలు దుర్ఘటన పేరుతో జరిపిన 2002 గుజరాత్ మారణకాండ గురించి బ్రిటన్ రాయబారి తమ ప్రభుత్వానికి పంపిన నివేదికల్లోని అంశాలను బహిర్గతం చేస్తే కొంత మంది ఇప్పుడు ధూం ధాం అంటూ మండిపడుతున్నారు. తమ రాయబారి పంపిన అంశాలను బ్రిటన్ సరికొత్త పద్దతుల్లో వెల్లడికావించింది.**

బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి) రెండవ ఛానల్ భారత్ : మోడీ వివాదం (ఇండియా : ద మోడీ క్వొశ్చన్) పేరుతో 2023 జనవరి 17న ప్రసారం చేసిన పరిశోధనాత్మక డాక్యుమెంటరీ తొలి భాగం ఆ దురంతాలను గుర్తుకు తెచ్చి మరోసారి నరేంద్రమోడీ, సంఘపరివార్ సంస్థల పేర్లను జనం నోళ్లలో నానేట్లు చేసింది. బిబిసికి సమాచారం ఇచ్చిన తీరు మీద బ్రిటన్ ప్రభుత్వాన్ని ఖండించలేని నిస్సహాయ స్థితికి ప్రపంచంలో ఎదురులేదని చెబుతున్న నరేంద్రమోడీని నెట్టింది. ప్రతిస్పందిస్తే మరింత పరువు పోతుంది అన్నట్లుగా మాట్లాడ కూడదని నిర్ణయించింది. పైకి మాట్లాడినా మాట్లాడకున్నా ప్రపంచమంతా మోడీ గురించి మరోసారి అవలోకిస్తుంది.

ఈ డాక్యుమెంటరీ వక్రీకరణలతో ప్రచారం కోసం నిర్మించిం దని, ఒక నిర్దిష్టమైన పరువు తక్కువ కథనాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు రూపొందించినదని, దాని మీద ఇంతకు మించి స్పందించి గౌరవించదగినది కాదని విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చీ పేర్కొన్నారు. సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. వివాదం తలెత్తటంతో ఈ డాక్యుమెం టరీని యూట్యూబ్ నుంచి తొలగించారు. ఈ నెల 24న మరొక భాగం ప్రసారం కావాల్సి ఉంది. తమ కథనాన్ని బిబిసి సమర్థిం చుకుంది. ఉన్నతమైన సంపాదక ప్రమాణాలకు అనుగుణంగా తీవ్రంగా పరిశోధించిన తరువాత రూపొందించినట్లు




పేర్కొన్నది. భిన్న గళాలు, అభిప్రాయాలు వెలిబుచ్చే వారిని, నిపుణులను తాము కలిశామని, బిజెపికి చెందిన వారి స్పందనలతో సహా పలు అభిప్రాయాలకు దానిలో తావిచ్చామని, తమ డాక్యుమెంటరీలో లేవనెత్తిన అంశాలకు తగిన సమాధానం ఇవ్వాలని భారత ప్రభుత్వాన్ని కోరగా స్పందించేందుకు తిర స్కరించినట్లు బిబిసి తన ప్రకటనలో పేర్కొన్నది. గుజరాత్ ఉదం తాలు, నరేంద్రమోడీ పాత్ర గురించి ఒక చిత్రాన్ని రూపొంది స్తున్నట్లు అది ప్రసారంగాక ముందే కేంద్ర ప్రభుత్వానికి తెలుసు అని బిబిసి ప్రకటన చెబుతున్నది. చర్చ మరింత జరిగితే నరేంద్రమోడీ, బిజెపికి మరింత నష్టం గనుక కేంద్రం నుంచి లేదా బిజెపి దీని గురించి ముందు ముందు ప్రస్తావించకపో వచ్చు. మొత్తంగా మీడియా నరేంద్ర మోడీకి అనుకూలంగా ఉన్నప్పటికీ పరిమితంగానైనా వార్తలు ఇవ్వకపోవచ్చు, చర్చలు జరపకపోవచ్చు. అంత మాత్రాన రచ్చగాకుండా ఉంటుందా జనం చర్చించకుండా ఉంటారా ?

ఏ దేశంలోనైనా పెద్ద ఉదంతాలు జరిగినపుడు ఆ దేశంలో ఉన్న విదేశీ రాయబార కార్యాలయాలు మనదేశంతో సహా తమ వనరులు, సంబంధాల ద్వారా సమాచారాన్ని సేకరించి వాటిని తమ దేశాలకు చేరవేస్తాయి. వికీలీక్స్ వెల్లడించిన కోట్ల కొద్దీ పత్రాలవే. గుజరాత్ ఉదంతాల గురించి బ్రిటీష్ రాయబార కార్యాలయం అలాంటి నివేదికనే ఇచ్చినట్లు దానిలోని అంశాలను డాక్యుమెంటరీ వెల్లడించింది. బిబిసికి వాటిని అందించారంటే బ్రిటన్ ప్రభుత్వం తొలిసారిగా వాటిని బహిర్గత పరిచినట్లే. అందువలన ఈ డాక్యుమెంటరీ గురించి, దానిలో

పేర్కొన్న అంశాల సంగతి ఏమిటని పార్లమెంటులో ప్రతిపక్ష లేబర్ పార్టీ ఎంపీ ప్రస్తావించినపుడు నోరు మూయించేందుకు ప్రధాని రిషి సునాక్ చూశాడు. సమాధానంగా ఏమి చెప్పి నప్పటికీ అది మొహమాటంతో చెప్పినవిగానే పరిగణించాలి. నివేదికలోని అంశాలు వాస్తవమా కాదా అని చెప్పకుండా డొంక తిరుగుడు సమాధానమిచ్చాడు. పాకిస్థాన్ మూలాలున్న ఎంపీ ఇమ్రాన్ హుసేన్ డాక్యుమెంటరీ గురించి ప్రస్తావించగా దానితో తమకు సంబంధం లేదని, దానిలో భారత ప్రధాని గురించి చిత్రీకరించిన తీరును తాను అంగీకరించటం లేదని రిషి సునాక్ చెప్పాడు. మత విద్వేష హింస ఎక్కడ జరిగినా తాము సహించ బోమని, అయితే నరేంద్రమోడీ పాత్రను చిత్రించిన తీరును తాను అంగీకరించనని అన్నాడు. ఇంత రచ్చ జరిగిన తరువాత కూడా బిబిసి చిత్రంలో వెల్లడించిన అంశాల గురించి అధికారి కంగా ఎలాంటి ప్రకటన రాలేదు. మరో భాగాన్ని ప్రసారం చేస్తారా లేదా అన్నది చెప్పలేదు. డాక్యుమెంటరీలో పేర్కొన్న దాని ప్రకారం నాటి బ్రిటన్ దౌత్యవేత్త పంపిన సమాచార పత్రానికి పెట్టిన శీర్షిక, సంగ్రహము ఇలా ఉంది.

**నిజానికి అంతర్జాతీయ ఎత్తులు జిత్తులలో భాగంగా చైనాకు వ్యతిరేకంగా అమెరికా, బ్రిటన్ ముందుకు తెచ్చిన కూటముల్లో మన దేశం చురుకుగా ఉంది. మన మీడియా వర్ణించినట్లుగా "మనవాడు" రిషి సునాక్ బ్రిటన్ ప్రధానిగా ఉన్నప్పటికీ సుప్రీం కోర్టు తీర్పు మోడీకి క్లీన్ చిట్ ఇచ్చిన తరువాత కూడ బిబిసి ఇలాంటి చిత్రాన్ని ప్రసారం చేయటం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. నిజమే బ్రిటన్ విదేశాంగ శాఖ వద్ద ఉన్న నివేదికలను కూడా సుప్రీం కోర్టుకు సమర్పించి దాని మీద విచారణ జరిగిన తరువాత బిబిసి ఆపని చేసి ఉంటే ఆ వాదనకు అర్థం ఉంది. అలా జరగలేదే.**

### విషయము : గుజరాత్ మారణకాండ

"వెల్లడైనదాని కంటే హింస చాలా ఎక్కువగా ఉంది. కనీసం రెండు వేల మంది మరణించారు. పథకం ప్రకారం పెద్ద ఎత్తున ముస్లిం మహిళల మీద అత్యాచారాలు జరిగాయి. లక్షా 38 వేల మంది నిరాశ్రయులయ్యారు. హిందువులు ఉండేచోట, హిందువులు-ముస్లింలు కలసి ఉన్న ప్రాంతాలలో ముస్లింల వ్యాపారాలను లక్ష్యంగా చేసుకొని విధ్వంసం కావించారు. పథకం ప్రకారం హింస జరిగింది. కొన్ని నెలల ముందుగానే పథకం వేసి ఉండవచ్చు. రాజకీయ ప్రేరేపితమైనది. హిందువులుండే ప్రాంతాల నుంచి ముస్లింలను తరమివేయటమే లక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వ రక్షణలో దీనికి విహెచ్‌పి (హిందూ ఉగ్రవాద సంస్థ) నాయకత్వం వహించింది. మోడీ ముఖ్య మంత్రిగా ఉండగా ఐకమత్యము అసాధ్యం. వారి(హిందూ మూకలు) పథకం ప్రకారం సాగించిన హింసలో నిర్దిష్ట జాతి నిర్మూలన లక్షణాలన్నీ ఉన్నాయి. శిక్షలేమీ ఉండవనే వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించకుండా విహెచ్‌పి అంత ఎక్కువ నష్టం కలిగించి ఉండేది కాదు. దీనికి నరేంద్రమోడీ నేరుగా బాధ్యుడు."

ఇంతే కాదు, డాక్యుమెంటరీ వెల్లడించిన దాని ప్రకారం బ్రిటన్‌తోపాటు ఐరోపా సమాఖ్య కూడా విచారణ జరిపింది. వాటిసారం ఒక్కటే. హింసాకాండలో మంత్రులు చురుకుగా భాగస్వాములయ్యారు. దాడుల్లో జోక్యం చేసుకోవద్దని సీనియర్ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విశ్వసనీయమైన వారు చెప్పినదాని ప్రకారం 2002 ఫిబ్రవరి 27న నరేంద్రమోడీ సీనియర్ పోలీసు అధికారులతో సమావేశమై జోక్యం చేసుకోవద్దని ఆదేశించారు. అసలు అలాంటి సమావేశం జరగలేదని పోలీసు అధికారి ఒకరు చెప్పినట్లు బిబిసి తన కథనంలో పేర్కొన్నది. సమావేశం జరిగిందని అంగీకరిస్తే మోడీ ఆదేశాలను అమలు జరిపినట్లుగా అంగీకరించినట్లవుతుంది, ఆ ఉదంతాలకు స్వయంగా కారకులని అంగీకరించినట్లవుతుంది కనుక అసలు సమావేశమే జరగలేదని చెప్పినట్లు పేర్కొన్నది. నాడు ఇంటలిజెన్స్ విభాగ అధిపతిగా ఉన్న ఆర్‌బి శ్రీకుమార్, మరో అధికారి సంజీవ భట్, మరో అధికారి మాత్రం నరేంద్ర మోడీ ఆదేశాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. సదరు సమావేశంలో అసలు వారెవరూ పాల్గొనలేదని అదే కథనంలో మరొక పోలీసు అధికారి చెప్పిన అంశాన్ని డాక్యుమెంటరీలో పేర్కొన్నారు. మరొక కేసులో సంజీవ భట్ ప్రస్తుతం జీవిత ఖైదు అనుభవిస్తున్నారు.

ఈ కథనంలో లేదా నరేంద్రమోడీ మద్దతుదార్లు, బిజెపి ఏమి చెప్పినా కొన్ని సందేహాలకు సరైన సమాధానం రాలేదు. అంతటి తీవ్ర శాంతి భద్రతల సమస్య తలెత్తినపుడు ఏ సిఎం అయినా ఇంటలిజెన్స్ అధికారిని పిలిపించకుండా, ఉన్నతాధికారుల సమావేశం జరపకుండా, నిర్ణయాలు తీసుకోకుండా ఉంటారా ? "స్నేహ పూర్వకంగా ఉన్న ఒక దేశాధినేత గురించి గతంలో బిబిసిలో అలాంటి విమర్శ వచ్చినట్లు నాకు గుర్తు లేదు. కనుక సహజంగా ఒక ప్రశ్న తలెత్తుతుంది. అదేమంటే భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని గట్టిగా కోరుకుంటూ

ప్రస్తుతం బ్రిటన్ ప్రభుత్వం సున్నితమైన చర్చల్లో మునిగి ఉన్నపుడు గుజరాత్ కొట్లాటలపై విస్ఫోటకం వంటి చిత్రాన్ని ప్రసారం చేయాలని బిబిసి ఎందుకు నిర్ణయించినట్లు" అని మన విదేశాంగశాఖ మాజీ కార్యదర్శి ఒకరు ప్రశ్నించినట్లు బిబిసి పేర్కొన్నది. నిజమే, వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరుపుతున్న తరుణంలో ఇలాంటి అంశాలతో కూడిన చిత్రాన్ని ప్రసారం చేస్తే హానికలిగే అవకాశం ఉంటుంది, ఇతర సం బంధాలు ప్రభావితం అవుతాయి. కనుక ఏ ప్రభుత్వమైనా తన దగ్గర ఉన్న సమాచారాన్ని, అందునా ప్రభుత్వ నిధులతో నడిచే ఒక మీడియా(బిబిసి) సంస్థకు అందచేసి బహిర్గతపరి చేందుకు అనుమతిస్తుందా ? కారణం ఏదైనా బ్రిటన్ ప్రభుత్వం అందించింది, ప్రసారానికి అనుమతి ఇచ్చింది.

గుజరాత్ మారణకాండ జరిగినపుడు బ్రిటన్ విదేశాంగ మంత్రిగా ఉన్న జాక్ స్ట్రా ఆ ఉదంతాలపై నివేదిక ఇవ్వాలని కోరాడు. హెూంమంత్రిగా జాక్ స్ట్రా పనిచేసినపుడు బ్రిటన్ సమాచార స్వేచ్ఛ చట్టాన్ని 2000లో తెచ్చారు. దాన్ని సమీక్షించేందుకు 2015లో ఏర్పాటు చేసిన ఒక కమిటీలో జాక్ ఉన్నాడు. బహుశా సమాచార కమిషన్‌తో ఉన్న దగ్గరి సంబం ధాల కారణంగా గుజరాత్ నివేదికలను బహిర్గతం కావించేం దుకు అతగాడు ఒక పాత్ర పోషించి ఉండవచ్చని భావిస్తున్నారు. జాక్ స్ట్రా లేబర్ పార్టీ నేత కనుక టోరీ పార్టీ ప్రధాని రిషి సునాక్‌ను ఇబ్బందుల్లోకి నెట్టేందుకు చూసి ఉండవచ్చు అను కుంటే, అధికారంలో ఉన్న పార్టీ, మంత్రులు, అధికారులు ఎందుకు సహకరించినట్లు అన్న ప్రశ్న వెంటనే వస్తుంది.

రాయబార కార్యాలయం పంపిన నివేదికలో నరేంద్రమోడీ పాత్ర గురించి స్పష్టంగా చెప్పిన కారణంగానే ఆ తరువాత బ్రిటీష్ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించింది. బ్రిటన్‌లోని హిందూత్వ సంస్థల ఆహ్వానం మేరకు 2003లో నరేంద్రమోడీ అక్కడికి వెళ్లారు. దాని మీద తలెత్తిన విమర్శలతో "నరేంద్ర మోడీ బ్రిటన్ సందర్శన గురించి మాకు తెలుసు, ప్రభుత్వ ఆహ్వానం మేరకు అతను రావటం లేదు, ఇక్కడ ఉన్నపుడు అతనితో ఎలాంటి సంబంధాలూ ఉండవు " అని బ్రిటన్ సర్కార్ ప్రకటించింది. మోడీ బ్రిటన్ వెళ్లినపుడు భారత డిప్యూటీ హైకమిషనర్‌గా ఉన్న సత్యవ్రత పాల్ తరువాత రాసిన దానిలో ఇలా ఉంది" విదేశాంగశాఖ మంత్రి (యశ్వంత సిన్హా) ప్రధాని వాజ్‌పాయి దగ్గరకు వెళ్లారు. ఆ పర్యటన వాంఛనీయం కాదు, రద్దు చేసుకోవాల్సిందే అన్న వైఖరితో ప్రధాని కూడా అంగీకరించారు." ఐనా సరే జరిగింది అంటే సంఘ పరివార్ వత్తిడి కారణం అన్నది స్పష్టం. ఇక మోడీ బ్రిటన్‌లో ఉండగా ఇమ్రాన్‌ఖాన్ అనే లాయరు మోడీని అరెస్టు చేయాలని అక్కడ కోర్టుకు వెళ్లారు, కోర్టు అంగీకరించలేదు. ఇప్పుడు బిబిసి వెల్లడించిన సమాచారం గనుక ఆ నాడు తన వద్ద ఉండి ఉంటే మోడీ అరెస్టుకు దారితీసేదని ఇమ్రాన్‌ఖాన్ అన్నాడు. అదే సర్కార్ తరువాత 2005లో మోడీ వీసాను రద్దు చేసింది. అమెరికా కూడా వీసాను రద్దు చేసింది. సిఎంగా ఉన్నపుడు మోడీ రాకను అడ్డుకుంది. తరువాత 2014లో నరేంద్రమోడీ ప్రధాని కాగానే ఈ రెండు దేశాలూ వీసాను పునరుద్దరించి దేశాధినేతగా స్వాగతం పలికాయి. ఒక దేశంలో ఒక రాష్ట్రానికి సిఎంగా ఉండటం వేరు, ప్రధానిగా దేశాధినేతగా ఉండటం వేరు గనుక తామా పని చేశామని, ఒక్క నరేంద్రమోడీకే కాదు సౌదీ అరేబియా రాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌కు సైతం వీసా పునరుద్దరించామని,అది సంప్రదాయమని 2022 నవంబరులో అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. తమ ప్రాణాలకు భద్రత గురించిన భయంతో భారత్‌కు చెందిన 30 మంది డాక్యుమెంటరీలో మాట్లాడేందుకు తిరస్కరించినట్లు బిబిసి పేర్కొన్నది. భారత ప్రభుత్వం కూడా దానిలో పేర్కొన్న అంశాలపై స్పందించేందుకు నిరాకరించింది అనికూడా వెల్లడించింది. ఈ నెల 24న ప్రసారం కానున్న రెండవ భాగంలో 2019 తరువాత మోడీ సర్కార్ తీరు తెన్నుల గురించి వివరించనుంది. ఈ చిత్రం గురించి పలు కుట్ర సిద్దాంతాలను ముందుకు తెస్తున్నారు. నిజానికి అంతర్జాతీయ ఎత్తులు జిత్తులలో భాగంగా చైనాకు వ్యతిరేకంగా అమెరికా, బ్రిటన్ ముందుకు తెచ్చిన కూటముల్లో మన దేశం చురుకుగా ఉంది. మన మీడియా వర్ణించినట్లుగా "మనవాడు" రిషి సునాక్ బ్రిటన్ ప్రధానిగా ఉన్నప్పటికీ సుప్రీం కోర్టు తీర్పు మోడీకి క్లీన్ చిట్ ఇచ్చిన తరువాత కూడ బిబిసి ఇలాంటి చిత్రాన్ని ప్రసారం చేయటం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. నిజమే బ్రిటన్ విదేశాంగ శాఖ వద్ద ఉన్న నివేదికలను కూడా సుప్రీం కోర్టుకు సమర్పించి దాని మీద విచారణ జరిగిన తరువాత బిబిసి ఆపని చేసి ఉంటే ఆ వాదనకు అర్ధం ఉంది. అలా జరగలేదే. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నరేంద్రమోడీని బదనాం చేసేందుకు ఇలా చేశారని చెబుతున్నారు. బ్రిటన్ను ప్రభావితం చేసే స్థితిలో ఇప్పుడు అమెరికా తప్ప మరొక దేశం లేదు. అదే వాస్తవమైతే ఆ పని 2014, 2019 ఎన్నికలపుడే చేసి ఉండవచ్చు. దాని వలన బిబిసికి, బ్రిటన్ ప్రభుత్వానికి కలిగే లబ్ది ఏమిటి ? ఊరకరారు మహాత్ములు అన్నట్లుగా బిబిసి ఉత్తినే ఈ చిత్రాన్ని ప్రసారం చేస్తుందా ? దీని వెనుక ఉన్న అసలు సంగతి ఏమిటో వెల్లడిగాక తప్పదు. ❑

**తమ ప్రాణాలకు భద్రత గురించిన భయంతో భారత్‌కు చెందిన 30 మంది డాక్యుమెంటరీలో మాట్లాడేందుకు తిరస్కరించినట్లు బిబిసి పేర్కొన్నది.**

# బ్యాంకులను ప్రైవేటీకరిస్తే వచ్చే ప్రమాదాలు



– ప్రభాత్ పట్నాయక్

ప్రభుత్వ రంగ బ్యాంకులను కొన్నింటినైనా ప్రయివేటీ కరించాలని ప్రభుత్వం పథకాలు వేస్తోంది. అదే గనుక జరిగితే ఉత్పత్తిని పెంచడానికి ఇంతవరకూ అందిస్తున్న బ్యాంకు రుణాలు ఇక ముందు స్పెక్యులేషన్ వైపు మళ్ళుతాయి. రైతులకు రుణాలు ఇచ్చే బదులు బడా వ్యాపారులకు ఇస్తారు (దీంతో రైతు వ్యవసాయం చితికిపోయి. ఆహార భద్రత కరువౌతుంది, ఉపాధి దొరకకుండాపోతుంది). దేశీయ అవసరాలను పట్టించుకోకుండా విదేశాలకు పెట్టుబడి తరలిపోతుంది. ఈ అభ్యంతరాలన్నీ అందరికీ తెలిసినవే. అందరూ చర్చించినవే. 2008లో తలెత్తిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రభావం మన దేశాన్ని దెబ్బ తీయకుండా కాసుకున్నవి ప్రభుత్వ రంగ బ్యాంకులే అన్న వాస్తవం ఈ అభ్యంతరాలెంత ప్రాధాన్యత కలిగినవో సూచిస్తోంది. కాని ఈ ప్రభుత్వానికి దేశం బాగుండాలన్న ధ్యాసలేదు. ఎంతసేపూ దేశీయ, విదేశీయ బడా కార్పొరేట్లను ఏ విధంగా సంతృప్తి పరచాలా అన్నదే దాని యావ అంతా. అయితే, ఈ అభ్యంతరాలకు తోడు మరో తీవ్ర ప్రమాదం పొంచి వుంది. దేశం దానిని గనుక విస్మరిస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి.

దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం నియంత్రణ ఉన్న కాలంలో, అంటే, నయా ఉదారవాద విధానాలను అమలు చేయడానికి ముందు కాలంలో, బ్యాంకులు స్వల్పకాలిక రుణాలపై ప్రధానంగా దృష్టి సారించాయి. వ్యాపారంలో, పరిశ్రమల్లో సరుకులను సమీకరించుకోడానికి ప్రధానంగా రుణాలు ఇచ్చాయి. ఇక స్థిర పెట్టుబడిని (యంత్రాలు భవనాలు వగైరా) సమకూర్చుకోడానికి, కావలసిన దీర్ఘకాలిక రుణాలను అందించడానికి వేరే ప్రత్యేకమైన ఆర్థిక సంస్థలను ఏర్పాటు




**ప్రభుత్వరంగ సంస్థల మీద అనుచితంగా వత్తిడి తెచ్చి వాటిని పారుబకాయిల పాలు చేస్తున్నదీ ఈ ప్రభుత్వమే. ఇప్పుడు ఆ బ్యాంకులను ప్రయివేటీకరించి తన చేతులు దులుపుకోవాలని చూస్తున్నదీ ఆ ప్రభుత్వమే. దీనివలన డిపాజిటర్లకు తీరని ఆర్థిక నష్టం వాటిల్లడమే గాక, ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థ మీదే విశ్వాసం సన్నగిల్లుతుంది. దాంతో వాళ్ళు బ్యాంకుల్లో దాచుకోవడం మానేసి నగదు రూపంలో నిల్వ ఉంచుకోడానికే మొగ్గు చూపుతారు. దానివలన దేశాభివృద్ధికి అవసరమైన పెట్టుబడుల సమీకరణ దెబ్బతినిపోయి అభివృద్ధి చాలా కాలం పాటు స్తంభించి పోతుంది.**

చేశారు. ఆ సంస్థలకు రిజర్వు బ్యాంకు వంటి ప్రభుత్వ వనరుల నుండి నిధులు అందించారు. ఆ రుణాలకు వడ్డీలు బ్యాంకులు సాధారణంగా వసూలు చేసే వడ్డీరేటు కన్నా తక్కువగా ఉండేవి. చాలా సందర్భాల్లో అప్పటి ధరల పెరుగుదల వేగం కన్నా తక్కువగా వడ్డీ రేటు ఉండేది (నెగెటివ్ రేటు అంటాం). ఆ విధంగా పెట్టుబడులు పెట్టడానికి ప్రోత్సాహం లభించేది.

కాని, నయా ఉదారవాద విధానాలు వచ్చాక ఇదంతా మారిపోయింది. ప్రత్యేకంగా పరిశ్రమలకు దీర్ఘకాలిక రుణాలను అందించే ఆర్థిక సంస్థల పాత స్వరూపం మారిపోయింది. ఐడిబిఐ వంటివి సాధారణ బ్యాంకుల మాదిరిగా తమ కార్యకలాపాలను మార్చుకున్నాయి. దీర్ఘకాలిక రుణాలు కావాలంటే పరిశ్రమలు ఇప్పుడు మార్కెట్ మీదే ఆధారపడాలి. దీర్ఘకాలిక రుణాలను అందించడానికి ఏర్పరచిన సంస్థలు సైతం ఆ మార్కెట్ నుంచే పెట్టుబడులు సమీకరించుకోవాలి (గతంలో రిజర్వుబ్యాంకు ఇచ్చేది). తాము పెట్టుబడులు పెట్టదలచుకున్న రంగాలలో రిస్క్ ఎక్కువగా ఉందనుకున్నా, లాభాలు పెద్దగా రావు అని అనుకున్నా, పెట్టుబడిదారులు ప్రభుత్వరంగ బ్యాంకుల మీదే ఎక్కువగా ఆధారపడడం పెరిగింది. దీర్ఘకాలిక రుణాల కోసం కూడా ప్రభుత్వరంగ బ్యాంకులనే ఆశ్రయించడం పెరిగింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా భారీ రుణాలను ఇవ్వడం పెరిగింది. ముఖ్యంగా మౌలిక వసతుల ప్రాజెక్టుల

(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు) కోసం ఎక్కువ రుణాలను ఇచ్చాయి. ప్రభుత్వం కూడా ఆ విధంగా రుణాలను ఇవ్వాలన్న వత్తిడిని బ్యాంకులమీద ఎక్కువగా తెచ్చింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రభుత్వం చెప్పినట్టు వినాల్సిందే కనుక అవి కూడా తలొగ్గాయి. దాని ఫలితంగా ఆ బ్యాంకుల ఆర్థిక పరిస్థితులు ప్రమాదంలో పడ్డాయి. బ్యాంకులకు డిపాజిట్లు ప్రధానంగా ప్రజల నుండి వస్తాయి. ఆ ప్రజలు ఏ క్షణాన్నైనా తమ డిపాజిట్లను వెనక్కి తీసేసుకోవచ్చు. అటువంటప్పుడు తమ వద్దనున్న డిపాజిట్లను బ్యాంకులు దీర్ఘకాలిక రుణాల నిమిత్తం ఇవ్వడం వలన (ఆ బ్యాంకులు తీసుకుంటున్న డిపాజిట్లు స్వల్ప కాలికంగా, ఇచ్చే రుణాలు దీర్ఘకాలికంగా ఉంటున్నాయి.) చేతిలో డబ్బులేని పరిస్థితి(లిక్విడిటీ లేకపోవడం) ఏర్పడే ప్రమాదాన్ని ఆ బ్యాంకులు ఎదుర్కొంటున్నాయి. ఒకవేళ ఎక్కువ మంది డిపాజిటర్లు తమ డిపాజిట్లను వెనక్కి తీసేసుకోవాలని గనుక నిర్ణయిస్తే ఆ బ్యాంకు మూతపడుతుంది. ఒకవేళ కొద్ది మంది డిపాజిటర్లు వెనక్కి తీసుకున్నా, అలా వెనక్కి తీసేసుకుంటున్నారు అన్న ప్రచారం జరిగితే చాలు, జనాలు బ్యాంకు మీద వచ్చి పడతారు, బ్యాంకు మూతపడుతుంది. ఇటువంటి ప్రమాదాన్ని తట్టుకోడానికి బ్యాంకులు మామూలుగానైతే స్వల్ప కాలంలో డబ్బు రూపంలోకి మార్చుకునే వీలున్న ఆస్తుల మీద పెట్టుబడులు పెడతాయి. ఒకవేళ డబ్బు కోసం డిపాజిటర్లు బ్యాంకుల మీద ఒక్కసారిగా వచ్చిపడినా, స్వల్పకాలిక పెట్టుబడులను అమ్మేసి ఆ డబ్బు డిపాజిటర్లకు బ్యాంకు చెల్లించగలుగుతుంది. అలా అమ్మినప్పుడు కొంత నష్టం వచ్చినా, మొత్తం మీద బ్యాంకు మూతపడకుండా నిలదొక్కు కోగలుగుతుంది. కాని దీర్ఘకాలిక స్వభావం కల పెట్టుబడులలో ఎక్కువగా పెడితే, వాటిని డబ్బు రూపంలో మార్చుకోవడానికి చాలా ఎక్కువ నష్టాన్ని భరించాల్సి ఉంటుంది.

**భారతదేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ప్రభుత్వం తెస్తున్న వత్తిడికిలోనై వ్యవహరిస్తున్నాయి. అవి ఇంకా ప్రభుత్వరంగంలో కొనసాగుతున్నందువలన ప్రజలు వాటిమీద నమ్మకంతో ఉన్నారు. ఇప్పుడు గనుక ఆ బ్యాంకులు ప్రైవేటు పరం అయితే మాత్రం అగ్నిపర్వతం బద్దలు కాక మానదు. దాని వలన డిపాజిటర్లు చాలా నష్టపోతారు.**

ప్రభుత్వరంగ బ్యాంకులు ఎక్కువగా రుణాలను ఇచ్చిన మౌలిక వసతుల ప్రాజెక్టులు పూర్తి కావడానికి, వాటి మీద చెల్లింపులు మొదలు అవడానికి చాలా కాలం పడుతుంది. వ్యవధి ఎక్కువగా పడితే దానివలన ప్రాజెక్టుకయ్యే ఖర్చు ముందు అనుకున్న దానికన్నా ఎక్కువ అయిపోతుంది. అందుచేత దీర్ఘకాలిక రుణాల నుండి బ్యాంకులకు లాభాలు తొందరగా రావు. వాటిలో చాలా రుణాలు 'కొరగాని ఆస్తులు'గా మిగిలిపోతాయి. అయితే అటువంటి రుణాలను అధికారికంగా 'కొరగాని'విగా పరిగణించరు. దానికి బదులు 'వత్తిడిలో ఉన్న' రుణాలుగా పరిగణిస్తారు. ఆ విధంగా ప్రభుత్వం బ్యాంకులను 'వత్తిడిలో ఉన్న' రుణాలను ఎక్కువగా మంజూరు చేయమని 'వత్తిడి' ఎక్కువగా చేస్తుంది. ఫలితంగా బ్యాంకుల పరిస్థితి ఎప్పుడైనా బద్దలవ డానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతం మీద కూర్చున్నట్టు ఉంది. ఇంకా ఆ అగ్నిపర్వతం పేలకుండా లోలోపలే రాజుకునే స్థితిలో నే కొనసాగుతున్నదీ అంటే దానికి కారణం బ్యాంకులు ప్రభుత్వ రంగంలో కొనసాగడమే. తమ డిపాజిట్లను ఎటువంటి రుణాల కోసం ఏ విధంగా ఉపయోగిస్తున్నదీ ప్రజలు గమనిస్తూనేవున్నారు. కాని వారేమీ భయాందోళనలకు గురికావడం లేదు. ఆ బ్యాంకులు ప్రభుత్వ యాజమాన్యం కిందనే నడుస్తున్నాయని, ఏదన్నా చిక్కు పరిస్థితి వస్తే ప్రభుత్వం తమ ప్రయోజనాలను కాపాడుతుందని వారు నమ్మకంతో ఉన్నారు. ప్రజల్లో నెలకొన్న ఈ విశ్వాసమే ప్రభుత్వరంగ బ్యాంకుల్ని ఇంకా కాపాడుతోంది. తక్కిన ప్రపంచంలో వివిధ దేశాల్లో ఆర్థిక సంస్థలు సంక్షోభాల్లో చిక్కుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. అవి ప్రైవేటు సంస్థలుగా ఉండి, అవి ఇచ్చిన రుణాలకు, తిరిగి చెల్లించాల్సిన డిపాజిట్లకు పొంతన లేని పరిస్థితులు ఏర్పడినందువల్లనే అవి సంక్షోభాలలో కూరుకుపోయాయి. గత శతాబ్దపు చివరి సంవత్సరాలలో(1995-2000 మధ్య) తూర్పు ఆసియా దేశాలు ఎదుర్కొన్న ఆర్థిక సంక్షోభం ఇందుకు సరైన ఉదాహరణ. దక్షిణ కొరియా బ్యాంకులనే తీసుకోండి. ఆ బ్యాంకులు విదేశీ కరెన్సీలలో డిపాజిట్లు సేకరించాయి. వాటిని తమ దేశంలో దీర్ఘకాలిక ప్రాజెక్టులకు రుణాలుగా ఇచ్చాయి. తద్వారా అవి రెండు విధాలుగా రుణాలకు, డిపాజిట్లకు పొంతనలేని పరిస్థితిని ఎదుర్కొన్నాయి. మొదటిది: స్వల్పకాలిక వ్యవధిలో తిరిగి చెల్లించాల్సిన డిపాజిట్లను సేకరించి దీర్ఘకాలంలో మాత్రమే తిరిగి వచ్చే రుణాలకు మళ్ళించాయి. రెండవది: విదేశీ కరెన్సీలలో సేకరించిన డిపాజిట్లను విదేశీ కరెన్సీ ఆర్జించని ప్రాజెక్టులలోకి మళ్ళించాయి. దాంతో అనివార్యంగా సంక్షోభం ఏర్పడింది. దాని ప్రభావం చాలా తీవ్రంగా పడింది.

2008లో అమెరికాలో సంక్షోభం సైతం ఇటువంటి పొంతనలేని కారణంగానే వచ్చింది. 1933లో మహా మాంద్యం కాలంలో రూజ్‌వెల్ట్ ప్రభుత్వం గ్లాస్-స్టీగల్ చట్టం చేసింది. వాణిజ్య బ్యాంకింగ్‌ను, పెట్టుబడుల బ్యాంకింగ్‌ను ఆ చట్టం స్పష్టంగా విడదీసింది. వాణిజ్య బ్యాంకులు డిపాజిట్ల ఆధారంగా నడుస్తాయి. అవి స్వల్పకాలిక రుణాలకు పరిమితం కావాలి.

అదే పెట్టుబడుల బ్యాంకింగ్‌లోనైతే డిపాజిట్ల మీద ఆధారపడడం ఉండదు. అందుచేత దీర్ఘకాలికమైన స్టాక్ మార్కెట్ కార్యకలాపాలకు కావలసిన రుణాలను ఇచ్చే పని అది చేయాలి. ఈ చట్టం చేయవలసిన అగత్యం ఏమొచ్చింది? ఆ కాలంలో మాంద్యం నెలకొన్న పరిస్థితులలో బ్యాంకులు స్వీకరించిన డిపాజిట్లను స్టాక్ మార్కెట్ పెట్టుబడుల కోసం రుణాలుగా ఇచ్చాయి. స్టాక్‌మార్కెట్ ఒత్తిడికి గురి కావడంతో దాని ప్రభావం ఈ బ్యాంకుల మీద పడింది. ఆ పరిస్థితి నుండి బ్యాంకులను బైటకు తేవడానికి అమెరికన్ ప్రభుత్వం చాలా అవస్థలు పడింది. అందులో భాగమే ఈ గ్లాస్-స్టీగల్ చట్టం. అయితే ఆ చట్టాన్ని 1999లో రద్దు చేశారు. దాంతో మళ్ళీ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని చవి చూడవలసి వచ్చింది. ఐతే, అదొక్కటే సంక్షోభానికి కారణం అని మాత్రం చెప్పడం లేదు. ఏ రుణం వెనుక ఎంత రిస్క్ ఉందో అంచనా వేయడంలో చాలా తక్కువగా అంచనా వేశారు. దాంతో లేమాన్ బ్రదర్స్ వంటి పెట్టుబడుల బ్యాంక్ సైతం కుప్పకూలిపోయింది. దాంతో పాటు వాణిజ్య బ్యాంకులు దెబ్బ తినిపోయాయి. ప్రభుత్వ నియంత్రణ తో మార్కెట్లు నడుస్తున్న కాలంలో (నయా ఉదారవాద విధా నాలకు పూర్వ కాలంలో) మాదిరిగా స్వల్పకాలిక రుణాలకు పరి మితం కాకుండా దీర్ఘకాల పెట్టుబడుల కోసం కూడా రుణాలను ఇవ్వడంతో ఈ వాణిజ్య బ్యాంకులు సంక్షోభంలో చిక్కుకు పోయాయి.

ఇప్పుడు భారతదేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ప్రభుత్వం తెస్తున్న వత్తిడికిలోనై వ్యవహరిస్తున్నాయి. అవి ఇంకా ప్రభుత్వరంగంలో కొనసాగుతున్నందువలన ప్రజలు వాటిమీద నమ్మకంతో ఉన్నారు. ఇప్పుడు గనుక ఆ బ్యాంకులు ప్రైవేటు పరం అయితే మాత్రం అగ్నిపర్వతం బద్దలు కాక మానదు. దాని వలన డిపాజిటర్లు చాలా నష్టపోతారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ మీద దాని ప్రతికూల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ బ్యాంకులు ప్రైవేటీకరించబడినా, తమ రక్షణ సంగతి ప్రభుత్వం చూసుకుంటుంది అన్న భరోసా ప్రజలలో ఉంది అని, అందుచేత బ్యాంకులను ప్రైవేటీకరించినా ఎటువంటి సంక్షోభ మూ తలెత్తదని కొందరు భావించవచ్చు. కాని ప్రభుత్వమే బ్యాంకుకు యజమానిగా ఉన్నప్పుడు ఆ ప్రభుత్వం మీద తీసుకు రాగలిగినంత వత్తిడి ఆ బ్యాంకు వేరే యాజమాన్యం కిందకు మారిపోయాక తీసుకు రావడం సాధ్యం కాదు. ప్రభుత్వరంగ సంస్థలమీద అనుచితంగా వత్తిడి తెచ్చి వాటిని పారుబకాయిల పాలు చేస్తున్నదీ ఈ ప్రభుత్వమే. ఇప్పుడు ఆ బ్యాంకులను ప్రయివేటీకరించి తన చేతులు దులుపుకోవాలని చూస్తున్నదీ ఆ ప్రభుత్వమే. దీనివలన డిపాజిటర్లకు తీరని ఆర్థిక నష్టం వాటిల్లడమే గాక, ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థ మీదే విశ్వాసం సన్నగిల్లుతుంది. దాంతో వాళ్ళు బ్యాంకుల్లో దాచుకోవడం మానేసి నగదు రూపంలో నిల్వ ఉంచుకోడానికే మొగ్గు చూపుతారు. దానివలన దేశాభివృద్ధికి అవసరమైన పెట్టుబడుల సమీకరణ దెబ్బతినిపోయి అభివృద్ధి చాలాకాలం పాటు స్తంభించి పోతుంది. ❑

**(నవ తెలంగాణ సౌజన్యంతో..)**

# ధర్మాన్ని ఎరుక పరిచిన నైతికయాత్ర

**(9వ పేజీ తరువాయి)**

వీటిని ఆచరణాత్మకం చేయడానికి ఏ చిన్న ప్రయత్నానికైనా మనందరం సహకరించవలసిందే. 'భారత్ జోడో - నఫ్రత్ ఛోడో' అన్న నినాదంలో అంతర్గతంగా ఈ ఆకాంక్ష ఉన్నది అని భావించే వారందరూ తమ తమ విభేదాలు పక్కకుపెట్టి ఏదో మేరకు సహకరించారు. కొందరు పరోక్షంగానైనా హర్షించారు.

భారతీయ జనతాపార్టీ ఎంత విమర్శించినా ఈ యాత్రను రాహుల్ గాంధీ పూర్తిగా రాజకీయపరం చేయకుండా, దీనికి ఒక నైతికకోణాన్ని చేర్చారు. ఎన్నికలలో మాకు ఓటు వేయండనో, కాంగ్రెస్ పార్టీని గెలిపించండనో ప్రజలను అడగలేదు. విచ్ఛిన్నమవుతున్న మతపర సంబంధాల నుంచి బయటపడాలని, దేశంలో ప్రజలు కలిసి జీవించాలని, ఏ దేశ అభివృద్ధికైనా ఈ సామరస్య సామాజిక వాతావరణం అవసరమనే సందేశం ఈ యాత్ర ద్వారా ఇచ్చారు. ఈ యాత్ర వల్ల ఏ కారణం లేకుండా మతద్వేషాలు పెంచుకుంటున్న మధ్యతరగతి, దిగువ మధ్యతరగతిలో ఒక వర్గమైనా కొంత ఆలోచించడానికి ఒక వాతావరణం ఏర్పడింది.

సమాజంలో ప్రజాస్వామ్యశక్తులు, దేశభవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్న వ్యక్తులు, సంస్థలు ఉన్నాయి. సామాజిక మార్పు చైతన్యవంతమైన ప్రజల మీద ఆధారపడి ఉంటుంది. ఈ యాత్ర నియోలిబరలిజానికి ప్రత్యామ్నాయం లేదని, రాజకీయ ప్రత్యామ్నాయం లేదని, మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడు లేడని, ప్రశ్నించే గొంతుకలు మూగపోతున్నాయని నిరాశ చెందుతున్న వారికి కొంత వెసులుబాటును కల్పించింది. ఈ యాత్ర కాంగ్రెస్ పార్టీ విజయానికి ఎంత దోహదపడు తుందో తెలియదు కాని ఒక ప్రజాస్వామ్య వాతావరణాన్ని కల్పించడానికి మాత్రం దోహదం చేసింది. ప్రజాపోరాటాలు దీనిని ముందుకు తీసుకుపోవాలి.

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో..)**

# రాజ్యాంగానికి పొంచి ఉన్న ప్రమాదం



కె.రామచంద్రమూర్తి

**కాలం వేగంగా మారిపోతోంది. సభ్యుల ఆలోచనా తీరు కూడా మారుతోంది. పాలకులకు ప్రజలంటే విసుగు పుడుతోంది. వారు ప్రభుత్వం ఏర్పాటు చేస్తారు కానీ అది ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వంగానే వ్యవహరిస్తుంది కానీ అబ్రహాంలింకన్ చెప్పినట్టు ప్రజల యొక్క ప్రజల చేత ఏర్పాటు చేసిన ప్రభుత్వంలాగా పనిచేయదు. ఈ విషయాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ అంబేడ్కర్ పైన చెప్పుకున్న వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం గాడి తప్పే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తూ అంబేడ్కర్ 25 నవంబర్ 1949న రాజ్యాంగ నిర్మాణ పరిషత్తులో చర్చకు స్వస్తి చెప్పారు.**

ప్రపంచంలో నియంతృత్వానికీ, ప్రజాస్వామ్యానికీ మధ్య ఘర్షణ జరుగుతోంది. మన దేశంలో కూడా దాని ఉధృతి పెరుగుతోంది. రాజ్యాంగాన్ని రక్షించుకోవలసిన అవసరం మునుపటికంటే ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తోంది. రాజ్యాంగం ఎంత మంచిదైనా దాన్ని అమలు చేసేవారు చెడ్డవారైతే రాజ్యాంగం అమలు చెడుగానే ఉంటుందనీ, రాజ్యాంగం చెడ్డదైనా అమలు చేసేవారు మంచివారైతే రాజ్యాంగం వల్ల మంచి ఫలితాలే ఉంటాయనీ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ రాజ్యాంగాన్ని దేశానికి సమర్పించిన క్షణాలలోనే స్పష్టం చేశారు. మన రాజ్యాంగం మంచిదే. గొప్ప గొప్పవారు రాజ్యాంగ నిర్మాణ సభ చర్చలో పాల్గొని అద్భుతమైన రాజ్యాంగాన్ని తయారు చేశారు. కానీ దాన్ని అమలు చేసేవారికి ఉద్దేశాలు మారుతున్నాయి. ఈ ధోరణికి ఉపరాష్ట్రపతి ధన్ కడ్, లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాలు చేసిన వ్యాఖ్యలే అద్దం పడుతున్నాయి. ఇటీవల అఖిల భారత సభాపతుల సమావేశంలో ప్రసంగించిన ఉప రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్ వెలిబుచ్చిన అభిప్రాయాలూ, చేసిన వ్యాఖ్యలూ ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్నేళ్ళ కిందట నేషనల్ జుడిషియల్ అపాయింట్ మెంట్స్ కమిషన్ (ఎన్ జేఏసీ) చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయడం జనాదేశాన్ని ధిక్కరించడమే ననీ, పార్లమెంటు ప్రతిపత్తిపైన దారుణంగా రాజీపడటమేననీ ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్ కడ్ అన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన అధికారాల విభజనను సుప్రీంకోర్టు పాటించవలసిం దేనని స్పీకర్ ఓంబిర్లా వ్యాఖ్యానించారు. వీరిద్దరూ ఈ విధంగా వ్యాఖ్యానించడం కేవలం వారి మనసులో మాట వెల్లడించడంగా భావించనక్కరలేదు. దీనిని ప్రధానిస్థాయి ఆలోచనగానే పరిగణించాలి. ఈ విషయంలో ఎవరికీ సందేహం అక్కరలేదు. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా మమతా దీదీని ముప్పుతిప్పలు పెట్టిన ధనకడ్‌ను ఉపరాష్ట్రపతిని ఎందుకు చేశారో ఈ వ్యాఖ్యలూ, ప్రకటనలూ సూచిస్తున్నాయి.




ప్రజాస్వామ్య వ్యవస్థలో మూడు విభాగాలను రాజ్యాంగం సృష్టించింది. మూడింటికీ మూడు రకాల విధులను నిర్దేశించింది. అవి శాసనవ్యవస్థ అంటే చట్టసభలూ (లెజిస్లేచర్), కార్య నిర్వాహక వ్యవస్థ(ఎగ్జిక్యూటివ్), న్యాయవ్యవస్థ (జుడీషియరీ). ఈ మూడూ స్వతంత్రంగా పని చేస్తూ, కొన్ని నియమాలకు ఐచ్చికంగా కట్టుబడి ఉండే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఉన్నత స్థానాలలో ఉన్న ఉప రాష్ట్రపతి, రాజ్యసభ అధ్యక్షుడూ అయిన జగ్దీప్ ధన్ కడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాలు శాసన వ్యవస్థకూ, కార్యనిర్వాహక వ్యవస్థకూ అనుగుణంగా న్యాయవ్యవస్థ నడుచుకోవాలని అంటున్నారు. ఇది రాజ్యాంగ నిర్మాతల అభీష్టానికి విరుద్ధమైనది. వక్తలు ఇద్దరూ ఉన్నత స్థానాలలో ఉన్న పెద్ద వారే కానీ వీరికంటే దేశం పెద్దది, రాజ్యాంగం పెద్దది. మూడు వ్యవస్థలకూ అధికారాలను పంచిన రాజ్యాంగమే బాధ్యతలనూ, పరిమితులనూ నిర్దేశించింది. వాటిని గమనంలో పెట్టుకోకుండా ఎవరు మాట్లాడినా పొరబాటే. మన రాజ్యాంగం దేశ ప్రజలకు ప్రాథమిక హక్కులు ప్రసాదించింది. వాటికి భంగం కలిగినప్పుడు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చునని చెప్పింది.

న్యాయస్థానాలకు వెళ్ళే అవకాశం లేకపోతే హక్కులను ప్రభుత్వాలు హరిస్తాయి. హక్కులకు ప్రమాదం వాటిల్లినప్పుడు న్యాయస్థానాలకు (సుప్రీంకోర్టు దాకా) వెళ్ళడానికి వీలు కల్పించేదే రాజ్యాంగం 32వ అధికరణ. 13(2) అధికరణ మరో హామీ ఇచ్చింది. ప్రాథమిక హక్కులకూ, రాజ్యాంగ స్వభావానికీ భంగం కలిగించే ఏ చట్టాన్నీ చట్టసభలు చేయకూడదు. అటువంటి చట్టాలు చేసినట్లయితే అవి చెల్లనేరవు అని ఈ అధికరణ స్పష్టం చేస్తున్నది. 13(2)వ అధికరణను ఎనిమిదవ అధికరణగా రాజ్యాంగ నిర్మాణసభలో సుదీర్ఘంగా మూడు రోజులపాటు (25, 26, 28 నవంబర్ 1948) చర్చించారని సోమవారం ముంబాయ్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో రాసిన వ్యాసంలో ప్రముఖ న్యాయవాది దుష్యంత్ దవే తెలియజేశారు. అయితే, దీన్ని కొంత వరకూ నీరు కారుస్తూ ఈ చట్టానికి 1971లో ఒక సవరణ తెచ్చారు. ఈ రాజ్యాంగానికి 368వ అధికరణ కింద చేసే సవరణలకు ఇది వర్తించదు అన్నది ఆ సవరణ తాత్పర్యం. అయితే న్యాయవ్యవస్థ ఒక రక్షణ కవచం ఏర్పాటుచేసింది. అదేమంటే ప్రముఖమైన కేశవానందభారతి వర్సెస్ కేరళ ప్రభుత్వం కేసులో తీర్పు ఇస్తూ 398 అధికరణ కింద చట్టాలను సవరించే అధికారం పార్లమెంటుకు ఉన్నదనీ, కానీ ఏ సవరణలైనా రాజ్యాంగ మౌలిక స్వభావానికి అనుగుణంగా ఉండాలే కానీ భిన్నంగా ఉండరాదని స్పష్టం చేసింది. రాజ్యాంగ మౌలిక స్వభావాలు ఏమిటి? చట్టపాలన హక్కు, ప్రాథమిక హక్కులు, న్యాయసమీక్ష, అధికారాల విభజన, స్వతంత్ర్య న్యాయవ్యవస్థ. వీటికి భిన్నంగా ఏ సవరణా జరగకూడదు. స్వతంత్ర్య న్యాయ వ్యవస్థ అన్నారే కానీ శాసనవ్యవస్థకూ, కార్యనిర్వాహక వ్యవస్థకూ అనుగుణమైన న్యాయవ్యవస్థ అనలేదు. ఎన్ జేఏసీ చట్టం, దాని తర్వాత చేసిన చట్టం రాజ్యాంగ స్వభావానికి విరుద్ధమైనవేనని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. రాజ్యాంగం ఏమి ఆశించిందో, ఏమి ఆదేశించిందో అదే పని సుప్రీంకోర్టు చేసిందనడంలో సందేహం అక్కరలేదు.

**స్వతంత్ర్య న్యాయ వ్యవస్థ అన్నారే కానీ శాసనవ్యవస్థకూ, కార్యనిర్వాహక వ్యవస్థకూ అనుగుణమైన న్యాయవ్యవస్థ అనలేదు. ఎన్ జేఏసీ చట్టం, దాని తర్వాత చేసిన చట్టం రాజ్యాంగ స్వభావానికి విరుద్ధమైనవేనని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. రాజ్యాంగం ఏమి ఆశించిందో, ఏమి ఆదేశించిందో అదే పని సుప్రీంకోర్టు చేసిందనడంలో సందేహం అక్కరలేదు.**

భారత రాజ్యాంగంలో 141, 144 అధికరణలు న్యాయ వ్యవస్థకు ప్రాణప్రదమైనవి. సుప్రీంకోర్టు ఆదేశాలు భారత దేశంలోని అన్ని న్యాయ వ్యవస్థలకూ శిరోధార్యం అని 141వ అధికరణ స్పష్టం చేస్తున్నది. సర్వోన్నత న్యాయస్థానానికి (సుప్రీం కోర్టుకు) పౌర, న్యాయ వ్యవస్థలన్నీ చేదోడువాదోడుగా ఉండాలి అని 144వ అధికరణ నిర్దేశిస్తున్నది. అంటే అర్థం ఏమిటి? న్యాయవ్యవస్థను కార్యనిర్వాహక వ్యవస్థకూ, శాసనవ్యవస్థకూ అనుగుణంగా ఉండమనా? కానే కాదు. రాజ్యాంగాన్నీ, దాని స్వభావాన్నీ రక్షించే బాధ్యత రాజ్యాంగం న్యాయవ్యవస్థపైన, ముఖ్యంగా సుప్రీంకోర్టు భుజస్కంధాలపైన పెట్టింది. ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు ఏ మాత్రం భంగం కలిగించడానికి వీలు లేదనీ, అటువంటి చట్టాలు చేయడం రాజ్యాంగ విరుద్ధమనీ రాజ్యాంగ నిర్మాతలు స్పష్టం చేశారు. రాజ్యాంగాన్నిఅంతిమంగా అన్వయించే అధికారం సుప్రీంకోర్టుకే ఉన్నది కనుక పార్లమెంటు ఆమోదించి, రాష్ట్రపతి అనుమతించిన చట్టాలను అవి ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేవి అయితే అవి రాజ్యాంగానికి అనుగణమైనది కాదని ప్రకటించే బాధ్యత సర్వోన్నత న్యాయస్థానానిదే.


దేశవ్యాప్తంగా ఆనాడు ఉన్న మేధావుల్లో శిఖర సమానులు రాజ్యాంగ నిర్మాణ పరిషత్తు సభ్యులుగా ఉన్నారు. అన్ని అంశాలనూ కూలంకషంగా చర్చించారు. న్యాయవ్యవస్థ స్వేచ్ఛ గురించి సుదీర్ఘంగా, సవివరంగా సమాలోచన చేశారు. తుది ముసాయిదాలో 395 అధికరణలూ, ఎనిమిది షెడ్యూళ్ళూ ఉన్నాయి. 7,635 సవరణలు వచ్చాయి. సభలో ప్రవేశపెట్టిన సవరణలు 2,473. చివరలో అంబేడ్కర్ పైన చెప్పుకున్న వ్యాఖ్య చేశారు. కాలం వేగంగా మారిపోతోంది. సభ్యుల ఆలోచనా తీరు కూడా మారుతోంది. పాలకులకు ప్రజలంటే విసుగు పుడుతోంది. వారు ప్రభుత్వం ఏర్పాటు చేస్తారు కానీ అది ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వంగానే వ్యవహరిస్తుంది కానీ అబ్రహాంలింకన్ చెప్పినట్టు ప్రజల యొక్క, ప్రజల చేత ఏర్పాటు చేసిన ప్రభుత్వంలాగా పని చేయదు. (ప్రజాస్వామ్యం అంటే ప్రజలు, ప్రజల కోసం, ప్రజలతో ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వం అని అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్ చెప్పారు). ఈ విషయాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ అంబేడ్కర్‌పైన చెప్పుకున్న వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం గాడి తప్పే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తూ అంబేడ్కర్ 25 నవంబర్ 1949న రాజ్యాంగ నిర్మాణ పరిషత్తులో చర్చకు స్వస్తి చెప్పారు. అంబేడ్కర్ చెప్పిన జోస్యం నిజమయ్యే ప్రమాదం ఉన్నదా? ఏమో. తెలియదు. లేకపోలేదు. రాజ్యాంగం గాడి తప్పిందా? తప్పుతున్నట్టే కనిపిస్తోంది. అధ్యక్ష తరహా పరిపాలన ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభమైనాయా? మన ప్రజాస్వామ్యాన్నీ, మన రాజ్యాంగాన్నీ, మన న్యాయవ్యవస్థనూ కాపాడుకోవడానికి ప్రజలు నడుం బిగించవలసిన రోజు ఆసన్నమవుతోంది. ❑

# రాజ్యాంగాన్ని చేత్తో రాసింది ఎవరో తెలుసా?

ప్రతి దేశానికి రాజ్యాంగం ఉంటుంది. మన దేశానికి రాజ్యాంగం ఉంది. అయితే అన్ని దేశాల రాజ్యాంగాలు, భారతదేశ రాజ్యాంగం ఒక్కటే కాదు. ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం మనది. మన రాజ్యాంగం ముద్రించలేదు. పూర్తిగా చేతితో రాయడం భారత దేశ రాజ్యాంగం ప్రత్యేకత. ఢిల్లీ నివాసి శ్రీ ప్రేమ్ బిహారీ నారాయణ్ రేజాదా గారు పూర్తి రాజ్యాంగాన్ని తానొక్కరే స్వహస్తాలతో రాశారు. ప్రేమ్ బిహారీ ఆ రోజుల్లో ప్రఖ్యాత calligrapher (చేతివ్రాత నిపుణులు). 1901 డిసెంబర్ 16న ఢిల్లీలో జన్మించిన ఈయన చిన్న వయసులోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్నారు.



తాత రాంప్రసాద్ సక్సేనా పర్షియ, ఇంగ్లీషు విద్వాంసులు, calligrapher కూడా. ఆయన పెంపకంలో ప్రేమ్ బిహారీ calligraphy నేర్చుకున్నారు. ఢిల్లీ సెయింట్ స్టీఫెన్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశాక calligraphy కళ మీద దృష్టి పెట్టారు. భారత రాజ్యాంగం ముద్రణకు సిద్ధమైనపుడు జవహర్ లాల్ నెహ్రూ ప్రేమ్ బిహారీని పిలిచి మన రాజ్యాంగాన్ని ప్రెస్‌లో ముద్రించడంకంటే ఇటాలిక్ రాతపద్ధతిలో రాయించాలని అను కొంటున్నట్టు తెలిపారు. అందుకు ఎంత పారితోషికం కోసం ఎదురుచూస్తున్నారని అడిగారు. 'ఒక్క పైసా కూడా వద్దు. దేవుని దయవల్ల నా జీవితంలో అన్నీ సమకూరాయి, సంతోషం గానూ ఉన్నాను. భారత రాజ్యాంగాన్ని నేను రాయడం పూర్వ జన్మ సుకృతం' అని ప్రేమ్ బిహారీ అన్నారు. అయితే ఒక విన్నపం చేశారు. ప్రతి పేజీలో కింద నాపేరు రాసుకుంటాను, చివరి పేజీలో నాపేరు మా తాతగారి పేరుతో కలిపి రాసుకుం టాను అందుకు మీ అనుమతి కావాలి అని ప్రేమ్ బిహారీ అన్నారు. అందుకు నెహ్రూ సమ్మతించాక రాజ్యాం గం రాసే పని మొదలయ్యింది. రాజ్యాం గం రాయడానికి ఇప్పటి Constitution Houseలో ఒక గదిని కేటాయించారు. రాజ్యాంగం పూర్తిగా రాయడానికి 432 పెన్ హోల్డర్లు అవసరమయ్యింది. 303 నెంబరు నిబ్(ముల్లు) వాడారు. ఆ ముల్లులు ఇంగ్లాండ్, జేకొస్లే వికీయాల నుండి ప్రత్యేకంగా తెప్పించారు. రాజ్యాంగం రాయ డానికి ప్రేమ్ బిహారీకి 6 నెలల సమయం పట్టింది. 251 షీట్ల parchment paper అవసరపడింది. రాజ్యాంగం బరువు మూడు కిలోల 650 గ్రాములు, 22 ఇంచీల పొడవు 16 ఇంచీల వెడల్పు ఉంది.



Part VI
The States in Part A of the First Schedule
Chapter I – General

Definition. 152. In this Part, unless the context otherwise requires, the expression "State" means a State specified in Part A of the First Schedule.

Chapter II – The Executive
The Governor

Governors of States. 153. There shall be a Governor for each State.

Executive power of State. 154. (1) The executive power of the State shall be vested in the Governor and shall be exercised by him either directly or through officers subordinate to him in accordance with this Constitution.

(2) Nothing in this article shall –
(a) be deemed to transfer to the Governor any functions conferred by any existing law on any other authority; or
(b) prevent Parliament or the Legislature of the State from conferring by law functions on any authority subordinate to the Governor.

Appointment of Governor. 155. The Governor of a State shall be appointed by the President by warrant under his hand and seal.

Term of office of Governor. 156. (1) The Governor shall hold office during the pleasure of the President.

(2) The Governor may, by writing under his hand addressed to

రాజ్యాంగం రాయడం మొదలుపెట్టడానికి ముందు నెహ్రూ సూచన మేరకు రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌తో కలిసి 29 నవంబర్ 1949న ప్రేమ్ బిహారీ శాంతినికేతన్ వెళ్లారు. అక్కడ ప్రఖ్యాత చిత్రకారులు నందలాల్ బసుతో చర్చించి పేజీలో ఏ భాగంలో ప్రేమ్ బిహారీ రాయాలో చర్చించుకున్నారు. పేపర్ మిగిలిన భాగం నందలాల్ తమ చిత్రాలతో రాజ్యాంగాన్ని అలకరించబోతున్నారు. నందలాల్ మొహంజదరో ముద్రికలు, రామాయణ, మహాభారత ఘట్టాలు, గౌతమ బుద్ధుని జీవిత చరిత్ర, అశోకుడు బౌద్ధ మతాన్ని విస్తరింపజేసిన ఘట్టాలు, విక్రమాదిత్యుని పాలన, అక్బర్ చక్రవర్తి, మొఘల్ సామ్రాజ్యానికి చెందిన చిత్రాలతో రాజ్యాంగాన్ని అలంకరించారు. ప్రేమ్ బిహారీ 1966 ఫిబ్రవరి 17న స్వర్గస్తులయ్యారు. ❑

# బుద్ధుడు అవతారమూర్తి కాదు, చారిత్రక పురుషుడు!



**డాక్టర్ దేవరాజు మహారాజు**
బయాలజీ ప్రొఫెసర్,
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

**లాభసాటి వ్యాపారాలు నడుస్తాయంటే ఈ మనువాదులు, రేపొద్దున అంబేద్కర్‌ను కూడా దేవుడిగా చేసేయ్యగల సమర్థులు! మనువాదుల మాయాజాలం మహావిచిత్రం. సాధారణ శకానికి ముందు బుద్ధుడు ఈ నేల మీద పుట్టి పెరిగి, దేశం నాలుగు చెరగులా తిరిగినవాడు. కల్పితం కాదు. మరి, కల్పించుకున్న దేవుళ్ళలో బుద్ధుణ్ణి చేర్చడమేమిటి ? వాస్తవాలకూ భ్రమలకూ తేడా తెలుసుకోండి! అందువల్ల, 'విష్ణు అవతారాలలో బుద్ధుడు కూడా ఒకడు' అని చెప్పడం వందశాతం అబద్ధం!!"**

బౌద్ధ సాహిత్యంలో పురాణాల ప్రసక్తిగానీ, హిందూ దేవీ దేవతల పేర్లు గానీ లేవు. కానీ, రామాయణంలో బుద్ధ శబ్దం ఉంది. అంటే అది బుద్ధుడి తర్వాత కాలంలో వెలువడిన రచనగా మనం అర్థం చేసుకోవాలి. బుద్ధుడి కాలం నాటి భాష ప్రాకృత భాష. అదే అప్పటి ప్రజల భాష. ప్రాకృత అంటే ప్రకృతి. స్వభావసిద్ధంగా ఏర్పడింది అని అర్థం. ప్రాకృతానికి మరో రూపం పాలి భాష. ఈ భాషను ధమ్మ లిపిలో రాస్తారు. దేశంలో దొరికిన అతి ప్రాచీన శిలా ఫలకాలు, స్థూపాలు, బౌద్ధ సంప్రదాయానికి చెందినవి. మరీ ముఖ్యంగా అశోకుడి కాలం నాటివే ఎక్కువగా లభించాయి. ప్రాకృత భాష సంస్కరించబడి సంస్కృత భాష అయ్యింది. మొదట అది సంభాషణలకు మాత్రమే పరిమితమైన లిపి లేని ఒక మాండలిక భాష. అది ఆర్యుల వ్యవహారిక భాష. భారతదేశం వచ్చాక, ఇక్కడి నాగరి లిపిలో దాన్ని రాసుకున్నారు. దానికి దేవ శబ్దం కలిపి ఆ లిపిని 'దేవనాగరి లిపి' అని అన్నారు. అలాగే సంస్కృతాన్ని ఏకంగా ఉన్నతీకరించుకుని దేవభాష అని అన్నారు. అబద్ధాలు నిలవవు – అనడానికి ఒక మంచి ఉదాహరణ ఏమిటంటే, సంస్కృత భాషలో ఉన్న శిలాఫలకాలు దొరకలేదు. అలాంటప్పుడు సనాతనం – అంటే ఏదవుతుందీ?



బౌద్ధ ధమ్మం – ధమ్మ లిపి – ప్రాకృత (పాలి) భాష సనాతన మవుతాయి. చారిత్రక ప్రమాణాల మీద కదా మనం ఏ నిర్ణయమైనా తీసుకునేది? సంస్కృతం, పురాణాలు, వైదిక ధర్మం వగైరాలన్నీ సనాతనం అని ప్రచారం చేసుకోవడమే తప్ప, అందుకు ఆధారాలు లేవు. అందువల్ల సనాతనమంటే బౌద్ధ ధమ్మం, బౌద్ధ సంస్కృతి అని చెప్పుకోవాల్సి ఉంటుంది. చివరికి బుద్ధుడు చెప్పిన 'వేదన' నుండే వైదిక మత ప్రభోదకులు వేదం – అనే పదం సృష్టించుకున్నారు. మన దేశంలో పురాతన సింధూ నాగరికత బయటపడింది. హరప్పా – మొహంజోదారో శిథిలాలలో అవతారాల ఆనవాళ్ళు దొరికితే, వైదిక ధర్మమే సనాతనమైంది అని భావించేవాళ్ళం. కానీ, దొరకలేదు. దొరికే అవకాశమూ లేదు. కారణం అవన్నీ కల్పితాలు కాబట్టి! వాస్తవాలకే ఆధారాలు దొరుకుతాయి. కానీ, ఊహలకు, కల్పనలకూ దొరకవు కదా? అక్కడి అప్పటి నాగరికతకు, సభ్యతకూ ఆధారాలు దొరికాయి. శిలా ఫలకాల మీద ఒక లిపి కూడా దొరికింది. అయితే ఆ లిపిని ఎవరూ చదవలేక పోయారు. కానీ, అది ద్రావిడ భాషా లిపులకు దగ్గరగా ఉన్నట్టు నిపుణులు తేల్చారు. చైనా, జపాన్, ఇండోనేషియా, థాయ్లాండ్ వంటి ఆసియా దేశాలలో బౌద్ధం ఇంకా ఎందుకు ఉచ్ఛస్థితిలో

**మనువాదుల ప్రభావంలో పడి తమను తాము గుర్తించుకోవడం మరిచిపో యిన జనం, ఎప్పుడు వివేకవంతులవుతారో మరి ? ఆరామా లని అరాచక కేంద్రాలని ప్రచారం చేశారు. మహాస్థూపాలను అన్యాయంగా 'లంజెదిబ్బ'లన్నారు. స్థూపాలు దిబ్బలైనాయి. విహారాలు గబ్బిలాలకు నిలయాలయ్యాయి. బుద్ధుడు విష్ణుమూర్తి అవతారమని ఒక మహా అబద్ధం ప్రచారం చేసిన వారే ఈ దుర్మార్గాలన్నీ చేశారు. ఇవన్నీ ప్రత్యక్షంగా కళ్ళకు కనిపిస్తున్న విషయాలు.**

ఉంది ? భారతదేశంలో ఎందుకు సన్నగిల్లిందీ ? – అంటే ఇక్కడ బౌద్ధాన్ని వక్రీకరించి రాసుకున్న వేదాలున్నాయి. బౌద్ధా రామాల్ని కొల్లగొట్టి మార్చుకున్న దేవాలయాలు ఉన్నాయి. రామాయణంలో నాస్తికుల గూర్చి, చార్వాకుల గూర్చి, బుద్ధుడి గూర్చిన ప్రసక్తి ఉందంటేనే తెలుస్తోంది కదా ? వారంతా పురాణ కాలానికి ముందు వారని ! వారి ఆలోచనా విధానం పురాణ కాలానికంటే ముందు కాలం నాటిదని !!

ఒరిజనల్ ఒరిజనలే – కాపీపేస్ట్ కాపీపేస్టే!

రుగ్వేదంలో స్థూపాల వర్ణన ఉందంటే, అది రాయబడక ముందే బౌద్ధ స్థూపాలు విరివిగా దేశంలో ఉన్నట్టే కదా? బౌద్ధులు విరివిగా ఉన్న దేశాలలో అష్టాంగ మార్గం – అహింస – మధ్య మార్గం – శాంతి – కొత్త దిశ వంటివి అక్కడి ప్రజల జీవితాల్లో అంతర్భాగమైపోయాయి. ఇక్కడ మన దేశంలో ఎందుకు కాలేకపోయాయి అంటే.. ఇక్కడ అంతా కలుషితమై పోయింది కదా ? బౌద్ధారామాలు, శిల్పాలు, స్థూపాలు విదేశీ దండయాత్రల వల్ల కొంతవరకు నాశనమైతే, ఇక్కడి బ్రాహ్మణా ర్యుల, వైదిక ధర్మ ప్రభోదకుల నిర్వాకం వల్ల మిగతాది నాశనమైంది. పైగా మనువాద భావజాలాన్ని బలవంతంగా జనం మెదడ్లకు ఎక్కించి, అది తరతరాలుగా కొనసాగేట్లు చేశా రు. ఇంకా చేస్తూనే ఉన్నారు. బుద్ధుణ్ణి దశావతారాలలో కలుపుకున్నది ఆయన బోధనలు నిలుపు కోవడానికి కాదు, నలిపి పారేయడానికి – నాశనం చేయడానికి" అనేది ముందు అర్థం చేసుకోవాలి! ఇటు హిందూ పురాణాలు, అటు బౌద్ధ సాహిత్యం క్షుణ్ణంగా అధ్యయనం చేసిన డాక్టర్ బి.ఆర్. అంబే ద్కర్ (జాతీ భేద్ క ఉచ్ఛేద్ / Annihilations of caste వంటి పుస్తకాలు) అవతారవాదం అంతా అబద్ధం. విష్ణు దశావతారా లలో బుద్ధుడు తొమ్మిదో అవతారమని ప్రచారం చేయడంలో నిజం లేదు. ఎందుకంటే అవతారవాదమే తప్పుల తడక.

ఉదాహరణకు హరివంశంలో విష్ణు 12 అవతారాలు ఎత్తాడని రాసుకుంటే, భగవత్ పురాణంలో 22 అవతారాలు ఎత్తాడనీ, అందులో 21వ అవతారం బుద్ధుడిదనీ రాసుకున్నారు. మనం ఇక్కడ అర్థం చేసుకోవాల్సింది ఏమంటే వేదాల రచన, పురా ణాల రచన సుదీర్ఘకాలం సాగింది. కాలానుగుణంగా ఎవరికి తోచింది వాళ్ళు రాసుకున్నారు. అవతారాలకు నిర్దిష్టంగా ఒక సంఖ్య లేకపోవడం, అందులో బుద్ధుడి వరుస సంఖ్య మారుతూ ఉండటం అనుమానాలకు దారి తీస్తుంది కదా ? ఊహలకు, కల్పితాలకు ప్రామాణికత ఉండదు. కారణం, వాటికి ఏ రకమైన ఆధారాలు ఉండవు కాబట్టి..!

'అవతారాలకు ఆధారాలేవీ?' అని వైదిక ధర్మ ప్రభోదకులను, ప్రవచనకారులను అడిగి చూడండి. జవాబు చెప్పలేరు సరికదా క్షణంలో తోకముడిచి పారిపోతారు. చార్వాకులు, లోకాయతు లు, బౌద్ధులు, జైనులు.. వీళ్ళందరూ భౌతికవాదులు. వీరు మనుషులకు నైతికత కావాలన్నారు. దృష్టి ఈ జగత్తు మీద పెట్టమన్నారు. సమస్యల్ని పరిష్కరించుకుంటూ, మానవ సమా జాన్ని ఉద్ధరించుకోవాలన్నారు. పీడ నుంచి, దుఃఖం నుంచి, వేదన నుంచి బయటపడే మార్గాలు అన్వేషించుకోవాలన్నారు. దీనికి పూర్తి విరుద్ధంగా వైదిక ధర్మం ఏం చెప్పింది ? బ్రహ్మ – సత్యం అనీ, జగత్తు మిధ్య అనీ అంది. పుణ్యం, పాపం, జన్మ, పునర్జన్మ, మోక్షం వంటి మూఢ నమ్మకాల్ని వ్యాప్తిచేసింది. ఎక్కడా లేని పరలోకాల గురించి ప్రచారం చేసింది. వెరసి, మనుషుల ఆత్మ విశ్వాసాన్ని దెబ్బ తీసింది. హిందూ సన్యాసికి ఈ ప్రపంచంతో సంబంధం ఉండదు. కానీ, బౌద్ధ భిక్షువుకు ప్రపంచంతో తప్పక సంబంధం ఉంటుంది. వారు సామాన్య జనానికి సేవ చేస్తారు. బౌద్ధ ధమ్మం బోధిస్తారు. వీరికి స్వంత ఆస్తి అంటూ ఉండదు.

ఇకపోతే, హిందువుల దశావతారాల్లో బుద్ధుణ్ణి చేర్చుకున్నారు కదా ? బుద్ధుడు హిందూమతంలో భాగమే అని అంటారు కదా ? మరి బౌద్ధారామాల్ని పరిరక్షించుకోవాలని గానీ, పునరుద్ధ రించుకోవాలని గానీ వైదిక సంస్థలకు, నేటి ప్రభుత్వాలకూ ఎందుకు ఉండటం లేదూ ? విశాఖ పరిసర ప్రాంతాల్లో ఉన్న తొట్లకొండ, పావురాల కొండ, బొజ్జన్న కొండ, లింగాల కొండ లాంటివన్నీ ఎందుకు నిరాదరణకు గురవుతున్నాయి ? విష యాలు తెలుసుకుని, లోతుగా అధ్యయనం చేయాల్సిన అంశ మిది. ఉదాహరణకు ఇక్కడ ఒక ప్రాంతం గురించి ప్రస్తావిం చాను కానీ, దేశవ్యాప్తంగా శిథిలమైన బుద్ధ విగ్రహాలు, స్థూపాలు, ఆరామాలు ఎన్నెన్నో ఉన్నాయి కదా? మరి వాటిని

ఎందుకు పట్టించుకోవడం లేదూ? పునరుద్ధరించుకోవడం లేదంటే, అవి తమ వైదిక ధర్మానికి ఏ మాత్రం సంబంధం లేనివి అని వారికి కచ్చితంగా తెలుసునన్న మాట! వైదిక ధర్మాన్ని నెత్తిన పెట్టుకునే ప్రభుత్వ పెద్దలవి నాటకాలు కావా? చారిత్రక అవగాహన తప్పనిసరికదా? 'సనాతన' బౌద్ధ ధమ్మాన్ని రక్షించుకుందామన్న చిత్తశుద్ధి అవసరం కదా? మనువాదుల ప్రభావంలో పడి తమను తాము గుర్తించుకోవడం మరిచిపోయిన జనం, ఎప్పుడు వివేకవంతులవుతారో మరి ? ఆరామాలని అరాచక కేంద్రాలని ప్రచారం చేశారు. మహాస్థూపాలను అన్యాయంగా 'లంజెదిబ్బ'లన్నారు. స్థూపాలు దిబ్బలైనాయి. విహారాలు గబ్బిలాలకు నిలయాలయ్యాయి. బుద్ధుడు విష్ణుమూర్తి అవతారమని ఒక మహా అబద్ధం ప్రచారం చేసిన వారే ఈ దుర్మార్గాలన్నీ చేశారు. ఇవన్నీ ప్రత్యక్షంగా కళ్ళకు కనిపిస్తున్న విషయాలు. కొన్ని స్థూపాలు నరసింహక్షేత్రాలయ్యాయి. తిరణాల స్థానంలో మంత్ర తంత్రాలు ప్రతిష్టించారు. అష్టాంగ మార్గాన్ని అష్టోత్తరాలుగా మార్చారు. పంచశీలను పాతిపెట్టారు. నిబ్బాణకు బదులు వ్రతాల్ని ప్రవేశపెట్టి, గృహిణుల్ని మానసిక బానిసలుగా మార్చారు. పదిహేను వందల ఏళ్లపాటు శాంతి యుత సుఖమయ, ఆనందకర జీవితాన్ని అందించిన బౌద్ధ జీవన శైలిని ఏ రకంగా నాశనం చేశారో రఘుపతిరావు (2010) ఒక పుస్తకంలో విశదపరిచారు.

అశోకుడికంటే ముందే 'సనాతన' సంస్కృతిలో (అంటే వారి వైదిక సంస్కృతిలో) అనేక స్థూపాలున్నాయని కొందరు తప్పుడు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. సింహస్థంభ, ధ్వజస్థంభ, సూర్య స్థంభ, విజయ స్థంభ వంటి వాటి గురించి చెపుతూ – ఇవి, భూమి అనంత విశ్వం నుంచి విడివడడాన్ని (Separation of earth with infinite cosmos) సూచిస్తాయని చెపుతారు. అయితే ఇందులో సింహ స్థంభం, సూర్య స్థంభాలకు బౌద్ధుల శిల్పాలతో పోలికలున్నాయి. అబద్ధాలు ప్రచారం చేసే ఆ మందమతులు ఆ విషయం గ్రహించలేదు. ఇకపోతే అశోక స్థంభాల్ని స్ఫూర్తి(మోడల్)గా తీసుకుని తర్వాత కాలంలో కొందరు ప్రాంతీయ పరిపాలకులు కొంత భిన్నంగా స్థూపాలను నిర్మించి ఉంటారు. కాదనలేం. కార్బన్ డేటింగ్ చేయించి అవి ఏ కాలంవో నిర్ధారణ చేయిస్తేగానీ అసలు విషయం బయట పడదు. ఏమైనా అశోకుడికి ముందు కాలంలో దేశంలో స్థూపా లున్న విషయం ఏ చరిత్రకారుడూ నమోదు చేయలేదు. ఆనాటి చరిత్రకారుల్ని నమ్ముదామా? లేక ఈనాటి ఈ మిడిమిడి జ్ఞానపు వైదిక హిందూ పండితుల్ని నమ్ముదామా? హేతు బద్ధంగా ఆలోచించే వారు నిజమైన ప్రమాణాల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

ఆనాటి వైదిక మత గురువు శంకరాచార్యకు పెద్ద గొంతు, వాదనా పటిమ ఉండి ఉంటుంది. ఉంటే మాత్రం సున్నిత మనస్కులైన బౌద్ధ భిక్షువుల్ని హేళన చేసి, అవమానించి, న్యూనతాభావంతో వారు ఆత్మహత్య చేసుకునే దాకా వదిలి పెట్టే వాడు కాదు. ఉగ్రవాదం అనే పదం ఆ రోజుల్లో లేదు కానీ, అతను ఓ రకమైన ఉగ్రవాదే! మనిషిని మనిషిగా గౌరవించలేని వాడు ఎంత ఉన్నతస్థాయి వాడైనా హీనుడిగానే గుర్తింపబడాలి. ఎంత చిన్నదైనా స్వంత సృజనాత్మక శక్తి గొప్పది. అరువు తెచ్చుకున్నది అరువు తెచ్చుకున్నదే అవుతుంది. గ్రీకుల కట్టడాలు కాపీ చేసి మందిరాలు నిర్మించుకున్నట్టు - ఈజిప్టు, గ్రీకు దేవతల్ని కాపీ చేసి హిందూ దేవతల్ని ఏర్పరుచుకున్నట్టు పూర్తి ఆధారాలు దొరికాయి. 'లండన్‌లోని పెట్రీ మ్యూజియం ఆఫ్ ఈజిప్షియన్ ఆర్కియా లజీలో అన్ని ఆధారాలు ఉన్నాయి' కొన్ని ఆధారాలు అంతర్జాలంలో దొరుకుతాయి. ఇకపోతే... లాభసాటి వ్యాపారాలు నడుస్తాయంటే ఈ మనువాదులు, రేపొద్దున అంబేద్కర్‌ను దేవుడిగా చేసేయ్యగల సమర్థులు! మనువాదుల మాయాజాలం మహావిచిత్రం. సాధారణ శకానికి ముందు బుద్ధుడు ఈ నేల మీద పుట్టి పెరిగి, దేశం నాలుగు చెరగులా తిరిగిన వాడు. కల్పితం కాదు. మరి కల్పించుకున్న దేవుళ్ళలో బుద్ధుణ్ణి చేర్చడమేమిటీ? వాస్తవాలకూ భ్రమలకూ తేడా తెలుసుకోండి! అందువల్ల విష్ణు అవతారాలలో బుద్ధుడు కూడా ఒకడు అని చెప్పడం వంద శాతం అబద్ధం!! ❑

**మనిషిని మనిషిగా గౌరవించలేని వాడు ఎంత ఉన్నతస్థాయి వాడైనా హీనుడిగానే గుర్తింపబడాలి. ఎంత చిన్నదైనా స్వంత సృజనాత్మక శక్తి గొప్పది. అరువు తెచ్చు కున్నది అరువు తెచ్చుకున్నదే అవుతుంది. గ్రీకుల కట్టడాలు కాపీ చేసి మందిరాలు నిర్మించుకున్నట్టు - ఈజిప్టు, గ్రీకు దేవతల్ని కాపీ చేసి హిందూ దేవతల్ని ఏర్పరుచుకున్నట్టు పూర్తి ఆధారాలు దొరికాయి.**

**(నవతెలంగాణ సౌజన్యంతో)**


# హేతువాదమే మౌఢ్యానికి విరుగుడు



ఏబీకే ప్రసాద్

**'వైజ్ఞానిక పునాదుల పైన, శాస్త్రీయ పరి జ్ఞానం పైన మాత్రమే మానవుల సుఖసంతోషాలు ఆధారపడి ఉంటాయి.'**

– స్వతంత్ర భారత తొలి ఉప రాష్ట్రపతిగా సర్వేపల్లి రాధాకృష్ణ



కొన్ని శతాబ్దాల క్రితం వేమన, బద్దెన ఏ నీతులు శతక వాఙ్మయం ద్వారా బోధించారో వాటికి కాలం గడిచిన కొద్దీ విలువ పెరుగుతూనే ఉంది. మూఢ విశ్వాసాల నుంచి ప్రజా బాహుళ్యానికి కొంత విమోచన వచ్చినా – పాలక శక్తుల ప్రాపకంతో సమాజంలో పెరుగుతూ వచ్చిన కుల, మత శక్తుల నుంచి విమోచన ఇంకా ప్రజలకు దూరంగానే ఉంది. ఎనిమిది దశాబ్దాలుగా తెలుగు ప్రజల్ని హేతువాదం ద్వారా నిరంతరం చైతన్యంతో రగిలించిన భారత హేతువాద సంఘాధ్యక్షుడు, 'హేతువాది' పత్రిక ప్రధాన సంపాదకులు, దార్శనికుడు రావిపూడి వెంకటాద్రి తన 101వ సంవత్సరంలో పరమపదించారు.

**భారత హేతువాద సంఘాధ్యక్షుడు రావిపూడి వెంకటాద్రి తన 101వ సంవత్సరంలో పరమపదించారు. హేతువాదాన్నీ, మానవతావాదాన్నీ వ్యాపింప జేయడానికి దశాబ్దాలుగా వేలకొలదీ పేజీల ద్వారా అనంతమైన కృషి సల్పిన హేతువాది ఆయన. బౌద్ధాన్నీ, దాని హేతువాద దృక్పథాన్నీ నాశనం చేయడం కోసం రాజకీయ ఆధిపత్యం చలాయించిన శక్తుల దుర్మార్గాన్ని చారిత్రకాధారాలతో నిరూపించారు.**

నిష్కల్మష హృదయంతో జీవితం సహేతుక పద్ధతిలో గడిపితే వ్యక్తి మనస్సు ముదిమిని జయిస్తుందని తన జీవితం ద్వారా నిరూపించారు వెంకటాద్రి. సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాలు, భారతీయ తత్వదర్శనాలు, సత్యాన్వేషణ, ఆస్తికత్వం, నాస్తికత్వం, హేతుత్వం, మతతత్వం – ఆయన అన్వేషణా రంగాలు. హేతువాదాన్నీ, మానవతా వాదాన్నీ వ్యాపింపజేయడానికి వేలకొలదీ పేజీల ద్వారా వందలాది సంపుటాల ద్వారా అనంతమైన కృషి సల్పిన విస్పష్ట తొలి తెలుగు హేతువాది ఆయన.

మహాకవి గురజాడ అప్పారావు 110 సంవత్సరాల నాడే – దేశవ్యాపితంగా ఖ్యాతి గడించిన బౌద్ధ ధర్మాన్ని కుల, మత స్వార్థపర వర్గాలు భారత సరిహద్దుల నుంచి ఎలా తరిమి కొట్టాయో చెప్పారు. దేశంలోని బౌద్ధ ధర్మ, హేతువాద పీఠాల్ని బలవంతంగా కూల్చి, వాటి స్థానే హేతువాద విరుద్ధ క్షేత్రాలకు పాలకులు ప్రాణ ప్రతిష్ఠ చేయడం జరిగింది. 'క్రీ.శ. రెండు, మూడు శతాబ్దాల నాటికే' కుల, మత వ్యవస్థకు పునాదులు గట్టిపరచుకొనే శక్తులకూ, బౌద్ధానికీ మధ్య జరిగిన సంఘర్షణకు ఆంధ్రలోని శ్రీ పర్వతమే కేంద్రంబీ బౌద్ధేతర శక్తులు బౌద్ధ భిక్షువులను వారి ఆరామాల నుండి బలవంతంగా బహిష్కరించి, నాగార్జున కొండ వద్ద ఉన్న బౌద్ధారామాలను, విహారాలను ఎలా స్వాధీనం చేసుకున్నారో రావిపూడి వెంకటాద్రి నిరూపణలతో రుజువు చేశారు.

క్రీస్తుపూర్వం శుంగుల కాలం నుంచి క్రీ.శ. ఏడవ శతాబ్దం

దాకా బౌద్ధాన్నీ, దాని హేతువాద దృక్పథాన్నీ నాశనం చేయడం కోసం రాజకీయ ఆధిపత్యం చలాయించిన శక్తుల దుర్మా ర్గాన్ని చారిత్రకాధారాలతో రావిపూడి నిరూపించారు. చైనా యాత్రికు లైన - క్రీ.శ. 4వ శతాబ్దంలో మన దేశాన్ని సందర్శించిన ఫాహియాన్ గానీ, 7వ శతాబ్దం నాటి హ్యుయాన్ త్సాంగ్ గానీ బౌద్ధుల మీద జరిగిన అనేక దాడుల వివరాలను ఎలా పేర్కొన్నారో వివరించారు.

హేతువు మీద ఆధారపడి వర్ధిల్లిన లోకాయత, చార్వాక, బౌద్ధాది దర్శనాల్లోని హేతుబద్ధ భారతీయ తత్వాన్ని పతనం చేసిన తరు వాతనే భావవాదం, ఛాందసవాదానికి కొమ్ములు మొలవడం ప్రారంభించాయని రావిపూడి ఉదాహరించారు. సుప్రసిద్ధ చరిత్రకారుడు లక్ష్మీనరసు తన 'బౌద్ధం అంటే ఏమిటి?' గ్రంథంలో బౌద్ధ ధర్మసారం వివరించారు. ఆ సారాంశాన్ని ఆయన బుద్ధుని మాటల్లోనే చెప్పారు: "నేను బోధించే ధర్మం అందరి పట్ల సమాన ఆదరణ కల్గిన ధర్మం. దీన్ని మన, తన భేదం లేకుండా అందరికీ బోధించండి.

ఇది మంచి వారిని, చెడ్డ వారిని, సంపన్నులను, పేదలను ఒకే విధంగా విముక్తి చేస్తుంది. దీని నుంచి ఎవరికీ ఎలాంటి మినహాయింపూ లేదు. కరుణామయులైనవారు తమను మాత్రమేగాక, ఇతరులనూ విముక్తి చేయాలని కోరుకుంటారు. ఎందరినో విముక్తి చేసినా, చెయ్యవలసింది మరెంతో ఉంటుంది. ఇది నిరంతరం కొనసాగవలసిన ప్రక్రియ. ఈ ధర్మం ప్రపంచమంతా వ్యాపించి దుఃఖసాగరంలో మునిగిన అందరినీ రక్షించాలి.'

ప్రాచీన కాలంలోనే విజ్ఞానకాంతుల్ని వెదజల్లుతూ, సంఘం లోని అజ్ఞానాంధకారాలను బట్టబయలు చేయడానికి బయల్దేరిన భావ విప్లవోద్యమం వెయ్యేళ్లకుపైగా వర్ధిల్లి జన్మించిన భారతదేశంలోనే అడుగంటిపోవడం ఎంతటి విషాదకర పరిణామమో అంటారు రావిపూడి వెంకటాద్రి. ఇక కాలక్రమంలో బౌద్ధంలో చొరబడిన విగ్రహారాధన, పునర్జన్మ, కర్మ సిద్ధాంతాల వంటి మత వాసనలు కూడా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించడంతో తొలగి పోయి హేతువాద, మానవతా వాదాలపై ఆధారపడిన సిసలైన బౌద్ధం వర్ధిల్లాలని రావిపూడి ఆశించారు. అందుకే ఒక సందర్భంలో ఇలా స్పష్టీకరించారు: "ఒక మతం వేరొక మతాన్ని ద్వేషిస్తుంది. కానీ హేతువాదం మతాలన్నింటినీ సమంగా నిరాక రిస్తుంది. అసహనాన్నీ, ద్వేషాన్నీ ప్రదర్శించదు. అసహనం, ద్వేషాల వల్ల మత విశ్వాసాలు మారవని హేతువాదులకు తెలుసు. మతమౌఢ్యం మారాలంటే మానసిక పరివర్తన రావాలనీ, అది చాలా నిదానమైన క్రమమనీ హేతు వాదులకు తెలుసు. ఆంక్షల వల్ల, నిర్బంధాల వల్ల, నిరంకుశ నిషేధాల వల్ల మతతత్వం అణగిపోదనీ హేతువాదులకు తెలుసు. కనుకనే మనుషుల్లో ఉన్న వివేచనా జ్ఞానాన్ని పని చేయించడం ద్వారా మాత్రమే ఏ విధమైన మౌఢ్యాన్ని అయినా రూపుమాపవచ్చుననీ హేతువాదుల నిశ్చితా భిప్రాయం".

అంతేకాదు - "జాతి, మత, కుల, వర్గ ప్రాతిపదికల మీద మనం ఆధారపడితే - విజ్ఞానం, తత్వం, స్వేచ్ఛ, సమత, న్యాయం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికలుగా నిర్ణయించవలసిన మానవతావాద నీతి దుర్లభమవుతుంది. మానవులంతా ఒకటే అనుకున్నప్పుడు, మానవుల మధ్య విభిన్నమయిన నీతులు ఉండటానికి వీల్లేదు... అంతేగాదు, నేటి జాతులన్నీ రక్త సాంకర్యం పొందినవే. సిద్ధాంత సాంకర్యం పొందినవే. వర్గాలన్నీ ఆర్థిక స్థాయీ సాంకర్యం పొంది ఉన్నవే.

అందువల్ల భిన్న జాతి, మత వర్గాల మధ్య స్పష్టమైన విభజన రేఖ గీయడం సాధ్యం కాదు. అందువల్ల జాతి, మత వర్గాల పేర్లతో మనుషుల్ని విభజించడం హేతువిరుద్ధం. అలాంటి హేతు విరుద్ధమైన విభజనను సృష్టించినవారు ఆయా కాలాల్లో పాలక వర్గాలుగా(శాసకులుగా) పెంపొందిన బాపతే. వారు చిరంతన సత్యాలుగా పేర్కొన్న సిద్ధాంతాలన్నీ మానవుణ్ణి పెంపుడు జంతువుగా, సిద్ధాంతదాసుడిగా, డూడూ బసవన్నగా తయారుచేయడానికే దారితీశాయి. కానీ, మనిషి పెంపుడు జంతువు కావడానికి స్వభావతః ఇష్ట పడడు కనుకనే ఎప్పటికప్పుడు వ్యవస్థీకృత సిద్ధాంతాల మీద తిరుగు బాటు చేస్తూ వచ్చాడు. అదే - భావ విప్లవమంటే" అన్నది రావిపూడి మాట! అందుకే కారల్ మార్క్స్ మహనీయుడు 'మతం మత్తుమందు' అని ఏనాడో నిర్వచించి పాఠం చెప్పవలసి వచ్చింది. 'విజ్ఞానాభి వృద్ధితో పాటు పరిణామం చెందే ఆలోచనా వైఖరిగానే హేతువా దం వన్నె తేలుతుందనీ, ఆలోచనలోనూ, ఆచరణలోనూ హేతువాదం ఒక ఉద్యమమ'నీ వేయి విధాల నిరూపిస్తూ వచ్చాడు రావిపూడి వెంకటాద్రి! కనుకనే ఓ కవి కుమారుడున్నట్లు-

'కలవరపడి వెనుదిరిగితె కాలం ఎగబడుతుంది
కదనుతొక్కి చెలరేగితే కాలం భయపడుతుంది
కర్మయోగి ఎన్నడూ కాలాధీనుడు కాదు
కనురెప్పలు మూతపడితె కాలం జోకొడుతుంది
కంఠమెత్తి తిరగబడితే కాలం జేకొడుతుంది!"

ఆఖరి శ్వాసలో కూడా స్థూలంగా అదే రావిపూడి తీర్మానం కూడా! ❑

**(సాక్షి దినపత్రిక సౌజన్యంతో)**

# మతం భ్రమపూరిత జలతారు తెర



సురవరం సుధాకరరెడ్డి,
సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి

**మతాన్ని నిందించటంకంటే హేతువాదాన్ని, శాస్త్రీయ విజ్ఞానాన్ని తద్వారా చైతన్యాన్ని పెంచటం ముఖ్యం. ఈ మధ్య జరిగిన అంతర్జాతీయ సర్వేలో ప్రపంచంలో 110 కోట్ల మందికి పైగా మతాన్ని నమ్మని వారున్నారని తేలింది. ఇది చాలా పెద్ద సంఖ్య. వారు తమ చైతన్యం ద్వారానే ఈ వాస్తవాన్ని అంగీకరిస్తున్నారు. నేరుగా మతంపైన, దాడి చేస్తే అది మరింత గట్టిపడుతుంది. దాని ద్వారా ప్రయోజనం నెరవేరదు. అంధకారాన్ని వెలుగు ద్వారానే బద్దలు కొట్టగలం.**

మతం పట్ల కమ్యూనిస్టుల వైఖరి కమ్యూనిస్టు సిద్ధాంతకర్తలు, విభిన్న సందర్భాలలో విపులంగా వివరించారు. హేతువాద వైఖరితో వుండే వారుగా కమ్యూనిస్టులు, మతాన్ని విశ్వసించరు. విశ్వం దాని ఆవిర్భావం గురించి, భూమి దాని పుట్టుక, జీవుల పుట్టుక, మనిషి రూపం వరకు రూపాంతరం చెందటానికి లక్షల సంవత్సరాల సుదీర్ఘ పరిణామక్రమం వీటన్నింటిని, అందరం చదువుకున్నాం. కాని మతం మీద విశ్వాసం కలిగిన వారు, సైన్సు వేరు, జీవితం వేరు అనుకుంటారు. చదువుకున్న సైన్సు విజ్ఞానాన్ని స్కూలు భవనంలోనే వదిలేస్తారు. మరికొందరు దేవుడి ఉనికిపై అనుమానమున్నా, ఎందుకైనా మంచిదని మొక్కులకు పోతుంటారు. మతాలు ఆవిర్భవించినపుడు సైన్సు అభివృద్ధి కాలేదు. మానవ మేధస్సు ఆలోచించటం ప్రారంభించిన తర్వాత మానవ జాతి పుట్టుక గురించి జిజ్ఞాస ప్రారంభమైంది. అంతకుముందు ప్రకృతి వైపరీత్యాలకు భయపడి ప్రకృతిని ఆరాధించటం ప్రారంభించారు. భయంతో రక్షణ కోసం ఆరాధించేవారు. ఆ తర్వాత సృష్టికర్త ఎవరో వున్నారని ఆలోచన ప్రారంభమైంది. సృష్టికర్త భావన బలపడింది. దానిని ప్రచారం చేయడానికి మతం సృష్టించబడింది. "మనుషులు చేసిన దేవుళ్లారా, దేవుడు చేసిన మనుషుల్లారా" అని పాపులర్ సినిమా పాట వుంది. ప్రపంచంలోని వివిధ ఖండాల్లో వివిధ సందర్భాలలో భగవంతుడిని సృష్టించారు. దేవుడి రూపం అస్పష్టం. అనేక మతాలలో దేవుడి రూపాన్ని చిత్రించ నిరాకరిస్తారు. ఎవరైనా ప్రయత్నిస్తే ఆగ్రహిస్తారు. భారతదేశంలో వైదిక మతం మానవ రూపంలో భగవంతుడిని ఆరాధించటం ప్రారంభమైంది. భగవంతుల సంఖ్య పెరగటం ప్రారంభమైంది. 33 కోట్ల దేవతల రాజ్యం వారి రాజు దేవేంద్రుడు, స్వర్గం, నరకం, తదితరాల సృష్టి జరిగింది. మతం మీద, దేవుడి మీద నమ్మకం లేని వారిని భయపెట్టడానికి, విశ్వాసమున్న వారిని మరింతగా విశ్వాసం బలోపేతం చేయడానికి వీటిని సృష్టించారు. హంతకులు, దొంగలు, హింసాప్రవృత్తి కలవారు, యుద్ధాలు చేసే వారు దేవుడికి మొక్కి తమ పని విజయవంతం కావాలని మొక్కులు చెల్లిస్తారు. జూదగాళ్లు తాము గెలవాలని దేవుడిని కోరుకుంటారు. దేవుడికి అర్పణ పేరుతో టెంకాయల నుండి నగదు, బంగారం దాకా చెల్లిస్తారు. ఈ ప్రపంచమే దేవుడుచే సృష్టించబడిందని నమ్మేవారు, దేవుడికి కానుకలెందుకని ఒక్క క్షణం ఆలోచించరు. దేవుళ్ల పేర్లు వివిధ ప్రాంతాల్లో వివిధ రూపాల్లో వున్నట్లే, రూపాలు మారుతాయి. మానవ రూపంలో శిలా విగ్రహాలు, ఒరిస్సాలోని పూరిలో 12 సంవత్సరాలకొకసారి మార్చే చెక్క విగ్రహాలుంటే, ఆదివాసీలకు సంవత్సరానికొకసారి వచ్చే పండుగకు ఆలయంలోని చెట్టు కింద, రాళ్లు పెట్టి పసుపురాసి ప్రార్థించి జాతర చేసి పోతారు. వీరు కాక దక్షిణ భారతదేశంలో ప్రతి గ్రామంలో గ్రామ దేవతలుంటారు. వీరికి స్థానిక బహుజనుల నుండే పూజారులు ఉంటారు. వైదిక మతంలో బ్రాహ్మణులే పూజారులు. ఇస్లాంలో ఇమామ్‌లు ఉంటారు. క్రైస్తవ మతంలో ఫాదరీలు వీరందరిపైన పోప్ వుంటారు. క్రమంగా మతాలు బలోపేతమైనాయి. మత గురువులు, రాజులు పరస్పర మద్దతుదారులు. తమ మతమే ప్రపంచమంతా విస్తరించాలని యుద్ధాలు జరిగాయి. లక్షల మంది మరణించారు. నిజంగా భగవంతుడు సర్వ శక్తిమంతుడైతే, అన్ని దేశాలలో ఒకే మతం వుండాలి. కొన్ని కొన్ని దేశాలకు ఒక మతం దేవుడు ఎందుకు పరిమితం అవుతారు? ఈ ప్రశ్నలడిగితే హేతుబద్ధమైన సమాధానాలివ్వలేక ఆగ్రహిస్తారు. దాడులు చేస్తారు. అవిశ్వాసుల తలలు నరుకుతారు.

మార్క్సు "మతం అణగదొక్కబడిన బాధాసర్పద్రష్టులైన ప్రజలకు ఓదార్పు నిట్టూర్పు" దశతో ప్రారంభమై "మతం మత్తు మందుగా మారుతుంది" అన్నాడు. మతం ఒక భ్రమపూరిత జలతారు తెర. కమ్యూనిస్టులు హేతుబద్ధంగా, చైతన్య పూరితంగా ఆలోచిస్తారు గనుక మతాన్ని విశ్వసించరు. నిరాకరి

స్తారు. దేవుడి గురించి, చెప్పని మతాలు కొన్ని వున్నాయి. అందులో బౌద్ధం ముఖ్యమైంది. యజ్ఞయాగాదులు లేని, లక్షల పశువుల బలి లేకుండా వుండే సమాజాన్ని, కుల మత భేదాలు లేని సమాజాన్ని వాంఛించింది. చైనా, శ్రీలంక, భూటాన్, సిక్కిం, జపాన్, థాయిలాండ్, ఉత్తరకొరియా, దక్షిణ కొరియా, వియత్నాం తదితర ఆసియా దేశాలలో అత్యధికులు బౌద్ధులే. మతాన్ని విశ్వసించక, దానిలోని లొసుగులు వివరించడం వేరు. మత అనుయాయులను ద్వేషించడం వేరు. కమ్యూనిస్టులు మతాన్ని విశ్వసించకపోయినా, మతాన్ని నమ్మేవారి విశ్వాసాన్ని వారి హక్కుగా గుర్తిస్తారు. అన్ని మతాల వారికి సమాన హక్కులు ఉండాలని కోరతారు. ఫలానా మతానికి అనుకూలం, ఫలానా మతానికి వ్యతిరేకం అనే ప్రసక్తి లేదు. మతం పేరుతో మోసగాళ్లను, ప్రజా వంచకులను బహిర్గతం చేస్తారు.

ఐతే కమ్యూనిస్టు పార్టీ సభ్యులందరూ మతం నుండి దూరంగా, వ్యతిరేకంగా వుండాలనే నిబంధన లేదు. అలాంటి నిబంధన పార్టీ నిబంధనావళిలో చేర్చేందుకు లెనిన్ నిరాకరించాడు. ప్రజలు చైతన్యం ద్వారా విజ్ఞానవంతులు కావాలని ఆయన చెప్పారు. కమ్యూనిస్టులు మతోన్మాదాన్ని ఖచ్చితంగా వ్యతిరేకిస్తారు. అన్ని మతాలలో అత్యధిక ప్రజలు సాధారణ విశ్వాసులు. కొంత మంది వీరభక్తులు. మరికొంతమంది మతోన్మాదులు. సమస్య వీరితోనే. ప్రమాదం వీరితోనే. మతం ప్రమాదంలో పడిందని, ఇతర మతాల వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని, వారి జనాభా పెరిగి, మన జనాభా తగ్గుతుందని భవిష్యత్తులో వారే దేశంలో మెజారిటీ అవుతారని తప్పుడు ప్రచారం చేస్తారు. ప్రతి సమస్యను మత సమస్యగా ప్రజల మనుషుల్లో విషం ఎక్కిస్తారు. మత ఘర్షణలకు కారణమౌతారు. మతోన్మాదం పేర, శవాల గుట్టలు పేర్చి ఆ మెట్ల మీద రాజ్యాధికారం పొందే ప్రయత్నం చేస్తారు. ఏ దేశంలోనైనా మెజారిటీ మతంలో మతోన్మాదం అత్యంత ప్రమాదకరం. మతంతో ఏర్పాటయ్యే దేశాలు అభివృద్ధి చెందకపోగా, మరింత నష్టపోతాయి. ఉదాహరణకు పాకిస్తాన్, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయింది. దుర్భర దారిద్ర్యంతో, ఆకలితో, నిరుద్యోగంతో, టెర్రరిస్టు హత్యలతో, దేశం దివాళా తీస్తున్నది. దాదాపు 40 ఏళ్లపాటు సైనిక పదఘట్టనల కింద నలిగిపోయింది. ఆఫ్ఘనిస్థాన్ మరింత దారుణంగా మతోన్మాద, మూర్ఖ తాలిబాన్ల చేతిలో బతుకుతున్నది. మతోన్మాదం ప్రజాస్వామ్యానికి, ప్రగతికి, విజ్ఞాన వికాసానికి, ఆఖరుకు సాధారణ విద్యకు వ్యతిరేకం. అందువల్లనే మతోన్మాదులకు వారి విద్వేష ప్రచారానికి యావన్మంది ప్రజలు పోరాడాలని కమ్యూనిస్టు పార్టీ కోరుతుంది. కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యం వర్గ దోపిడీకి వ్యతిరేకంగా, ఆర్థిక అసమాన తలకు వ్యతిరేకంగా పోరాడుతూ, ప్రజలలో శాస్త్రీయ విజ్ఞానాన్ని, చైతన్యాన్ని పెంపొందించటం.

మతాన్ని నిందించటంకంటే హేతవాదాన్ని, శాస్త్రీయ విజ్ఞానాన్ని తద్వారా చైతన్యాన్ని పెంచటం ముఖ్యం. ఈ మధ్య జరిగిన అంతర్జాతీయ సర్వేలో ప్రపంచంలో 110 కోట్ల మందికి పైగా మతాన్ని నమ్మని వారున్నారని తేలింది. ఇది చాలా పెద్ద సంఖ్య. వారు తమ చైతన్యం ద్వారానే ఈ వాస్తవాన్ని అంగీకరిస్తున్నారు. నేరుగా మతంపైన, దాడి చేస్తే అది మరింత గట్టిపడుతుంది. దాని ద్వారా ప్రయోజనం నెరవేరదు. అంధకారాన్ని వెలుగు ద్వారానే బద్దలు కొట్టగలం. నేరుగా దాడి చేయకూడదంటే మేము దానికి వ్యతిరేకంగా కాదనే ప్రకటనల ద్వారా కాదు. అది మన మానసిక స్థాయి దిగజారుడు ఔతుంది. వారి ఉచ్చులో పడకూడదు. పార్టీలో నాస్తికులై ఉండి తీరాలని నిబంధన లేదు కాబట్టి, మనం దైవదర్శనాలకు, యజ్ఞాలకు, మతపరమైన కార్యకలాపాలలో భాగం కావడానికి లైసెన్సు కాదు. కమ్యూనిస్టులు హేతుబద్ధంగా ఆలోచించి మతానికి, మతపర కార్యకలాపాలకు దూరంగా వుండాలి. సాధారణ కమ్యూనిస్టు సానుభూతిపరులు వేరు. పార్టీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు వేరు. ఒకసారి నాయకులు తప్పు చేస్తే, క్రింద స్థాయిలో అదొక సాకుగా, సాంప్రదాయకంగా మారుతుంది. అందువల్ల నాయకులు జాగ్రత్తగా వుండాలి. కమ్యూనిస్టు పార్టీ అధికారంలో వుండిన, వున్న సోషలిస్టు దేశాలలో కూడా మత స్వేచ్ఛ ఉంది. సోవియట్లో పాత చర్చిలు, కెథెడ్రిల్స్, అన్నీ అలాగే వుండటమే గాక కొంతమంది ప్రార్థనలకు వెళ్లేవారు. బాకులో ఒక విశాలమైన మసీదును చూడటానికి వెళ్లాము. ఆ ఇమామ్తో కొంతసేపు చర్చించాం. మాకు స్వేచ్ఛ వుంది కాని, కొత్త తరం ప్రార్థనలకు రారు. విరాళాలివ్వరు. పాత వాళ్లు వస్తారు అన్నాడు. ఆయన మనుమడిని పరిచయం చేసాడు. యంఎస్సి చదువుకున్నాడు. మీరు ప్రార్థనలు చేస్తారా అని అడిగాం. నేను సైన్సు విద్యార్థిని, నేను భగవంతుడి ఉనికిని నమ్మను అన్నాడు. మాతో వున్న ఒక ముస్లిం మిత్రుడు "ఇవన్నీ మీకు కాలేజీలో నూరిపోస్తారా" అని అడిగాడు. ఆ యువకుడు కోపంగా మన పుస్తకాలలో రోజూ స్నానం చేయాలని, శుభ్రంగా వుండాలని ఏ పాఠ్య పుస్తకంలో ఉండదు. ఇది కూడా అలాంటిదేనన్నాడు.

చైనాలో బౌద్ధ ఆలయాలు అందంగా, విశాలంగా ఉన్నాయి. అవి ఆరాధ్య స్థలాలేకాక పెద్ద పర్యాటక కేంద్రాలుగా వున్నాయి. ఈ మధ్య కొందరు పార్టీ నాయకులు, కార్యకర్తలు గుళ్లు, దేవాలయాలు, దర్శిస్తున్నారు. అది సరైంది కాదు. అది అశేష వామపక్ష ప్రజానీకానికి మంచి సందేశం పంపదు. కమ్యూనిస్టులుగా చైతన్యం పెంచుకోవాలి. ప్రజలను చైతన్యపర్చాలి. అది మన కర్తవ్యం. ❑

# పెట్టుబడి - స్వేచ్ఛ




కొండూరి వీరయ్య

**చార్లెస్ డార్విన్ మొదలు స్టీఫెన్ హాకింగ్స్ వరకూ, కారల్ మార్క్స్ మొదలు గ్రాంసీ వరకూ ఉన్న భావ ప్రకటనా స్వేచ్ఛ కు సిసలైన ప్రతినిధులు మొదటి తెగకు చెందిన మేధావులు. రెండో రకం మేధావులు కౌటిల్యుడిలాగానో, మాకియావెల్లి లానో, ఆడమ్ స్మిత్ లాగానే ఈ వ్యవస్థ విసిరిన వలలో చిక్కుకుని వ్యవస్థ ప్రయోజనాలు కాపాడటానికి జీవితాలు వెచ్చించిన మేధావులూ ఉన్నారు. ప్రపంచీకరణ దశలో ఈ తరహా మేధావులు కుప్పలు తెప్పలు కనిపిస్తారు. తన మనుగడ కొనసాగించడానికి ఈ రెండు రకాల మేధావులూ అవసరం కావటమే పెట్టుబడిదారీ వ్యవస్థ దురదృష్టం.**

ఏడేళ్ల బిజెపి పరిపాలనలో భారతదేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రమాదంలో పడింది. ప్రత్యేకించి గత రెండేళ్లలో పరిస్థితి మరింత దిగజారింది. తాజాగా రైతు ఉద్యమం నేపథ్యంలో జరుగుతున్న పరిణామాలు భావ ప్రకటనా స్వేచ్ఛ గురించిన చర్చను మరోసారి ముందుకు తెస్తున్నాయి. ఏడేళ్ల కాలంలో దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛపై రెండు కోణాల్లో దాడి జరుగుతోంది. అంతర్జాతీయ గుత్త పెట్టుబడి ప్రయోజనాలను ప్రశ్నించే భావ ప్రకటనా స్వేచ్ఛపై ద్రవ్య పెట్టుబడి సాగిస్తున్న దాడి మొదటిది. ప్రభుత్వాల ప్రగతి నిరోధక మితవాద స్వభావం కారణంగా జరుగుతున్న దాడి రెండోది. ఇక్కడ భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడికి కారణాలు వేరైనా ఫలితం మాత్రం దాడి చేస్తున్న, చేయిస్తున్న వర్గాలకు పరస్పర ప్రయోజనకారిగానే ఉంటోంది. అందువల్లనే సోకాల్డ్ ప్రగతిశీల స్వభావం కలిగిన ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలో సైతం ఇటువంటి దాడులకు పాలకవర్గాల ఆమోదం సాధించటం తేలికైన పనిగా మారింది.

పెట్టుబడిదారీ వ్యవస్థలోని అత్యున్నత దశ సామ్రాజ్యవాదం అని లెనిన్ విశ్లేషించాడు. సామ్రాజ్యవాదం రెండు రూపాల్లో వ్యక్తమవుతుంది. భౌగోళిక సామ్రాజ్యవాదం. భావజాల



సామ్రాజ్యవాదం. మొదటి రూపం లెనిన్ విశ్లేషణకు పునాదిగా మారింది. ఈ విశ్లేషణ సోవియట్ విప్లవాన్ని విజయవంతం చేసింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం సామ్రాజ్యవాదంలోని రెండో కోణం – భావజాల, సైద్ధాంతిక సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థ సార్వత్రిక నియమంగా మారింది. దీన్నే నేడు మనం ప్రపంచీకరణగా పిలుచుకుంటున్నాం. ప్రపంచీకరణ సారాంశమే స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణల రద్దు. ఆ మాటకొస్తే సామాజిక నియంత్రణలు, అదుపాజ్ఞల రద్దు ప్రపంచీకరణ లక్ష్యంలో భాగమేనని చెప్పాలి. ఈ మేరకు మూడు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా మౌలిక ఉత్పత్తి సాధనమైన పెట్టుబడికి ఎక్కడ లేని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సిద్ధించాయి. పెట్టుబడి ఏ మేరకు స్వేచ్ఛను అనుభవిస్తుందో అర్థం చేసుకోవటానికి తాజాగా అమెజాన్ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ రూపొందించిన నోట్లో "చట్టాలను ఎంత మేరకు వెనక్కు నెట్టగలమో ఆ మేరకు వెనక్కు నెట్టాలి" అని రాసుకున్న వాక్యం చక్కని ఉదాహరణ. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడికి ప్రపంచీకరణ దశలో దక్కిన స్వేచ్ఛ, దాని పర్యవసానాల గురించి పెద్దగా వివరించుకోవాల్సిన పనిలేదు. కానీ ప్రపంచీకరణ ప్రతిపాదించిన స్వేచ్ఛ సార్వత్రికమా? సమాజంలోని అన్ని వర్గాలకూ, దేశాలకూ ఈ స్వేచ్ఛ కావాలన్న నిబద్ధత ప్రపంచీకరణ చోదకశక్తులు అంగీకరిస్తాయా? అన్న ప్రశ్నకు మాత్రమే సమాధానం చెప్పే ప్రయత్నమే ఈ వ్యాసం.

## వ్యక్తి గత స్వేచ్ఛ : మార్క్సిస్టు అవగాహన - బూర్జువా అవగాహన

మార్క్స్ రచనల గురించి, మార్క్సిజం గురించిన చర్చల్లో రాజకీయ స్వేచ్ఛ, ప్రజాస్వామ్య కోణాలు తగినంత గుర్తింపు పొందలేక పోయాయి. మార్క్సిజంలో వ్యక్తిగత స్వేచ్ఛకు ఉన్న అర్థం, అవగాహన, ప్రపంచీకరణ దశలో పెట్టుబడి ఏలుబడిలో వ్యక్తిగత స్వేచ్ఛకున్న అర్థం, అవగాహన మధ్య ఉన్న తేడాలు గుర్తించాలి. – వ్యక్తి యొక్క సకల సామర్థ్యాలు స్వేచ్ఛగా వ్యక్తం చేసుకునే అవకాశమే భావ ప్రకటనా స్వేచ్ఛ. భావ ప్రకటనా స్వేచ్ఛ అంటే విద్యా విషయక స్వేచ్ఛ, మేధో స్వేచ్ఛ, విమర్శ నాత్మక స్వేచ్ఛ, మేధో వ్యక్తీకరణ, సాంస్కృతిక వ్యక్తీకరణ భావ ప్రకటనా స్వేచ్ఛలో అంతర్భాగం. వయోజన ఓటింగ్ హక్కు ప్రభుత్వాన్ని విమర్శించేందుకు ప్రజలకు హక్కులు దఖలు పర్చటం, మత విశ్వాసాలు పాటించే హక్కు మతాన్ని, రాజ్యాన్ని వేరు చేయటం, సైనికేతర ప్రాపంచిక దృక్పథాలు పారిస్ కమ్యూన్లో ప్రత్యేక లక్షణాలుగా కారల్ మార్క్స్ గుర్తించాడు. తర్వాతి కాలంలో ఈ లక్షణాలే పశ్చిమ దేశాల ప్రజాస్వామ్యానికి పునాది అంశాలుగా గుర్తించబడ్డాయి. కాకపోతే తేడా ఒక్కటే. మార్క్సిజం ఆచరణాత్మక హక్కులను ప్రతిపాదిస్తే పెట్టుబడిదారీ వ్యవస్థ హక్కుల ప్రకటనను ఆదర్శప్రాయమైన ప్రకటన స్థాయికి కుదించేసింది. మార్క్స్ అవగాహనలో ప్రతి వ్యక్తి తనను తాను సంపూర్ణంగా ఆవిష్కరించుకోవటానికి కావల్సిన స్వేచ్ఛ ఉండాలి. భౌతికంగా, భౌతిక అవసరాలు సమకూర్చుకునే దైనందిన ఒత్తిళ్ల నుండి విముక్తి పొందినప్పుడే వ్యక్తి తనను తాను సంపూర్ణంగా ఆవిష్కరించుకోగలుగుతారు. అందుకే మార్క్స్ వ్యక్తి స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ గురించి మాట్లాడేటప్పుడు సార్వత్రిక ఆచరణాత్మక సానుకూల హక్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాడు. దీనికి భిన్నంగా భారతదేశంతో సహా బూర్జువా రాజ్యాంగాలన్నీ హక్కులను ప్రతి కూల హక్కులుగా గుర్తిస్తాయి. ఉదాహరణకు వాక స్వాతంత్ర్యపు హక్కు గురించి భారత రాజ్యాంగం "ఇతరుల హక్కులకు అవరోధం కలగకుండా ఉండేంతవరకు..." భారతీయులందరూ వాక్ స్వాతంత్ర్యం హక్కును అనుభవించవచ్చని చెపుతోంది. భారత రాజ్యాంగంలో వ్యక్తి స్వాతంత్ర్యాల గురించి అందమైన భాషలో వర్ణించినా, అవి రాజ్యంపై పెట్టుబడి పట్టు బిగిస్తున్న కొద్దీ ఆలంకారప్రాయమైన హక్కులు గానే మిగిలిపోతున్నాయి. గత ఏడేళ్లలో భావ ప్రకటనా స్వేచ్ఛ, వ్యక్తి స్వాతంత్ర్యాలపై జరుగుతున్న దాడిని దీనికి పరాకాష్టగానే పరిగణించాలి.

రాజ్యం వ్యక్తి ఆలోచనలను, వ్యవహార శైలిని నియంత్రించాలని ప్రయత్నం చేస్తున్నపుడు అదే రాజ్యం సదరు వ్యక్తి తనను తాను సంపూర్ణ వ్యక్తిగా ఆవిష్కరించుకునేందుకు అన్ని అవకాశాలు కల్పించాలన్నది మార్క్సిస్టు అవగాహన. కానీ బూర్జువా రాజ్యాంగాలు దీనికి భిన్నంగా వ్యక్తుల ఆలోచనా సరళిని, జీవన శైలిని నియంత్రించాలని కోరుకుంటాయే తప్ప సదరు వ్యక్తి తనను తాను సంపూర్ణంగా ఆవిష్కరించుకునేందుకు కావల్సిన అవకాశాలను అందించవు. అవసరాలు తీర్చుకునే మార్గాలు అందుబాటులో ఉంచవు. ఈ వైరుధ్యాన్ని మనం నిత్య జీవితంలో చూస్తూనే ఉన్నాం. కార్మికుడు ఉత్పత్తి వలయంలో ఎలా ఎన్ని గంటలు మసలుకోవాలో, ఏ స్థాయిలో ఉత్పత్తి సాధించాలో నిర్దేశించే బూర్జువా రాజ్యాంగాలు, చట్టాలు సదరు కార్మికుడు ఆ స్థాయిలో పని చేయటానికి కావల్సిన వేతనాలు, విరామం, సాంస్కృతిక అభివృద్ధి, సామాజిక వాతావరణాన్ని మాత్రం కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వాలపై మోపకపోవ టాన్ని మనం ఉదాహరణగా చూడొచ్చు. తాజాగా పార్లమెంట్ ఆమోదించిన కార్మికచట్టాల సవరణలో కనిపించేది బూర్జువా రాజ్యాంగాల్లోని హక్కుల గురించిన ఈ అవగాహన పర్యవసానమే. పెట్టుబడి పూర్తిస్థాయిలో ఆవిష్కృతం కావటానికి బూర్జువా రాజ్యాంగాలు సాధనాలుగా ఉంటే మార్క్స్ ఆశించిన సోషలిస్టు సమాజం వ్యక్తి తనను తాను పూర్తిస్థాయిలో ఆవిష్కృతం కావడాన్ని లక్ష్యంగా నిర్దేశించుకుంటుంది. సమాజాన్ని మార్చడానికి కావల్సిన విప్లవాన్ని సాధించడంలో వర్గాలు కీలక పాత్ర పోషించినా విప్లవానంతర సమాజం మాత్రం వ్యక్తుల సమున్నతాభివృద్ధి, సమగ్రాభివృద్ధిని లక్ష్యంగా ఎంచుకుంటుంది. కమ్యూనిజాన్ని సమాజంలో వర్గాలు అంతర్ధానమవుతాయనే మార్క్స్ ప్రతిపాదనను ఈ కోణంలో అర్థం చేసుకోవాలి. వర్గ సమాజంలో వ్యక్తులు వివిధ వర్గాల్లో భాగంగా సామాజిక సంబంధాల్లోకి ప్రవేశిస్తారు. సామాజిక వ్యవహారాల్లో పాల్గొంటారు.

కానీ మార్క్స్ ఊహించిన సమాజంలో వ్యక్తులు స్వతంత్ర వ్యక్తులుగానే సామాజిక వ్యవహారాల్లో భాగస్వాములవుతారు. అంటే వర్గ సమాజంలో వ్యక్తులు అవసరాలు తీర్చుకోవటానికి వర్గం ఓ ఉమ్మడి అస్తిత్వంగా, సాధనంగా ఉపకరిస్తే మార్క్స్ ఆశించిన సమాజంలో వ్యక్తులు సంపూర్ణ స్వేచ్ఛాయుత సభ్యులుగానే ఉండి తమ అవసరాలు తీర్చుకోగలుగుతారు. తమను తాము సంపూర్ణ సమగ్ర వ్యక్తులుగా అస్తిత్వాలుగా మల్చుకోగలుగుతారు.

## చరిత్రలో భావ ప్రకటనా స్వేచ్ఛ

చరిత్రలో భావ ప్రకటనా స్వేచ్ఛ అనేక మేధో విప్లవాలకు తెర తీసింది. ప్రత్యేకించి పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావంతోనే భావ ప్రకటనా స్వేచ్ఛ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. మతం, మతమౌఢ్యం రాజ్యాన్ని కబళించినంత కాలం భావ ప్రకటనా స్వేచ్ఛ మతమౌఢ్యంపై పోరాడింది. ప్రకృతి, సమాజ

పరిణామం, మానవాళి చరిత్ర, ఆస్తి సంబంధాలు, వర్గాలు రూపొందటం, సంపద కేంద్రీకరణ వంటి విషయాలన్నింటికీ ఉన్న మతపరమైన పునాదిని, ప్రాతిపదికను నాటి భావ ప్రకటనా స్వేచ్ఛతోనే ప్రశ్నించగలిగాము. శాస్త్రీయ ఆలోచనా విధానం చరిత్రగా రాసుకుంటూ పోతే సోక్రటీసుతో మొదలు పెట్టాల్సి ఉంటుంది. భారతదేశంలో చార్వాకులు, లోకాయతతో మొదలై స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్, తర్వాతి కాలంలో ఉనికిలోకి వచ్చిన ప్రజాతంత్ర రచయితల వేదికల వరకూ సమీకృత చరిత్ర భారతదేశంలో శాస్త్రీయ ఆలోచనా చరిత్రగా మనం క్రోడీకరించుకోవచ్చు. ప్రతి వర్గమూ తన లక్ష్యాలు సాధించుకునేందుకు వీలుగా సమాజాన్ని పూర్వపు సామాజిక ఆర్థిక బంధనాల నుండి విముక్తి చేయటానికి ప్రయత్నం చేస్తుంది. పారిశ్రామిక విప్లవంతోపాటు నిర్దిష్ట భావనగా ఉనికిలోకి వచ్చిన భావప్రకటనా స్వేచ్ఛ మౌలిక లక్ష్యం భూస్వామ్య భావజాలం, సైద్ధాంతిక పునాది నుండి సమాజాన్ని విముక్తి చేసి పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయోజనాలు తీర్చటానికి వీలుగా మార్చటమే. అందువల్లనే నాలుగు శతాబ్దాలుగా పెట్టుబడిదారీ వ్యవస్థీకరణతో పాటు వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కూడా ఆధునిక సమాజపు ప్రాథమిక లక్ష్యాలుగా, లక్షణాలుగా గుర్తింపు పొందుతూ వచ్చాయి. అందుకే ఆధునిక రాజ్యాంగాలన్నీ వ్యక్తిగత హక్కులు, స్వేచ్ఛలకు తమదైన శైలిలో ఎంతో కొంత ప్రాధాన్యత ఇచ్చాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ తొలినాళ్లలో అంగీకరించిన భావ ప్రకటనా స్వేచ్ఛ ఆ వ్యవస్థలో ఉత్పత్తి శక్తులు, వాటి సామర్థ్యాలు పెంచడంలో కీలక పాత్ర పోషించింది. ప్రకృతి రహస్యాలను ఛేదించటంలో త్రిశంకు స్వర్గాన్ని సృష్టించటంలో ఆయుధాలుగా పని చేశాయి. ఈ భావ ప్రకటనా స్వేచ్ఛతో అందివచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ప్రకృతిలో అంతర్భాగాలైన భూమి, గాలి, నీరు, ఆకాశం వంటి పంచభూతాలను సైతం అమ్మకానికి వీలైన సరుకుగా మార్చడంలో ఆయుధంగా ఉపయోగపడింది. పెట్టుబడిదారీ విధానం ప్రపంచవ్యాప్తంగా సార్వత్రిక ఉత్పత్తి విధానంగా మారిన తర్వాత భావ ప్రకటనా స్వేచ్ఛ, వ్యక్తిగత స్వేచ్ఛలు ఈ వ్యవస్థ మనుగడకు సవాలు విసరటం మొదలైంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంపద సృష్టి, కేంద్రీకరణ నిరంతరాయంగా కొనసాగటానికి, భావప్రకటనా స్వేచ్ఛపరంగా పోగుపడ్డ సంపదపై పెత్తనం కొనసాగించటానికి భావ ప్రకటనా స్వేచ్ఛకు మధ్య ఉన్న వైరుధ్యం మొదటిది. ఇక్కడ కేంద్రీకరణ అన్న పదాన్ని కేవలం సంపద కేంద్రీకరణకు మాత్రమే పరిమితం చేయకూడదు. కేంద్రీకరణ అంటే కేవలం ఉత్పత్తి కేంద్రీకరణ మాత్రమే కాదు. ఉత్పత్తి కేంద్రీకరణకు దారితీసే సామాజిక మేధో పరిస్థితుల నిర్మాణం కూడా. పెట్టుబడిదారీ వ్యవస్థ తన అధికారాన్ని మరింత సంఘటితం చేసుకోవాలంటే దానిపై సమాజం, పౌర మేధావులు విధించే పరిమితులు, నియంత్రణలను అధిగమించాలి. ఈ క్రమంలోనే తెరమీదకు వచ్చిన ఫ్రెంచి విప్లవం వ్యక్తిగత హక్కులను ఎజెండాగా మార్చింది. ఓ సూత్రీకరణగా చెప్పుకోవాలంటే పెట్టుబడిదారీ విధానం విస్తరించాలంటే ప్రకృతి నుండి సహజ వనరులను, సమాజం నుండి మానవ వనరులను ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సాధనాలుగా మల్చుకోవాలి. దానికి గాను ప్రకృతిని అర్థం చేసుకోవాలి. సమాజాన్ని అర్థం చేసుకోవాలి.

ప్రకృతిని, సమాజాన్ని ఉత్పత్తి సాధనాలుగా మల్చగలిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలి. సమాజానికి అలవాటుచేయాలి. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావాలంటే భౌతిక శాస్త్రాలు అభివృద్ధి కావాలి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, నిర్వహణ నిర్నిరోధంగా జరగాలంటే సమాజమూ, రాజకీయ అర్థశాస్త్రమూ అర్థం కావాలి. ఇవన్నీ జరగాలంటే వ్యక్తిగత సృజనాత్మకత, మేధో స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ అనివార్యమైన సాధనాలు. ఈ మేరకు పెట్టుబడిదారీ వ్యవస్థ తన ఆధిపత్యాన్ని కొనసాగించుకునేందుకు వీలుగా వ్యక్తిగత హక్కుల విషయంలో కొన్ని మినహాయింపులు ఇచ్చింది. కొన్ని మినహాయింపులకు లోబడిన వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే అన్ని బూర్జువా రాజ్యాంగాల్లో మనకు కనిపిస్తున్న హక్కులు. మరోవైపున పెట్టుబడిదారీ విధానం సమాజంపైనా ప్రత్యేకించి శ్రామిక జనావళిపైనా తన పట్టును ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవడానికి సిద్ధపడదు. ఈ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి అవసరమైతే హింసకు పాల్పడడానికి కూడా సిద్ధమే. సదరు హింస నిరంకుశత్వం పర్యవసానం కావచ్చు, ఫాసిజం పర్యవసానం కావచ్చు లేదా మరో రకమైన గుత్తాధికార కేంద్రీకరణ, ఆథారిటేరియన్, టొటాలిటేరియన్ పాలన రూపం తీసుకోవచ్చు. ఈ రకమైన నియంత్రణ సాధించే ప్రయత్నంలోనే అనేక చట్టాలు, నియమ నిబంధనలు ఉనికిలోకి వస్తాయి. ఈ చట్టాలు, నియమ నిబంధనలు బూర్జువా వర్గపు ఉమ్మడి నియంత్రణతోపాటు వ్యక్తిగత బూర్జువాలు తమ పరిధిలోని సమాజాన్ని నియంత్రించేందుకు కూడా కావల్సిన పునాదులు వేస్తాయి. తదనుగుణంగా సదరు పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి దశ, దిశల నిర్దిష్ట అవసరాలను బట్టి భావప్రకటనా స్వేచ్ఛపై పరిమితులు పెరుగుతూ తరుగుతూ ఉంటాయి. వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రభుత్వాలను విమర్శించే స్వేచ్ఛ సంపూర్ణస్థాయిలో అమలు జరిగితే ఈ దోపిడీ పాలనకు చరమగీతం పాడే సమయం దగ్గరపడుతుంది.

పై సూత్రీకరణలు నిర్ధారించుకోవడానికి మనం మన దేశపు

ఉదాహరణనే తీసుకోవచ్చు. ఆసియా దేశాలు ప్రత్యేకించి భారతదేశం వంటి దేశాల్లో వలసపాలన కాలం వరకూ ఉనికిలో ఉన్న ఉత్పత్తి రూపాన్ని ఏసియాటిక్ మోడ్ ఆఫ్ ప్రొడక్షన్ అంటున్నాం. భారతదేశంలో వలసపాలన ప్రవేశించే వరకూ విద్యా విజ్ఞానం, వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ, ఆఖరికి ప్రశ్నించే హక్కు కూడా కులీన వర్గాలకు, రాజ కుటుంబాలకు మాత్రమే పరిమితమైంది. మిగిలిన సమాజం జ్ఞానాంధకారంలో వేల ఏళ్లపాటు కొనసాగింది. జ్ఞానాంధకారం ఉన్న చోట భావ ప్రకటనా స్వేచ్ఛను ఆశించలేం. సామాజిక స్వేచ్ఛ గురించి మన చరిత్ర మనకు తెలిసినంతగా ఇతరులకు తెలియదు. అందుకే పాశ్చాత్య దేశాలు ప్రత్యేకించి పశ్చిమ యూరప్ దేశాలు ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, సామర్థ్యాన్ని పెంచటానికి కావాల్సిన విద్యావ్యవస్థ, మనోవికాస వ్యవస్థల దిశగా అడుగులు వేయడం ప్రారంభిస్తే మనం మాత్రం జ్ఞానాంధకారాన్ని మరింత చిక్కబరుస్తూ వెళ్లాము. అందువల్లనే క్రీస్తు పూర్వం 3-5 శతాబ్దాల్లోనే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విశ్వ విద్యాలయాలను నెలకొల్పిన భారతదేశంలో జ్ఞాన సంపద క్రీస్తు శకానంతరం మనువాద మాయాజాలంలో చిక్కుకుపోవటంతో హెగెల్ అంతటి వాడు భారతదేశంలో కోతులను దేవుళ్లుగా పూజిస్తారని ఎద్దేవా చేస్తూ రాశాడు. అంత జ్ఞానాంధకారంలో సైతం ఎర్రకోట, తాజ్ మహల్ వంటి సాంస్కృతిక కళాఖండాలు మొదలు రామప్ప చెరువు, గోల్కొండ పైకి నీటి సరఫరా వరకూ పాలకవర్గాలకు కావల్సిన సాంకేతిక పరిజ్ఞానం వరకూ అందుబాటులో ఉంచుకున్నాయి పాలకవర్గాలు.

**ప్రపంచీకరణ దశలో భావ ప్రకటనా స్వేచ్ఛ:**

భావప్రకటనా స్వేచ్ఛపై నాడున్న నియంత్రణకు నేడున్న నియంత్రణకు గుణాత్మకమైన తేడా ఉంది. నాటి నియంత్రణ ఫలితంగా ఉత్పత్తి శక్తుల అభివృద్ధి కుంటుపడింది. సమాజం జ్ఞానాంధకారంలో మగ్గింది. భావ ప్రకటనా స్వేచ్ఛ సార్వత్రిక విలువలు కలిగిన అంశం. ప్రశ్నించేతత్వం, మేధో వికాసం, భావ ప్రకటనా స్వేచ్ఛలు పెట్టుబడిదారీ విధానపు అవసరాలు తీర్చాలన్న ముందస్తు అవగాహనతో పని చేయవు. ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తమదైన స్వతంత్ర విలువలను, ఉనికిని, నిర్వర్గ స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఆధిపత్య వర్గాలు ప్రకృతితో సహా అన్నిటినీ తమ అదుపులోకి తీసుకుని తమ ప్రయోజనాలు కాపాడుకునే ప్రయత్నంలో సాధనాలుగా మార్చుకుంటాయి. అదేవిధంగా భావ ప్రకటనా స్వేచ్ఛ పర్యవసానంగా ఉనికిలోకి వచ్చిన శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంపై కూడా ఆధిపత్య వర్గాలు పెత్తనం చలాయిస్తాయి. ఫలితంగానే ఈ శాస్త్ర విజ్ఞాన సాంకేతికాభివృద్ధి ఫలితాలు సదరు సమాజంలోని ఆధిపత్య వర్గాల ప్రయోజనాలు తీర్చే సాధనాలుగా మారతాయి. అంతేకానీ శాస్త్ర సాంకేతిక వికాసానికిదారులు వేసిన మహనీయులంతా పెట్టుబడిదారీ వర్గాధిపత్యం నీడనే బతకాలని కోరుకోరు. చార్లెస్ డార్విన్ మొదలు స్టీఫెన్ హాకింగ్స్ వరకూ, కారల్ మార్క్స్ మొదలు గ్రాంసీ వరకూ ఉన్న భావప్రకటనా స్వేచ్ఛకు సిసలైన ప్రతినిధులు మొదటి తెగకు చెందిన మేధావులు. రెండో రకం మేధావులు కౌటిల్యుడిలాగానో, మాకియావెల్లిలాగానో, ఆడమ్ స్మిత్ లాగానే ఈ వ్యవస్థ విసిరిన వలలో చిక్కుకుని వ్యవస్థ ప్రయోజనాలు కాపాడటానికి జీవితాలు వెచ్చించిన మేధావులూ ఉన్నారు. ప్రపంచీకరణ దశలో ఈ తరహా మేధావులు కుప్పలు తెప్పలు కనిపిస్తారు. తన మనుగడ కొనసాగించడానికి ఈ రెండు రకాల మేధావులూ అవసరం కావటమే పెట్టుబడిదారీ వ్యవస్థ దురదృష్టం.

కాలం గడిచే కొద్దీ జ్ఞానార్జన మార్గాలు సాధనాలు, ఉపకరణాలు మారిపోతూ ఉంటాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆధునిక రూపం తీసుకున్న తర్వాత కలం, కాగితం, గ్రంథాలయాలు ఇటువంటి ఉపకరణాలుగా మారతాయి. మార్క్స్ మొదలు అంబేద్కర్ వరకూ ఆధునిక సమాజ నిర్మాతలైన మేధావులకు ముడిసరుకు సమకూర్చింది. లండన్లోని గ్రంథాలయం. ప్రపంచీకరణ దశలో కంప్యూటర్లు, సామాజిక మాధ్యమాలు, మొబైల్ ఫోన్లు అటువంటి జ్ఞానార్జనా సాధనాలుగా ఉన్నాయి. పెట్టుబడిదారీ విధానపు ప్రపంచీకరణ దశలో అనివార్యంగా పెరిగిన విద్యావకాశాలు, స్వతంత్ర జీవనోపాధి మార్గాలు, మేధో తృష్ణ పర్యవసానంగా స్వతంత్ర మేధావులు, కళాకారులు, రచయితలు, విలేకరులు, విశ్లేషకులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో కూడిన ఓ సమూహాన్ని ఈ వ్యవస్థ ఉనికిలోకి తెస్తుంది. అయితే ఈ సమూహం కూడా ప్రత్యక్షంగానో పరోక్షంగానో తన సేవలోనే కొనసాగాలని పెట్టుబడిదారీ వ్యవస్థ ఆశిస్తుంది. ఈ దిశగానే పెట్టుబడిదారీ వ్యవస్థ స్వతంత్ర తరగతులుగా ఉన్న న్యాయవాదులు, వైద్యులు, అధ్యాపకులు వంటి వారి ప్రాధాన్యతను తగ్గిస్తూ పోతుంది. ఈ స్వతంత్ర తరగతులు నేడు కార్పొరేట్ ఆసుపత్రుల పైనో, కార్పొరేట్ న్యాయవాద సంస్థల పైనో, ప్రైవేటు విద్యా సంస్థల పైనో ఆధారపడి బతుకీడ్వాల్సి వస్తుంది. దాంతో అప్పటి వరకూ స్వతంత్ర మేధో తరగతిలో భాగంగా ఉన్న ఈ తరగతి ప్రపంచీకరణ విస్తరించే కొద్దీ పెట్టుబడిపై ఆధారపడిన వేతన జీవులుగా మారుస్తుంది. ఈ పరిణామం మన గత రెండు దశాబ్దాలుగా మన దేశంలో కూడా కనిపిస్తోంది. ఈ పరిణామమే మనకు టెక్నోక్రాటిక్ (ఉన్నత స్థాయిల్లోని సాంకేతిక నిపుణులైన ఉద్యోగులు, పెట్టుబడిదారీ వ్యవస్థను అజమాయిషీ చేసే క్రతువులో భాగస్వాములైన ఉద్యోగులు) తరగతిని ఓ విలక్షణమైన తరగతిగా మన ముందు తీర్చి దిద్దుతుంది. ❑


# మార్క్సిస్టు సౌందర్యశాస్త్రం



డాక్టర్ తక్కోలు మాచిరెడ్డి

**గియోర్గి లూకాచ్ రాసిన 'సౌందర్య శాస్త్రం' ఉద్గ్రంథం ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చింది. మొదట 1911-12 శీతాకాలంలో ఫ్లోరెన్స్ పట్టణంలో ఓ స్వతంత్ర సమగ్ర సౌందర్య శాస్త్రం రాయాలని అనుకొన్నాడట. ఐడెల్‌బర్గ్ 1912-14 మధ్య దీనిపై కొంత కృషి చేశాడు. కాని ఆ ప్రయత్నం ఫలించలేదు. 1930లో ఓ ప్రణాళికా బద్ధమైన సౌందర్య శాస్త్రం రాయాలనేది ఒక యోచనగా మాత్రమే మిగిలింది. రెండు దశాబ్దాల తర్వాత, అంటే 50 వ దశాబ్దంలో ఆ కల నెరవేరింది.**

మధ్య యూరప్‌లోని ఒక చిన్న దేశం హంగేరి. 1885 వ సంవత్సరం ఏప్రిల్ 13న బుడాపెస్ట్‌లో ఓ సంపన్న యూదు కుటుంబంలో జన్మించాడు గియోర్గి లూకాచ్. అతని నాన్న ఓ బ్యాంకు నిర్వాహకుడు. అమ్మ కఠినమైన క్రమశిక్షణ అమలు చేసే వ్యక్తి. కుటుంబంలోని వారందరూ యూదు వాదాన్ని తిరస్కరించే వారే. లూకాచ్ తొమ్మిదవ ఏటనే హోమర్ రాసిన 'ఇలియడ్' చదివాడు. 15 ఏళ్ల ప్రాయంలో బాదలేర్, ఎమిలి జోలా, ఇబ్సెన్, స్విన్ బర్న్ రచనల రుచి చూశాడు. ఫ్రెంచ్ భాష నేర్చుకున్నాడు. జర్మనీ, ఆస్ట్రియా ఘటనల్ని ప్రభావితం చేసే పనిలో ఆయన జర్మన్ భాషపై పట్టు సాధించాడు. 18వ ఏట తాను రాసిన రచనల్ని నాశనం చేశాడు. 1906లో అంటే తన 21వ సంవత్సరం వయసులో బుడాపెస్ట్‌లో డాక్టరేట్ డిగ్రీ పొందాడు. తర్వాత ఎక్కువ భాగం బెర్లిన్, హైడల్‌బర్గ్ పట్టణాల లో నివసించాడు. 1908లో కార్ల్ మార్క్స్ రాసిన 'పెట్టుబడి' చదివాడు. జర్మన్ జాతివాదం కారణంగా వచ్చిన మొదటి ప్రపంచ యుద్ధాన్ని నిరసించాడు. ఆ సమయంలో రోజా లక్సెమ్ బర్గ్ రచనలు చదివాడు. హంగేరి సామ్యవాద పార్టీలో చేరి కమ్యూన్‌లో(1918–1919) తన పాత్ర నిర్వహించాడు. 1919లో కొంత కాలంపాటు హంగేరిలో ఏర్పాటుచేసిన 'హంగేరి సోవియత్' ప్రభుత్వంలో సాంస్కృతిక శాఖ మంత్రిగా పనిచేశాడు. ప్రపంచ విప్లవం వస్తుందని నమ్మాడు. ఈ నమ్మకంతోనే "చరిత్రవర్గ చైతన్యం" అనే ఉద్గ్రంథం రాశాడు. (1923) అందులో లూకాచ్‌పై హెగెల్ ప్రభావం గమనించ వచ్చు. "ఆర్థికానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడం కాదు మార్క్స్ వామపక్ష సిద్ధాంత విలక్షణత, సమస్తత అభివర్గానికి ప్రాధాన్యం ఇవ్వడమే దాని విశిష్టత" అని అంటాడు లూకాచ్. సమస్తత ఒక మౌలిక భావన. ఈ భావన ద్వారా కలిగే చైతన్యం ప్రపంచాన్ని నిర్దేశిస్తుంది. ఒక క్రమంలో లేనట్లు కన్పించే ఘటనలను పొందుపరచి మనకు అవగాహన అయ్యేట్లు చేస్తుంది. ఈ సమస్తతా భావన తత్వశాస్త్రం, కళ ఈ సమస్తతా సారం కోసం అన్వేషిస్తాయి. "చరిత్ర వర్గ చైతన్యం" అనే గ్రంథం ఏడవ ఎడిషన్‌కు రాసిన భూమికలో (1967) లెనిన్ గురించి రాస్తూ లూకాచ్ "లెనిన్ ఒక సిద్ధాంత కర్త, వ్యవహారదక్షుడు మాత్రమే కాదు, 'ఫిలాసఫర్ ఆఫ్ ప్రాక్సిస్' అని అభివర్ణిస్తాడు. ఆలోచన, ఆచరణ కలగలిసి ఉండేదాన్ని ప్రాక్సిస్ అంటారు. మనిషి వస్తువుగా ఎలా మారతాడో చెబుతూ 'సరుకుల మహిమారాధన' ఆధునిక పెట్టుబడివాద యుగపు ప్రత్యేకమైన సమస్య అని అంటాడు లూకాచ్. ప్రస్తుతానికి అన్వయించుకుంటే, మనిషిని ఇపుడు వస్తువు కంటే సరుకు కంటే హీనంగా పరిగణిస్తున్నారు. పెట్టుబడివాద సమాజంలో మనుషులు చేసిన వస్తు ప్రపంచం మనుషులపైనే పెత్తనం చలాయిస్తుంది. మనుషులు కేవలం పదార్థాలుగా, వస్తువులుగా, సరుకులుగా, పూరికే కూచునే నిష్క్రియ ప్రేక్షకులుగా తయారవుతున్నారు.



వస్తువీకరణ వల్ల కలిగే పరిణామాల్లో ఒకటి సమస్తత యొక్క ప్రతి రూపమూ ధ్వంసం కావడం. ఈ సమస్తతా భావన కార్ల్ మార్క్స్ హెగెల్ నుంచి తీసుకున్నాడు. దీన్నే లూకాచ్ విశ్లేషిం చాడు, అన్వయించాడు. సమస్తత ద్వారానే వాస్తవికతను అర్థం చేసుకోవడం, అందులోకి చొరబడగలగడం వీలవుతుంది. అది వర్గం మాత్రమే చేయగలుగుతుంది. అపుడే పరివర్తన సాధ్యమౌతుంది అని లూకాచ్ భావిస్తాడు. ఆనాటి యూరప్ రాజకీయాల్ని విశ్లేషిస్తూ హిట్లర్ గురించి చెప్పాడు లూకాచ్. ఒక రాజనీతిజ్ఞునిగా హిట్లర్ జర్మనీ అధ్యక్షుడు ఎలా అయ్యాడో విశ్లేషించాడు. ఏకాధికార పెట్టుబడివాదం ఫాసిజానికి దారి తీసింది. అరికట్టలేని నిరుద్యోగిత, ప్రజల దారిద్ర్యం వల్ల జనం లో పెట్టుబడివాద వ్యతిరేక పవనాలు వీచసాగాయి. నిరాశ, నిస్పృహ చెందిన మధ్య తరగతి జనం, బుద్ధి జీవుల ప్రజా సమూహాలు జాతీయ సమాజవాదం వైపు మొగ్గారు. జర్మనీకి ఒక విశ్వసనీయమైన, కష్టాలు తీర్చగలిగే అద్భుతాలు చేయగల ఒక నాయకుడు కావలసి వచ్చింది. "దైవ దత్త అసాధారణ వ్యక్తి"గా హిట్లర్ రావడం జరిగింది. అంతే ఇక ఏముంది? ఫాసిజంకు దారి సుగమమైంది. దానికి జర్మన్ భూమి పరిపక్వ మైనట్లు అయింది. ఇదీ లూకాచ్ విశ్లేషణ. మన దేశంలో ఇపుడు దాదాపు అదే పరిస్థితి కనిపిస్తోంది.

## లూకాచ్ సౌందర్య శాస్త్రం

'కళాతాత్వికత' అనే వ్యాసంలో లూకాచ్ సౌందర్యాత్మక స్థాయిని సంతరించుకొనే ప్రకృతి సౌందర్యానుభూతి ఉండవచ్చు అని అంటాడు. అందువల్లే ప్రకృతికి సంబంధించిన ఓ సౌందర్య శాస్త్రం రూపొందించవచ్చు అని అభిప్రాయపడతాడు. ఆధుని కతా వాదం కళను ఉన్నతీకరించదు. సరికదా అది కళను నిజమైన కళను తిరస్కరిస్తుంది అని ప్రకటిస్తాడు. సోషలిస్టు సమాజంలో విమర్శనాత్మక వాస్తవికతా వాదం ఉంటుంది. ఉండాలని అంటాడు లూకాచ్. మన రస సిద్ధాంతాన్ని పోల్చి నట్లు అన్పించే ఒకమాట అంటాడు ఆయన. పాఠకుడు లేక శ్రోత, లేక ప్రేక్షకుడు పునరనుభవిస్తాడు అని అంటూ అది తనదైన అనుభూతి అనీ, కళ నుంచి పొందే అనుభూతి అనీ విశ దీకరిస్తాడు. పునరనుభూతి ఎంత తీవ్రంగా ఉంటే అంత స్వతః స్ఫూర్తంగా ఉంటుంది. ఆ అనుభూతి అని చెబుతాడు. 1930 దశాబ్ది నుంచి లూకాచ్ కళా సమస్యల్ని గురించి ప్రత్యేకంగా ఆలోచించాడు. మాస్కోలో ఉన్నా స్టాలిన్ వాదాన్ని ముఖ్యంగా జ్దానొవ్ సూత్రీకరణల్ని అంగీకరించేవారు కాదు, బాహాటంగా కాక నర్మగర్భంగా విమర్శించేవారు. మార్క్స్ వాదాన్ని సౌందర్య శాస్త్రానికి ఎలా అన్వయించాలి అనే అంశాన్ని లోతుగా ఆలోచిం చాడు. సంప్రదాయాన్ని అర్థం చేసుకోవడాన్ని అధిగమించాలి అని భావించాడు. మార్క్సువాదం సమస్త సంప్రదాయానికే వ్యతిరేకం కాదని నమ్మాడు, కార్ల్‌మార్క్స్, షేక్స్పియర్ నాటకాల్ని, కవితల్ని మెచ్చుకునేవాడనీ లూకాచ్ గుర్తు చేసేవాడు. ప్రకృతి కంటే, చిత్రీకరించిన ప్రకృతి అందంగా ఉంటుందనే వాదం సరికాదని అనేవాడు. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించలేని వాడు కళను ఎలా ఆస్వాదించగలడు అని ప్రశ్నిస్తాడు. సుందర వస్తువుల్ని, అందమైన ప్రకృతినీ ఆస్వాదించే శక్తి మనకు మానవ పరిణామ చరిత్ర ఇచ్చింది. కళా ప్రయోజనాన్ని గురించి రాస్తూ లూకాచ్ కళ మనల్ని కుల, మత దేశాలకు అతీతంగా ఉంచు తుంది. దేశ కాలాలను అధిగమించేట్లు చేస్తుంది. జీవితం గొప్ప క్షణాల్ని ఇస్తుంది. ఇది ఒక జీవిత విలువ. కళకు ఒక ప్రత్యేకత ఉంటుందని, ఒక సమగ్రత ఉంటుందని అంటాడు. లూకాచ్ దృష్టిలో శ్రేష్ఠమైన కళ మానవ జీవిత సంపూర్ణత్వాన్ని సమగ్రం గా ప్రతిఫలించాలి. అంతేకాదు కళాకారునికి ఓ ప్రపంచ దృక్పథం(జర్మన్ భాషలో వెల్టన్ షావుంగ్) ఉండాలంటాడు. 'వెల్టన్‌షావూంగ్' అంటే సంవేదనతో కూడిన ప్రపంచ దృక్పథం.

"యూరప్‌లో వాస్తవికతావాదం ఒక అధ్యయనం" అనే తన గ్రంథంలో లూకాచ్ రష్యన్ రచయితలను గురించి రాస్తూ కొన్ని విషయాలు ప్రస్తావిస్తాడు. బెలిన్స్కి, పూష్కిన్‌ను ప్రశంసిం చాడనీ, చెర్నిషేవ్‌స్కి దొబ్రల్యు బొవ్ విప్లవ ప్రజాస్వామిక వాదులనీ, (మన గురజాడలాగ వ్యాస రచయిత), చెర్ని షేవ్‌స్కి తొల్‌స్తోయ్ రచనలపైనా, అతని వాస్తవికతావాదం పైనా రాశా డనీ వివరిస్తాడు. ఈ ఉద్గ్రంథంలోనే తొల్‌స్తోయ్‌ను గురించి గోర్కీతో లెనిన్ అన్న మాటల్ని లూకాచ్ ఉన్నదున్నట్లు ఉటంకిస్తాడు. లెనిన్ ఉద్వేగంతో ఇలా అన్నాడట "ఓహో ఎంత విరాట్ రూపం! మహత్తర మూర్తిమత్వం! మన ఆదర్శ కళాకారుడు! అంతకంటే చెప్పుకోదగ్గ అతని రైతు కంఠం! రైతు ఆలోచనా విధానం! స్వభావ రీత్యా ఆయన ఒక రైతే! తొల్స్ తోయ్ రాక ముందు మన సాహిత్యంలో ఒక్క రైతు రచయిత లేడు" గోర్కి కళ్లలోకి చూస్తూ నిక్కచ్చిగా లెనిన్ అంటాడు "యూరప్‌లో అతనికి సాటి వచ్చేదెవరు? ఎవరూ లేరు మరి!" అదే గ్రంథంలో బాల్జాక్‌ను గురించిన ఓ వ్యాసం ఉంది. బాల్జాక్ నవల "రైతులు"లో వాస్తవికతా వాద పాత్ర చిత్రణ ఉంది. జమీందార్లకు వ్యతిరేకంగా రైతులు, వ్యాపారస్తులు చేసిన పోరాటాలు ఈ నవలలో వర్ణించారు. జమీందార్లను ఎదిరించిన రైతులు చిన్న చిన్న కమతాలను ఏర్పాటు చేసుకుంటారు. కాని పెట్టుబడివాదులు పంజా విసిరి రైతుల్ని కొల్లగొడతారు. బాల్జాక్ స్వయంగా అభ్యుదయవాది కాకపోయినా ఆయన రచనల్లో వాస్తవికతావాదం చోటుచేసుకుంది. "యూరపులో వాస్తవికతా వాదం ఒక అధ్యయనం" అనే ఈ గ్రంథంలో గమనించాల్సిన మరో అంశం ఉంది. అదేమిటంటే మార్క్స్ వాదాన్ని ఆధునికతా వాదులు ఇదంతా కాలం చెల్లిన భావ జాలం. ఇది అభిలష ణీయం కాని 19వ శతాబ్ది వారసత్వం" అని కొట్టి పారేస్తారు. ఉద్దేశ పూర్వకంగానో, ఉద్దేశరహితం గానో, సచేతనంగానో

అచేతనంగానో వీరు ఫాసిస్టు భావ జాలాన్ని అంటే సంస్కృతినీ మానవతా వాదాన్నీ తిరస్కరించే ఫాసిస్టు భావజాలాన్ని సమర్థిస్తారు అని లూకాచ్ స్పష్టం చేస్తాడు. లూకాచ్‌ను గురించిన ఒక అపోహ ఉంది. అతడు కవిత్వాన్ని తక్కువ చేసి చూసేవాడని. ఇది తప్పు అని ప్రొఫెసర్ నామ్‌వర్‌సింగ్ స్పష్టం చేస్తాడు. కవిత్వాన్ని గురించి లూకాచ్ ఎలా భావిస్తాడో అతని మాటల్లోనే "పొయెట్రీ ఈజ్ ది మదర్ టంగ్ ఆఫ్ మ్యాన్ కైండ్" కవిత్వం "మానవ జాతి మాతృభాష." లూకాచ్ వస్తువుకూ రూపానికీ సమాన ప్రాధాన్యం ఇస్తాడు. కాని అతడు రూపవాది కాదు, రూపాన్ని సామాజిక అంశంగా పరిగణిస్తాడు. నిజంగానే రూపం సామాజిక సారాన్ని ప్రతిబింబిస్తుంది. పద్యాలు రాచరిక యుగానికి సామంతవాదానికి చెందినవే. ఆధునిక యుగానికి చెందిన రూపంకాదు అది.

'నవలా సిద్ధాంతం' (1915) అనే తన గ్రంథంలో లూకాచ్ మహాకావ్యం స్థానంలో ఆధునిక యుగంలో నవల వచ్చింది అని అంటాడు. మహా కావ్యం జీవిత సంపూర్ణత్వానికి రూపం ఇస్తుంది. నవల దాగివున్న జీవిత సంపూర్ణత్వాన్ని వెలువరిస్తుంది. నవలలో వాస్తవికత ఆవిష్కరిస్తారు. నవలా రచనలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. స్వాభావికంగా నవల గేయాత్మకతనూ, నాటకీయతనూ సంతరించుకునే ప్రమాదం ఉంది. వాస్తవికతను కుదింపచేసి వర్ణనలకు ప్రాధాన్యం ఇస్తే ఆ నవల కాలక్షేప నవలగా మిగిలిపోతుంది. నవలను ఆయన 'అర్ధకళ' గా భావిస్తారు. అర్ధ కళ అయినా నవల కొన్ని కఠినమైన కళా నియమాల్ని పాటించవలసి ఉంటుందని అంటాడు. నవలలో నైతికాంశం ప్రతి ఘట్టంలోను దృశ్యమానమవుతూ ఉంటుంది. ప్రతి ఘట్టానికీ రచయిత స్వీయాత్మక ప్రతిచర్యను వ్యక్తీకరిస్తూ పోతే అది పాఠకుల్ని అలరించగలదేమో కాని, ఆ రచన గంభీర పాఠకున్ని ఆకట్టుకోలేదు. నగిషీలు రచనకు పనికిరావు. నవలా రచయిత రచన పట్ల నిర్మమంగా ఉండాలి. అపుడే మనిషి యొక్క పరాయీకరణ వ్యక్తం కాగలదు. గియోర్గి లూకాచ్ రాసిన 'సౌందర్య శాస్త్రం' ఉద్గ్రంథం ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చింది. మొదట 1911-12 శీతాకాలంలో ఫ్లోరెన్స్ పట్టణంలో ఓ స్వతంత్ర సమగ్ర సౌందర్య శాస్త్రం రాయాలని అనుకొన్నాడట. ఐడెల్‌బర్గ్ 1912-14 మధ్య దీనిపై కొంత కృషి చేశాడు. కాని ఆ ప్రయత్నం ఫలించలేదు. 1930లో ఓ ప్రణాళికా బద్ధమైన సౌందర్య శాస్త్రం రాయాలనేది ఒక యోచనగా మాత్రమే మిగిలింది. రెండు దశాబ్దాల తర్వాత, అంటే 50 వ దశాబ్దంలో ఆ కల నెరవేరింది. హంగేరియన్ భాషలో రాసిన ఈ గ్రంథం మన భాషల్లోకి ఇంకా అనువాదం కాలేదు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన గియోర్గి లూకాచ్‌కు మన దేశంలో రావాల్సినంత గుర్తింపు రాలేదేమో. ❑

# ఒక దేశం - ఒకే పువ్వు

**- డాక్టర్ దేవరాజు మహారాజు**


ఎవరో ఒక కొత్త చట్టం తీసుకొచ్చారు
వీచే ముందు గాలులు అనుమతి తీసుకోవాలని
వీచే ముందు గాలులు తమ దిశ దశ ఏమిటో ఏటో
వివరాలు తెలియజేయాలని ఎవరో కొత్త చట్టం తెచ్చారు
గాలులు ఎంత దూరం పోవాలనుకున్నాయో
అవి ఎంత వేగంగా వీచాలనుకున్నాయో
వివరాలు సమర్పించనిదే అనుమతి దొరకదని
ఎవరో కొత్త చట్టం తెచ్చారు
ఇప్పుడిక్కడ సుడి గాలులకు అనుమతి లేదు
మేం కడుతున్న పేక మేడల్ని సంరక్షించాల్సిన బాధ్యత మాపై ఉంది
అందువల్ల ఈ చట్టాలు సత్వరమే అమల్లోకొస్తున్నాయి
తమ చుట్టాలకు అనుగుణంగా
ఎవరో ఇక్కడ కొత్త చట్టాలు తెచ్చారు
ఒడ్డును తాకే కెరటాలకూ ఒక హెచ్చరిక
ఎగిసెగిసి పడడం మళ్లీ తిరిగి వెళ్లడం
బలం పుంజుకుని మళ్లీ నీటి పిడికిళ్లతో తిరిగి రావడం
ఇవన్నీ ఇప్పుడిక కుదరదు
తిరుగుబాట్లు, ఉద్యమాలు, హోరెత్తి పోవడాలు నిషిద్ధం
ఎంతటి ఉధృతి ఉన్నా బుద్ధిగా ఒడ్డులోపల మాత్రమే
నిశ్శబ్దంగా ప్రవహించాల్సి ఉంటుంది.
తోటలోని మొక్కలన్నీ ఒకే విధంగా పూయాలని
పూచే పూల రంగు కూడా ఒకటిగానే ఉండాలని
కొత్త చట్టం అమల్లోకి వచ్చింది
ఒకేరంగు మాత్రమే కాదు
ఏ పువ్వు ఎంత గాఢంగా ఉండాలో కూడా
వారు నియమించిన వారి అధికారులే నిర్ణయిస్తారట !
ఒకే దేశం – ఒకే పువ్వు
ఈ చట్టాలు చేసిన గౌరవనీయులకు ఎవడు చెప్పాలి ?
తోటలో అన్ని మొక్కల పూలు ఒకే రకంగా ఉండవని
పూలన్నీ ఒకే రంగులో అసలే ఉండవని ఉండడానికి వీలే లేదని
ఒకే రంగులో అనేక రంగులుంటాయని కూడా వారికి ఎవడు చెప్పాలి ?
గాలులు, కెరటాలు ఎవరి చట్టాలకూ లొంగవనీ
గాలి ఎవరి పిడికిలిలోనో ఖైదీగా ఉండదని
కెరటం ఎవరి జీవోలతోనే వెనక్కి మళ్లదని
ఎంతటి వారైనా సరే, వాటిని గమనిస్తూ
వాటికి అనుగుణంగా బతకాల్సిందే తప్ప మరో మార్గం లేదని !
లేకపోతే, అవి సృష్టించే సునామీలో అడ్రసు లేకుండా గల్లంతు కావాల్సిందేనని
నామరూపాలు లేకుండా నశించాల్సిందేనని వారికి ఎవరైనా చెప్పండి !
కనసీ గౌరవమైనా.. కాపాడుకొమ్మని !! ❑

**(దేశవ్యాప్తంగా జరిగిన రైతు ఉద్యమ నేపథ్యం)**

# కేపిటల్‌లో కార్ల్ మార్క్స్ ఏం చెప్పాడు ?

రచన : ఇ.ఎస్. బ్రహ్మచారి

కారల్ మార్క్స్ జన్మించి 200 సంవత్సరాలపైగా అయింది. 2018లో ప్రపంచవ్యాప్తంగా ఆయన ద్విశత జయంతి సభలు జరిగాయి. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలను వర్తమాన ప్రపంచానికి అన్వయిస్తూ అనేకానేక సదస్సులు జరిగాయి. మార్క్సిస్టు భావజాలాన్ని విమర్శనాత్మకంగా పరిశీలిస్తూ, నేటి ప్రపంచ సమాజాలకి దాని అవసరాన్ని తెలియజేస్తూ వివిధ భాషలలో పుస్తకాలు, వ్యాసాలు వచ్చాయి. మార్క్స్ రాసిన గ్రంథాలలో సుప్రసిద్ధమైనది. 'కాపిటల్'. 1867లో దాన్ని ఆయన ప్రచురించారు. అందులో ఆయన రెండు ప్రధానమైన సైద్ధాంతిక ప్రతిపాదనలు చేశారు. అవి శ్రమశక్తి సరుకుగా మారడం, రెండు అదనపు విలువ సృష్టి కావడం. తన సమకాలీన సమాజాన్నేకాక అంతకంటే కొన్ని వందల సంవత్సరాల క్రితం ఆయా సమాజాలలో ఆర్థిక, సామాజిక రంగాలలో వచ్చిన మార్పులను చారిత్రకంగా శాస్త్రీయ దృష్టితో పరిశీలించిన ఫలితంగానే ఆయన రూపొందించిన అదనపు విలువ సిద్ధాంతానికి ఇప్పటికీ విశ్వసనీయత లభించింది. మార్క్స్ చనిపోయి కూడా ఇప్పటికి దాదాపు 137 సంవత్సరాలు అయింది. రెండు శతాబ్దాల క్రితం పుట్టి పెరిగిన ఒక




### సి.ఎస్.ఆర్.ప్రసాద్.. ముందుమాట

**ప్రపంచ సామ్రాజ్యవాద మొనగాడుగా బోరవిరుచుకున్న అమెరికా ఊహించని రీతిలో ఆర్థిక సంక్షోభంలోకి కూరుకు పోయింది. తన ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింప చేయడానికి ఏం చేయాలో తెలియక సతమతమౌతున్న కాలంలో మేధావులు తిరిగి 'కాపిటల్' గ్రంథాన్ని అధ్యయనం చేయడం ప్రారంభించారు. ప్రపంచీకరణను ప్రారంభించిన దేశం తిరిగి రక్షిత ఆర్థిక విధానాన్ని అనుసరించక తప్పని స్థితిలోకి జారిపోయింది. పెట్టుబడి కేంద్రక ఆర్థిక వ్యవస్థ ఉన్నంతకాలం అదనపు విలువ సృష్టి, దోపిడీ రూపం మారి సారంలో కొనసాగుతాయి.**

## పుస్తక పరిచయం

ఆలోచనాపరుడు రూపొందించిన సిద్ధాంతానికి ఇప్పటికీ కాలం తీరకపోవడం చాలామందికి అర్థంకాని అంశం. కమ్యూనిస్టులు మార్క్సును, ఆయన సిద్ధాంతాలని నెత్తిన పెట్టుకొని మోస్తున్నారని, వాళ్ళకు వర్తమానంతో సంబంధం లేదని, మార్క్స్ జీవించిన కాలంనాటి పరిస్థితులకి, ఇప్పటికీ మధ్య ఏ మాత్రం పోలికలేదని, ఆ కారణంగా మార్క్సిజానికి కాలం చెల్లిందని వాదించే మేధావులు చాలామంది వున్నారు. వర్తమాన కాలంలో దేశాల ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి రంగానికి ప్రాధాన్యత తగ్గి, సేవారంగం ప్రాధాన్యత పెరిగిన క్రమంలో మార్క్స్ ప్రతిపాదించిన అదనపు విలువ సిద్ధాంతానికి కాలం చెల్లిందని విమర్శించే వాళ్ళూ ఉన్నారు. ఇది ఒక పార్శ్వం మాత్రమే. మరోపక్క సామ్రాజ్యవాద ప్రపంచీకరణలోని డొల్లతనం బయటపడుతోన్న కొద్దీ పెట్టుబడిదారీ దేశాలలో సైతం అర్థశాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు పరిష్కారాల కోసం తిరిగి మార్క్స్ 'కాపిటల్' గ్రంథాన్ని పరిశీలించక తప్పని పరిస్థితి ఏర్పడడం మరో పార్శ్వం. మార్క్స్ 'కాపిటల్' గ్రంథాన్ని కేవలం పుస్తకాల పఠనం ద్వారా వచ్చిన జ్ఞానం నుండి రాయలేదు. గతంతో సంబంధం లేకుండా కేవలం వర్తమానాన్ని మాత్రమే అర్థం చేసుకొని రాయలేదు. ఆయనది వివరణాత్మక పద్ధతి కాదు. విశ్లేషణాత్మక పద్ధతి. ఈ విశ్లేషణ కూడా చారిత్రక

చలనంతో ముడిపడిన విశ్లేషణ. సమాజంలో వివిధ తలాలలో జరిగే మార్పుల మధ్య వుండే అంతస్సంబంధాన్ని అర్థం చేసుకున్న విశ్లేషణ. ఆయనది సమ్యక్ దృష్టి. సమాజాన్ని దాని ఉపరితల పరిశీలన ద్వారా అర్థం చేసుకోలేదు. సమాజ గతిచలనానికి కారణమైన పునాదిని, దానికీ ఉపరితలానికి మధ్య వుండే గతితార్కిక సంబంధాన్ని ఆయన అవగాహన చేసుకోగలిగారు. ఇలాంటి అత్యంత శాస్త్రీయమైన పద్ధతి కారణంగానే మార్క్స్ 'కాపిటల్'కి, ఇతర రచనలకి ఇంతటి శక్తి వచ్చింది. మార్క్స్ రచనా పద్ధతి ఎంత శాస్త్రీయమైనా, దాన్ని ఒక ఆచరణాత్మక శాస్త్రంగా అర్థం చేసుకోలేనివాళ్ళకి దాని శక్తి అర్థం కాదు. ఆయన తన రచనలన్నింటిలో ప్రతిపాదించిన అంశాలని వర్తమానంలో మన శాస్త్రీయ పరిశీలనా ఫలితాలకు అన్వయించుకొని అర్థం చేసుకుంటేనే దాని విలక్షణత, కాలానికి నిలబడే తత్వం అర్థమవుతాయి. అలా అర్థం చేసుకోలేనివాళ్ళే మార్క్స్ రచనలకు కాలం చెల్లిందని, ఆయన ప్రతిపాదనలలో ఖాళీలు వున్నాయని, వాటిని మనదైన అధ్యయనంతో పూరించాలని, ఆనాటి సమాజంలోని నిర్దిష్ట పరిస్థితుల పరిశీలనల నుండి ఆయన చేసిన నిర్ణయాలు, వర్తమానంలో, విలక్షణమైన పరిస్థితులున్న సమాజాలకు అన్వయించడం వైఫల్యానికి దారితీస్తుందని సూత్రీకరణలు చేస్తున్నవాళ్లు ఎవరూ 'కాపిటల్' తో సహా మార్క్స్ రచనలు వేటినీ అన్వయదృష్టితో అర్థం చేసుకున్నవాళ్ళు కారు. మార్క్స్ 'కాపిటల్' గ్రంథంలో అదనపు విలువకు సంబంధించి చేసిన మౌలికమైన ప్రతిపాదనలన్నీ నేటికీ వాస్తవాలే. మనం చేయాల్సిందల్లా ఆయన అనుసరించిన విమర్శనాత్మక దృక్పథాన్ని ఆయన గ్రంథాలను పరిశీలించడానికి కూడా అనుసరించడమే. అలా చేస్తే తప్ప మార్క్స్ కాలానికి, ఇప్పటి కాలానికి వచ్చినట్లు కనపడుతోన్న మార్పులు పునాదిలో, గుణాత్మకంగా జరిగిన మార్పులా లేక పైపైన ఉపరితలానికి మాత్రమే పరిమితమైన మార్పులా అనేది అర్థం కాదు. అందుకే మార్క్స్ రచనలన్నింటినీ పదేపదే చదవాలనటం. చదవడం అంటే కంఠతా పట్టటమని కాదు. ఆయన ప్రతిపాదించిన ప్రతి సూత్రీకరణను, ప్రతి విలువను వర్తమాన సమాజానికి గతితార్కిక, చారిత్రక దృక్పథంతో అన్వయించడం. ఇలా అర్థం చేసుకున్నవాళ్ళకు మార్క్సిజం ఒక అన్వయ శాస్త్రమే కాక, ఆచరణాత్మక శాస్త్రంగా కూడా మారుతుంది. మార్క్స్ 1867లో ప్రారంభించిన 'కాపిటల్' ఒక ఉద్గ్రంథం. అది ప్రపంచంలో అనేక భాషలలోకి అనువాదం అయింది. అందులో ఆయన పరిశీలనకు ఎంచుకున్న అంశాల దృష్ట్యా అది క్లిష్టమైన గ్రంథం కూడా. అయినా కేవలం మేధావులకు, ఆలోచనాపరులకు మాత్రమే కాక సాధారణ ప్రజలకు కూడా అర్థం కావడానికి వీలుగా ఆయన ఆ గ్రంథ రచన చేశారు. అప్పటి నుండి ఇప్పటి వరకు 'కాపిటల్' అనేక పునర్ముద్రణలు పొందింది. దానికి చాలామంది వ్యాఖ్యానాలు రాశారు. అనేక విశ్వవిద్యాలయాల్లో 'కాపిటల్' మీద పరిశోధనలు కూడా జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అనుకున్న ఫలితాలను సాధించడానికి బదులు పెట్టుబడిదారీ వ్యవస్థల్లో తీవ్ర సంక్షోభాలను సృష్టించింది.

ప్రపంచ సామ్రాజ్యవాద మొనగాడుగా బోరవిరుచుకున్న అమెరికా ఊహించని రీతిలో ఆర్థిక సంక్షోభంలోకి కూరుకు పోయింది. తన ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింప చేయడానికి ఏం చేయాలో తెలియక సతమతమౌతున్న కాలంలో మేధావులు తిరిగి 'కాపిటల్' గ్రంథాన్ని అధ్యయనం చేయడం ప్రారంభించారు. ప్రపంచీకరణను ప్రారంభించిన దేశం తిరిగి రక్షిత ఆర్థిక విధానాన్ని అనుసరించక తప్పని స్థితిలోకి జారిపోయింది. పెట్టుబడి కేంద్రక ఆర్థిక వ్యవస్థ ఉన్నంతకాలం అదనపు విలువ సృష్టి, దోపిడీ రూపం మారి సారంలో కొనసాగుతాయి. వ్యక్తిగత పెట్టుబడి పూర్తిగా సామాజిక నియంత్రణలోకి వచ్చేవరకూ మార్క్స్ మౌలిక సూత్రీకరణల ప్రాసంగికత ఉంటుంది. మనదేశంలోనూ ప్రపంచవ్యాప్తంగానూ అదనపు విలువ దోపిడీ గురించి, శ్రమశక్తి గురించి, వర్గపోరాటాల ఆవశ్యకత గురించి, వర్గరహిత సమాజ స్థాపన గురించి అంచనాలు, పునరంచనాలు జరుగుతున్న ఈ కాలంలో, తెలుగు పాఠకులు మార్క్స్ తన పెట్టుబడి గ్రంథంలో వివరించిన అంశాలను, ప్రతిపాదనలను అర్థం చేసుకోవడానికి వీలుగా మిత్రులు బ్రహ్మచారి రచించిన ఈ పుస్తకాన్ని తెలుగు పాఠకులకు అందిస్తున్నాం. ఆయన ఈ పుస్తకంలో 'కాపిటల్' మొదటి సంపుటంలోని ఎనిమిది భాగాలను వివరించారు. ఇందులో సరుకు, డబ్బు పెట్టుబడిగా మారటం, అదనపు విలువ ఉత్పత్తి, వేతనాలు, పెట్టుబడి పుట్టుక, పెట్టుబడి సంచయం అనే అంశాలను వివరించారు. బ్రహ్మచారిగారి పరిచయం సోదాహరణంగానూ, చాలా సరళంగానూ ఉంది. దీన్ని చదవటం ద్వారా తెలుగు పాఠకులకు మార్క్సిస్టు మౌలిక ఆర్థిక సూత్రాలపట్ల సరైన అవగాహన కలుగుతుందని, తద్వారా ఈ శతాబ్దపు ప్రత్యేకతలను అవగాహన చేసుకోగలుగుతారని, పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రవేత్తలు సృష్టిస్తున్న గందరగోళం నుండి బయటపడి మారుతోన్న ప్రపంచాన్ని చారిత్రక భౌతికవాద దృష్టితో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారని మేం ఆశిస్తున్నాం. ఈ పుస్తకంకోసం, రచయిత చేసిన కృషి మాకు తెలుసు. దాదాపు మూడు, నాలుగు సంవత్సరాలుగా బ్రహ్మచారి ఈ పనిలో తలమునకలై ఉన్నారు. ఇంతటి కృషిచేసి ఒక విలువైన పుస్తకాన్ని అందించిన ఆయనకు విరసం విప్లవాభినందనలు తెలియజేస్తూ ఉంది. ❑

# ఎలియనేషన్


రచన : రావు కృష్ణారావు

పరామర్శ : వి.విజయకుమార్

**మనిషికి మనిషే దేవుడనీ, గొప్ప మానవ శక్తుల్ని దేవుడికి ఆపాదించుకోవడమే పరాయీకరణ అంటాడు. దేవుడి స్వభావమూ, గుణమూ మానవ స్వభావం, గుణమే అంటాడు. దేవుడి జన్మస్థలం మానవ దైన్యమే అంటాడు. ఆ రకంగా తాను పరాయిగా మారి తన సామర్థ్యాలను లేని దేవుడికి ఒప్పజెప్పి ఆయన్ని భజిస్తూ, తోటి వారిని ప్రేమించలేని అశక్తతలో పడిపోవడానికి కారణం మతమే అని చెప్పినా సామాజిక, రాజకీయ అంశాలను వదిలేయడంతో ఫ్యూయర్ బాక్ మార్క్స్‌ని సంతృప్తి పరచలేక పోయాడు.**

మనం.. మనం కాకుండా పోవడమే పరాయీకరణ. తన నుండి తాను వేరుపడటం, తనకు తానే పరాయివాడు కావడం, జీవితానికి అర్థం లేకపోవడం, తనకంటూ ఏమీ లేకపోవడం, సెల్ఫ్ ఫుల్ ఫిల్ మెంట్‌కి నోచుకోని, తనకి ఇష్టం లేని, తన అభిరుచికి భిన్నమైన జీవితాన్ని, ఉస్సూరంటూ బలవంతంగా ఈడ్చుకుంటూ వెళ్లడం, తను తానుగా మారే, ప్రవర్తించే, వాస్తవీ కరించుకునే అవకాశాలు లేకపోవడమే పరాయీకరణ. మనిషి జీవితం నుండి, సమాజం నుండి పరాయిగా వుంటూ అసహ జంగా బతకడాన్ని నేర్పి, ఆ అబద్ధపు పునాది మీద ఆకాశపు హర్మ్యాలు కట్టుకొని పెట్టుబడిదారీ వ్యవస్థ నిలబడింది. ఏ వ్యవస్థని కూలదోయడం కోసం అహర్నిశలు కృషి చేయాలో వారి కళ్లకే గంతలు కట్టి విజయవంతంగా మనగలుతోంది.

ఈ నేపథ్యంలో పరాయీకరణ గురించి మార్క్స్ 1844లోనే తన పారిస్ రాతప్రతుల్లో పేర్కొన్న ప్రతిపాదనల్ని రావు కృష్ణా రావుగారు అత్యంత సరళీకరించి తెలుగు పాఠకులకు అందించే




# పుస్తక పరిచయం

ప్రయత్నం చేశారీ పుస్తకంలో. ప్రతి గీతా ఒక వాస్తవికతను అద్దుకుంది. ప్రతి భావనా ఒక మధురత్వాన్ని ఆస్వాదించేలా చేస్తుంది. ఎన్నో తెలియని విషయాలు అప్రతిభుల్ని చేస్తూ పోతాయ్! సైద్ధాంతిక విషయాలు ఇంత రసానుభూతిని కలిగిస్తా యా? నిజమిది! మనిషి స్వభావాన్ని ఇంత లోతుల్లోకి విశ్లేషిం చిన మార్క్స్ భావనలు మీరు చదివేటప్పుడు మీ హృదయం రాగరంజితం అవుతుంది! ఎంత బావుందీ పుస్తకం అనిపిస్తుం ది. ఈ పరాయీకరణలోని మార్క్స్, విచిత్రంగా మీ హృదయా నికి మరింత చేరువవుతాడు! అలా చేశారు కృష్ణారావు గారు!

చరిత్రలోకి తొంగి చూస్తే..

ఆదిమ క్రైస్తవం దేవుని ఆజ్ఞ ఉల్లంఘనలో పరాయీకరణని చూస్తే, ఉపనిషత్తులు 'నేను' నుంచి బయటకు వెళ్లడాన్ని గురిం చి చెప్పి, "సన్యాసం" ద్వారా పరాయీకరణని పకడ్బందీగా వాక్రుచ్చాయి. సూఫీ, క్రైస్తవ, ఇస్లాం తాత్వికతలన్నీ ఇంచు మించు వద్దన్న ఫలం తిని దేవుడికి పరాయి అయిపోయిన మనిషి గురించి మథనపడ్డాయి. బౌద్ధం కొంచెం భిన్నంగా అనుభూతుల నుండి 'అనాసక్తత' అని చెప్పింది. 'అస్తిత్వ వాదం'

**స్వార్థం, దురాశ, కామం, అధికార లాలస, గుర్తింపు వాంఛ వెరసి మానవుడు! దీన్ని నిరాపేక్షంగా అంగీకరించి, జై కొట్టకుండా ఉండడానికి ఈ భూ ప్రపంచంలో ఒక్కడు కూడా వెనుకాడడు! కానీ మార్క్స్ ఉన్నాడు ! ఈ ప్రపంచ భావజాలాన్ని ప్రశ్నించడం నేర్పిన మార్క్స్ ఇలా అంటాడు. మానవుడు ఒక నిర్దిష్ట సామాజిక, చారిత్రక అస్తిత్వం. అంటే సర్వకాల సర్వావ స్థల్లో స్థిరంగా ఉండడు మానవుడు. పరిస్థితులను బట్టి మారే గుణం మానవ స్వభావంలో భాగంగా వుంటుంది అంటాడు.**

---

ఏకంగా పరాయి స్థితి నుంచి మనిషి అసలు బయటపడే అవకాశమే లేదంది. హెగెల్, చైతన్యం ప్రాథమికమనీ, ప్రకృతి ద్వితీయం అనడంలో ఉద్దేశం అది చైతన్యం నుంచి పరాయిగానే వుంటుంది అని చెప్పడమే! 'మనిషి తనను తాను ఒక ప్రక్రియ గా ఉత్పత్తి చేసుకుంటాడన్న' హెగెల్ భావనని సమర్థించిన మార్క్స్, సరకుల్ని సృష్టించే నిజమైన మనిషి యొక్క పరాయీకరణ చూడనందుకు హెగెల్‌ను విమర్శించాడు. ఫ్యూయర్ బాక్ పరాయీకరణకు కారణం మతం అంటాడు. మనిషికి మనిషే దేవుడనీ, గొప్ప మానవ శక్తుల్ని దేవుడికి ఆపాదించుకోవడమే పరాయీకరణ అంటాడు. దేవుడి స్వభావమూ, గుణమూ మానవ స్వభావం, గుణమే అంటాడు. దేవుడి జన్మస్థలం మానవ దైన్యమే అంటాడు. ఆ రకంగా తాను పరాయిగా మారి తన సామర్థ్యాలను లేని దేవుడికి ఒప్పజెప్పి ఆయన్ని భజిస్తూ, తోటి వారిని ప్రేమించలేని అశక్తతలో పడిపోవడానికి కారణం మతమే అని చెప్పినా సామాజిక, రాజకీయ అంశాలను వదిలేయడంతో ఫ్యూయర్ బాక్ మార్క్స్‌ని సంతృప్తి పరచలేక పోయాడు.

స్వార్థం, దురాశ, కామం, అధికార లాలస, గుర్తింపు వాంఛ వెరసి మానవుడు! దీన్ని నిరాపేక్షంగా అంగీకరించి, జై కొట్టకుండా ఉండడానికి ఈ భూ ప్రపంచంలో ఒక్కడు కూడా వెనుకాడడు! కానీ మార్క్స్ ఉన్నాడు ! ఈ ప్రపంచ భావజాలాన్ని ప్రశ్నించడం నేర్పిన మార్క్స్ ఇలా అంటాడు. మానవుడు ఒక నిర్దిష్ట సామాజిక, చారిత్రక అస్తిత్వం. అంటే సర్వకాల సర్వావ స్థల్లో స్థిరంగా ఉండడు మానవుడు. పరిస్థితులను బట్టి మారే గుణం మానవ స్వభావంలో భాగంగా వుంటుంది అంటాడు. ప్రకృతిలో భాగమే అయినా, ఒక పదార్థమే అయినా చైతన్యం మానవుడి ప్రత్యేకత. చైతన్య యుత జీవన కార్యకలా పాలే మానవుణ్ణి వేరు చేస్తాయి. మనిషి లక్ష్యాత్మకంగా, జీవితావసరాల కోసం, భౌతిక నియమాలకు లోబడి పనిచేసేటప్పుడు జంతువు నుంచి వేరౌతాడు. బుద్ధి, చైతన్యం, ఇచ్ఛ, భావోద్వేగాలు అతన్ని గుణాత్మకంగా వుంచుతాయి. మనిషి మరో మనిషి అవసరాన్ని తీర్చే వస్తువును ఉత్పత్తి చేయడం మనిషికే సొంతం అంటాడు మార్క్స్. చైతన్యం సమిష్టి శ్రమ ఫలితం అనీ, సామాజిక ఉత్పాదితంగా మానవుడు వున్నంతకాలం వుంటుందనీ, మనిషి ప్రకృతి అస్తిత్వంతో పాటూ జాతి అస్తిత్వం కలిగివుండటం వల్లే జంతువు నుంచి వేరయ్యాడని అంటాడు మార్క్స్. మానవుడికి మూలం మానవుడే అనడం వెనుక అంతరార్థం, తన శ్రమ ద్వారానే తానుగా అవతరించాడని చెప్పడమే! భౌతిక పరిస్థితులకు లోబడి పని చేస్తూ, శ్రమ ద్వారా వాటిని మార్చగలడు. ప్రకృతి ప్రాణిగా వున్నా, ప్రకృతిని మార్చుకోగలుగుతాడు. కాబట్టి మానవుడు ప్రకృతి నుంచి పరాయికావడం అసంభవం. కానీ, తను చేసే శ్రమ సంబంధాల ద్వారానే పరాయీకరణ జరుగుతోంది అంటాడు మార్క్స్. అంటే శ్రమ ద్వారా వస్తువు తయారు చేసినవాడు స్వేచ్ఛగా, ఇచ్ఛాపూర్వకంగా చేసినప్పుడు పొందే అనుభూతి పొందలేకపోవడానికి కారణం పరాయీకరణే. స్వేచ్ఛగా, కలిసి మెలిసి ఉత్పత్తి చర్యల్లో పాల్గొనే మనిషి, స్వభావరీత్యా, సామాజిక అస్తిత్వంగా మాత్రమే వుండగలడు అంటాడు మార్క్స్. మార్క్స్ దృష్టిలో మనిషి వ్యక్తిగత కార్యకలాపాలకూ, శ్రమకూ పరాయివాడు కావడం అంటే తను శ్రమించి చేసిన వస్తువు అన్యాక్రాంతం కావడమేననీ, తన సొంత కార్యకలాపం నుండీ, తన ఉత్పత్తి నుండీ, జాతి స్వభావం నుండీ, ఇతర మనుషుల నుండీ వేరుపడటమేననీ అదే పరాయీకరణ అంటాడు. మరీ ముఖ్యంగా ఆర్థిక పరాయీకరణ గురించి చెబుతూ, మొదటి దశలో ప్రజల్ని ఉత్పత్తి సాధనాల నుండీ, జీవనోపాధి సాధనాల నుండీ వేరు చేయడం, ఆ తర్వాత దశలో, శ్రమను అమ్ముకునే వారిగా తయారు చేయడం, చివరికి వస్తువు కొనుక్కున్న వాడికి స్వంతం కావడమే ఆర్థిక పరాయీకరణగా చెబుతాడు.

రోటీ, కపడా ఔర్ మకాన్ లాంటి బేసిక్ అవసరాల గురించి శాస్త్రీయంగా ముందు ఆలోచించినవాడు మార్క్స్! శ్రమ చేసి వీటిని పొందడం ద్వారా, ప్రకృతి నుంచి వేరు కాగలుగుతాం. ముందు తక్షణ అవసరాలతో మొదలై కొత్త అవసరాల ఉత్పత్తి దిశగా సాగుతాం. మొదట్లో తన కోసమే శ్రమ చేసినవాడు క్రమంగా తన ఇచ్ఛకు వ్యతిరేకంగా స్వేచ్ఛాయుత జీవకార్య కలాపంగా కాకుండా మోడరన్ టైమ్స్ సినిమాలో స్పానర్ తిప్పే చాప్లిన్‌ని తలపిస్తాడు పరాయీకరణ చెందిన మనిషి! శ్రమ అప్పుడు జీవిత వ్యక్తీకరణ కాదు జీవిత పరాయీకరణ! ఆకలైతే మునపటిలా నేలవైపూ, నీరు వైపు చూళ్ళేడు! అవి ప్రైవేటు ఆస్తి! లేదా ప్రభుత్వ ఆస్తి! యింక తను అవతలి వాడి ఇచ్ఛానుసారం పనిచేసేవాడు! ఎంత చేయాలో వాడే చెప్పాలి, అసలు చేయాలా వద్దా వాడే నిర్ణయించాలి. అదే పరాయీకరణ. పనిచేయ

**ప్రజల మనోభావాలను గౌరవించే నెపం మీద మతం తో రాజీపడటం అంటే యుద్ధానికి ముందే ఓటమిని అంగీ కరించడం అని తెలుసుకోవాలి! మానవ అశక్తత పరాయీకరణల వ్యక్తీకరణ అయిన మతం మనిషికి మనిషే పునాదిగా నిజమైన మనిషి జన్మించినప్పుడే సహజ మరణం పొందుతుందంటాడు మార్క్స్. మనిషి దేవుడినీ, మతాన్నీ, డబ్బునీ తానే సృష్టించి వాటికి తనకు తానే బానిసగా మార్చుకున్నట్టే తను సృష్టించిన సరుకులకు సాగిలపడతాడు. అవి తానే సృష్టించిన విషయం మర్చిపోయి అవి తన జీవితాన్ని శాసించే దాకా తెచ్చుకోవడమే పరాయీకరణ.**

నప్పుడు తను, పని చేసేటప్పుడు పరాయి! విసుగు, కోపం, మూర్ఖత్వం, భ్రాంతి, అజ్ఞానం, బుద్ధి మాంద్యం, తనను తాను కోల్పోయిన మనిషిలో కనబడేవి అంటాడు మార్క్స్. శ్రమ నుంచి పరాయి అయినవాడు అంతటితో ఆగడు! శ్రమ ఉత్పాదితం నుండి పరాయి ఐపోతాడు. తన చేత తయారైన వస్తువు తనకే పరాయిదై, తనకే ఎదురు తిరుగుతుంది అంటాడు మార్క్స్. ఎనిమిది గంటల సజీవ కార్యకలాపం ఇతరులకు స్వాధీనం చేసేసి ఎనిమిది గంటల జీవితాన్ని కుదించుకుంటాడు! అది ఇంకా ఎక్కువ గంటలైతే అన్ని ఎక్కువ గంటలూ మనిషి కాకుండా పోవడమే శ్రమ పరాయీకరణ! శ్రమ ఉత్పాదితం నుండి వేరు చేయపడ్డాక జాతి స్వభావాన్ని పోగొట్టుకోవడానికి కావాల్సిన అన్ని అవకాశాలూ మెండుగా కల్పిస్తుంది పెట్టుబడి దారీ విధానం. మనిషి తనకోసం, కుటుంబం కోసం, తక్షణ మరియు భవిష్యత్తు కోసం, భౌతిక, మానసిక అవసరాల కోసం జంతు జాలాలకు భిన్నంగా శ్రమచేస్తాడు. ఈ ఉత్పాదక జీవితమే అతని జాతి జీవితం. కాగా పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ జాతి జీవితం కాస్తా, వ్యక్తి తాలూ కూ భుక్తి సాధకం అయి పోయి బతుకోసమే శ్రమ చేయడంతో తన జాతి స్వభావాన్ని కోల్పోతాడు అంటాడు మార్క్స్.

జాతి స్వభావాన్ని పోగొట్టుకున్నప్పుడే మనిషి నేను నుంచి వైదొలిగినట్టే! ఒక వికృత పోటీలో సాధనమై, పరాయిశక్తి చేతి లో ఆట వస్తువుగా మారతాడు. ప్రకృతితో మనిషి ఎటువంటి సంబంధాన్ని నెరపకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ కంచె వేసింది. ప్రకృతితో పనిచేయడానికి తన అనుమతి లేకుండా మనిషికి అసాధ్యం చేసింది. అంతేకాదు వాళ్ళతో తనకు నచ్చే రీతిలో శ్రమ చేయించుకొని సొంత ఆస్తి కుప్పల్ని పేర్చుకొంది. మళ్ళీ వాటినే మారకం ద్వారా వాళ్ళకే అమ్మడం మొదలుపెట్టింది. తాను శ్రమించి సృజించిన వస్తు ప్రపంచం కేవలం తనది కాకుండా పోవడమే కాదు అదే శత్రువై తన మెడపై కత్తి కూడా అవుతుంది అంటాడు మార్క్స్. ఈ కత్తి వస్తుగతానికే కాదు సామాజిక సంబంధాలకు అపాదించబడుతుంది! వస్తువుకు దూరమైనవాడు తన తోటి వాడికి దూరం కావడమే మనిషి పరాయీకరణ. శ్రమ నుంచి పరాయి అయినవాడు ప్రకృతి నుంచీ దూరం అయ్యాడు. భూమీ, సముద్రాలూ, అడవులూ నదులూ, చెట్టూ పుట్టా, ఆఖరికి అడివిలో బతికే జంతు జాలాలు కూడా వాడివే! ఈతాకు తెచ్చి బుట్ట అల్లాలన్నా, తేనె పట్టు కొట్టాలన్నా వాడి అనుమతి కావాలి. శ్రమ పరాయీకరణ వల్లే సొంత ఆస్తి పోగయ్యేది. ఈ పరాయీకృతమైన శ్రమ, పోగుబడ్డ పెట్టుబడి, అదే మళ్ళీ, పోగుచేసి ఇచ్చిన వారి జీవశక్తిని పీల్చి మరింత పెరుగుతూ పోతుంది. వారి జీవితాలను శాసించే స్థాయికి ఎదుగుతుంది అంటాడు మార్క్స్.

శ్రమ విభజనలో పరాయీకరణ అంటే శ్రామికుడు ఏ వస్తువులోనూ తన శ్రమని గుర్తించలేనితనం. గుండీలు ఒకరు, కాలర్ ఒకరూ, పట్టీ ఒకరూ, కత్తిరించడం ఇంకొకరు, చేతులు కుట్టేది ఇంకొకరు. చొక్కా తయారైన అనుభూతిని ఎవరికీ మిగ లనీయకుండా చేయడమే శ్రమ విభజనలోని పరాయీకరణ. ఇది శ్రమ సహజ లక్షణాన్ని ధ్వంసం చేస్తుంది. బలవంతంగా రుద్దిన, తప్పించుకోలేని, పదే పదే అదే పరిమిత కార్యాన్ని చేస్తూ తన శక్తుల్ని క్షీణింప చేసుకుంటాడు. అది సమూహం నుంచి ఒంటరిని చేస్తుంది. శారీరక, మానసిక శ్రామికులుగా చీల్చి వేస్తుంది. ఆఖరికి సిద్ధాంతం, ఆచరణా వేరువేరుగా వుండటం పరాయీకరించే శ్రమ విభజన వల్లే అంటాడు మార్క్స్.

మానవాళి పరాయీకృత సామర్థ్యం డబ్బు అంటాడు మార్క్స్. ఇది మానవుణ్ణి అమానవీయం చేస్తుందంటాడు. అది అందరినీ వేరు చేస్తూ, బందీలుగా కూడా ఉంచుతుంది. సరుకు ధర పరాయీకృతమైన డబ్బులో వ్యక్తం అవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో విలువ సారాంశంగా వున్న డబ్బు దేన్నైనా కొంటుంది. పరాయిదై పోయిన విలువ రూపంలో ఉన్న డబ్బుకు మారకం అయ్యేది కూడా పరాయిదైన విలువే ! మార్క్స్ అభిప్రాయంలో మతం తొలి అతి ప్రాచీన భావజాల పరాయీకరణ రూపం. మనిషి తనలోని దైవత్వాన్ని మధ్యవర్తి దేవుడికి అపాదించుకు న్నాడు. ఆ విధేయత శాశ్వతం! పరాయివాడై బతికే మనిషి జీవితంలో ఒక అవసరాన్ని తీర్చినంత కాలం మతం ఉనికిలో వుండి, ప్రకృతితో, తోటి వారితో, సహేతుకమైన బంధాలు నెల కొల్పుకున్నప్పుడు మతం అంతర్ధానం అవుతుంది అంటాడు

మార్క్స్. ప్రజల మనోభావాలను గౌరవించే నెపం మీద మతం
తో రాజీపడటం అంటే యుద్ధానికి ముందే ఓటమిని అంగీ
కరించడం అని తెలుసుకోవాలి! మానవ అశక్తత పరాయీకర
ణల వ్యక్తీకరణ అయిన మతం మనిషికి మనిషే పునాదిగా
నిజమైన మనిషి జన్మించినప్పుడే సహజ మరణం పొందుతుం
దంటాడు మార్క్స్. మనిషి దేవుడినీ, మతాన్నీ, డబ్బునీ తానే
సృష్టించి వాటికి తనకు తానే బానిసగా మార్చుకున్నట్టే తను
సృష్టించిన సరుకులకు సాగిలపడతాడు. అవి తానే సృష్టించిన
విషయం మర్చిపోయి అవి తన జీవితాన్ని శాసించే దాకా
తెచ్చుకోవడమే పరాయీకరణ. పెట్టుబడిదారు శ్రమశక్తిని కొని,
తన వశం చేసుకున్నాక, యింక దీంతో సరుకు ప్రపంచాన్ని
సృజించి, ఒక కల్తీ బాబాలా జనాన్ని వెంట తిప్పుకోగలడు.
వాడిచ్చే బూడిద కోసం వెంపర్లాడే భక్తులస్థాయికి మనిషిని దిగ
జార్చి, దేవుణ్ణి మోక్షంకంటే ముందు ఐపాడ్, ఓఎల్‌డీ టీవీ
ఇంట్లో ఉండేలా కోరుకునే స్థాయికి దిగజార్చగలడు! హెగెల్
పరాయీకరణని ఒక సంతృప్తికర స్థితిగా, గతితార్కికంగా అర్థం
చేసుకుని అది పెట్టుబడిదారీ సమాజంలో అంతం అయిపో
తుందని చెబితే, మార్క్స్ మాత్రం దాన్ని ఒక అనైక్యతాస్థితిగా
చెప్పి, గతితార్కికంగానే కాకుండా, చారిత్రికంగా అర్థం చేసు
కుని, పరాయీకరణ అనేది పని ప్రాకృతిక అవసరానికి
ప్రత్యక్షంగా, శ్వాసించడమంత సహజ కార్యకలాపంగా వుండే
కమ్యూనిస్టు సమాజంలో మాత్రమే అంతం అవుతుందని
చెప్పాడు. సంప్రదాయ అర్థశాస్త్రవేత్తలకు పని ఎప్పుడూ
బలవంతపు కార్యమే కానీ శ్రమైక జీవన సౌందర్యాన్ని వేనోళ్లా
కొనియాడే మార్క్స్ మహానీయుడికి శ్రమ ఒక మధురానుభూతి!
అందుకే మార్క్స్ యావత్ మానవ జాతీ గర్వించదగ్గ
అత్యున్నతస్థాయి ప్రతిభామూర్తి అయ్యాడు!! స్వీయ
విధ్వంసానికి కావలసిన సామగ్రి శ్రామికుడు తన శ్రమ ద్వారా
అందిపుచ్చుకుంటే, పెట్టుబడి దారుడు మాత్రం తన
పరాయీకరణ విషయంలో తానొక క్రియా శూన్యుడు. ఉత్పత్తి
ఆధీనంలో వున్నా కూడా దురాశ, క్రూరత్వం, కపటం అనే
విశిష్ట గుణాల సమాహారంగా వుండే వీడు ఎక్కువ సరుకులు
కొనగలిగే వినిమయదారుడుకూడా!

రాజ్యం మనుషుల నకిలీ సమానత్వం మీద ఆధారపడుతుం
ది. ఉత్పత్తిసంబంధాల పునాదిపైన నిర్మించబడ్డ రాజ్యం పరాయి
రూపం సంతరించుకుని మనిషిని పరాయిచేస్తుంది. సరుకుల్ని
ఆరాధించడం నేర్చుకున్నవాడు నాయకుడ్ని కూడా ఆరాధించ
డం మొదలెడతాడు. దేశభక్తి దేశంతో ముడిబడ్డ వ్యక్తి నిరపేక్షర
కపు అనుబంధం. ఈ దేశభక్తుడు రూపంలేని సమూహం పట్ల
విధులు గుర్తిస్తాడు కానీ నిజమైన సజీవ ప్రజల పట్ల కాదు!
పరాయీకృత చైతన్యం, పరాయీకృత కార్యకలాపాల వల్లే
పుట్టింది. ఫలితాలు పరాయీకృతమైనవిగానే వుంటాయ్.
పెట్టుబడి దారీవ్యవస్థలో ప్రతిదీ ధరకే దొరుకుతాయి. డబ్బుతో
సేవలూ, ఉత్పత్తులూ కొలవడం అంటే పరాయీకరణ రాజ్యం
చేస్తున్నట్టే! డబ్బొక యూనివర్సల్ ప్రాస్టిట్యూట్ ఇక్కడ! దేన్నైనా
కొనేస్తుం దది! చరిత్రలో మొట్టమొదటి పరాయీకృత
శ్రమవ్యవస్థ బానిసవ్యవస్థ అయితే చిట్టచివరిది వేతన వ్యవస్థ.
మనదేశంలో వెట్టి, దాసీ, వ్యవస్థలు పరాయీకరణకు
ఉదాహరణలే! హిందూ మతం శూద్రుల్ని మత వ్యవస్థ నుంచి
నిరాకరించి పరాయిని చేసింది. పెట్టుబడిదారీ సంస్కృతిలో
కులం మతంలో ఘనీభవించి ఒకప్పుడు పునాదిగా వుంటూ
వచ్చి, క్రమంగా ఒక ఉపరినిర్మాణాంశంగా మారింది. మత
భావజాలం కూడా డబ్బుతో పునీతమైంది! పాపం చేసి డబ్బు
సంపాదించాక దేవుడికి ఒక వజ్రాల కిరీటాన్ని ఇచ్చేసి పాపం
అనే ఫైన్ ని రద్దు చేసుకొనే సౌలభ్యాన్ని పెట్టుబడిదారీవ్యవస్థ
కల్పించింది! డబ్బున్న శూద్రుడు యాగం చేసే రాయితీ కూడా
పెట్టుబడిదారీ వ్యవస్థ కల్పించింది!

ఆధునిక సైన్స్ పెట్టుబడికి బానిసై విద్య, వైద్య, ఔషధ,
మీడియా రంగాల్ని ఎలా భ్రష్టు పట్టిస్తుందో అనేక సజీవ ఉదా
హరణలతో చూపారు. వస్తువుపట్ల ఆరాధనని సృష్టించి ఫ్యాషన్
రంగాన్ని లాభం కోసం మలచిన వికృతి మోకాళ్ళు చించుకొని,
మూతికి రంగు పులిమి, చెత్త కుండీల దగ్గర పాత వస్తువులు
ఏరుకునే వారివలే వుండే స్థాయికి ఆధునిక యువతీయువకులు
దిగజారడం వెనుక ఉన్న విషాదాన్ని గొప్పగా చెబుతారు. వినిమ
య తత్వం ప్రబోధించే పెట్టుబడిదారీ ప్రపంచం మనిషి సహజా
త కోరికల్ని తన వ్యాపారం కోసం మార్చి ఆఖరికి సైన్స్ ను
కూడా తన పాదాల కింద ఎలా దాసోహం చేసుకుందో వివరిం
చిన తీరు అద్భుతంగా ఉంది. ఈ వ్యాసంలో రావుగారు
విశ్లేషించిన విషయాలు చదువరులకు ఈ ప్రపంచాన్ని ఎలా
అర్థం చేసుకోవాలో చెప్పి మనం ఏం చేయాలో స్పష్టపరుస్తాయి.

ముగింపులో రావు గారు చారిత్రక అవశ్యంగా, అభివృద్ధికి
కారకాలుగా వుంటూ వచ్చిన ఈ పరాయీకరణ ప్రపంచాన్ని
మార్చే ప్రయత్నంలో ఎలా అడ్డుతగులుతుందో ప్రతిభావంతంగా
వివరించారు. నిజానికి ఈ పుస్తకానికి ఇదే తలమానికం. వర్గ
చైతన్యం, వర్గ స్పృహ, ఐకమత్య భావనల నుండి దూరమైన
శ్రామికుడు ఎలా పోరాడాల్సి ఉంటుందో తెలుసుకోవాలంటారు.
చివరిగా, ఎంగెల్స్ చెప్పినట్లు అమానవీయమైన పరిస్థితులకు
వ్యతిరేకంగా జరిపే పోరాటంలో మాత్రమే మనం మానవులుగా
మిగులుతామనీ, కాబట్టి మానవత్వాన్ని మనకు కాకుండా చేస్తు
న్న పరాయీకరణకు వ్యతిరేకంగా మానవత్వాన్నే ఆయుధంగా
చేసుకొని పోరాడాల్సిందిగా పిలుపునిస్తారు రచయిత. ❑

# తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్



ఇక్బాల్ యంజీ


తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు అనగానే ఏమను కుంటున్నారు మీరు. ఇప్పుడు మన ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళలో టెన్త్, ఇంటర్ చదివిన వాళ్ళతో lkg, ukg పిల్లలకు, అక్షరాలు దిద్దించే వాళ్ళు అనుకుంటున్నారా.. ఆ ఏముందిలే... ఆ మాత్రం ఉపాధ్యాయురాళ్లు ఇవాళ చాలా మందే ఉన్నారని భావిస్తున్నారా. పొరపాటున కూడా తొందర పడి అలాంటి నిర్ణయానికి వచ్చేయకండి. ఫాతిమా షేక్ అలాంటి అశిక్షిత ఉపాధ్యాయురాలు కాదు. ఒక స్కూలు విద్యార్థులకు ప్రామాణికంగా విద్యను బోధించడానికి అవసరమైన శిక్షణ పొంది అర్హత సాధించిన ఉపాధ్యాయురాలు. అట్టడుగు, నిమ్న కులాల బాలికల కోసం చైతన్య 'జ్యోతి'రావు పూలే స్థాపించిన పాఠశాలల్లో బోధించడానికి తానే స్వయంగా సావిత్రి బాయితో పాటు ఫాతిమా షేక్‌కు కూడా శిక్షణ ఇచ్చారు. అది సరిపోదని గ్రహించి అహ్మదాబాద్ లోని ఆంగ్ల మిషనరీ ఉపాధ్యాయ శిక్షణ శాలలో ఇద్దరినీ చేర్పించి శిక్షణ ఇప్పించారు. అనంతరం పూణే లోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణశాలలో శిక్షణ తీసుకుని వారు పూర్తి స్థాయి అర్హత పత్రం(సర్టిఫికేట్) పొందారు. ఇదంతా.. ఇప్పటిలా ముస్లిం ఆడపిల్లలు కొంతవరకు స్వేచ్ఛగా చదువు కుంటున్న కాలం కాదు. సుమారు 180 ఏళ్ల కిందట అత్యంత దుర్భర ఆంక్షల కాలంలో. అసలు ఆడపిల్లల్ని బయటకు ఒంటరిగా పంపడమే గగనమైన అలాంటి కాలంలో ఒక మహిళ, అందునా ముస్లిం తాను చదువుకోవడమే సాహసం అయితే, మరికొందరికి చదువు చెప్పేందుకు పూర్తి స్థాయిలో అర్హత శిక్షణ పొందడం అంటే దానిని మాటల్లో కొలవలేం. అలా ఫాతిమా షేక్ భారతీయ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలుగా చరిత్రలో నిలిచారు. అయితే అదంతా హఠాత్తుగానో యాదృచ్ఛికంగానో జరిగింది కాదు. మాహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయి పూలే సహచర్యం, ఆదరం తోనే ఆమెకు ఆస్థానం దక్కింది. అయితే అంతకు ముందు జరిగిన పరిణామాలు స్పృశించాలి.




జ్యోతిరావు పూలే ప్రాథమిక విద్య చదువుతుండగానే ఒక అగ్రకుల బ్రాహ్మణుడి చెప్పుడు మాటలకు లోబడి తండ్రి చదువు మాన్పించారు. ఆ తరువాత ఆయనలో చదువు పట్ల కాంక్ష తీర లేదు. ఈ లోపే సావిత్రీ బాయి పూలేతో వివాహం కూడా జరిగి పోయింది. అయినప్పటికీ తను చదువుకోవడమే కాకుండా అట్టడుగు నిమ్న కులాల వారికి చదువు చెప్పాలని దృఢంగా నిశ్చయించుకున్నారు. ఈ విషయంలో ఆయన తండ్రిని సైతం ఎదిరించారు. దీని ఫలితంగా ఆయన భార్య సమేతంగా కట్టు బట్టలతో వీధుల్లో నిలిచారు. ఆ సమయంలో తండ్రి స్నేహితుడు మున్షీ గఫార్ బేగ్ పూలే దంపతులను ఉస్మాన్ షేక్, అతని సోదరి ఫాతిమా షేక్ దగ్గరకు తీసుకెళ్ళి పరిస్థితి వివరించి ఆశ్రయం కల్పించాల్సిందిగా కోరాడు. అప్పటికే పూలే దంప తుల గురించి అక్కడక్కడ వింటూ.. ఎలాగైనా వారిని కలవాలని చూస్తున్న ఆ అన్న చెల్లెళ్ళకు మహదానందం కలిగింది. ఎలాంటి భేషజాలకు పోకుండా వెంటనే అందుకు అంగీకరించి వారిని లోనికి తీసుకెళ్ళి అవసరమైన వసతి కల్పించారు. అనంతరం పూలే దంపతులు అట్టడుగు నిమ్న కులాల వారి పిల్లలు, ముఖ్యంగా బాలికల కోసం పాఠశాల పెట్టాలను కుంటున్న విషయం తెలుసుకుని వారి నివాసాన్ని అందుకు అనువుగా మార్చి ఇచ్చారు. అప్పటి నుండి వారి మధ్య అనుబంధం బలపడింది. సోదరికి చదువు విషయంలో ఉస్మాన్ షేక్ ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదు. (మిగతా 42లో)

# పెట్టుబడిదారీ వ్యవస్థ

- జి.భార్గవ,
న్యూ సోషలిస్టు ఇనీషియేటివ్



మనిషికీ మనిషికీ మధ్య పోటీ పెట్టి తమాష చూస్తుంది.
పాత కాలపు సముదాయాలు లేక
కొత్త తరహా సహకార వ్యవస్థలు అందుబాటులో లేక
ప్రతి మనిషి సాటి మనిషిని అనుమానించక తప్పని
పరిస్థితిలో చిక్కుకుంటాడు.
ఆ ఏకాకి వ్యక్తికి..
సాంఘిక పరిస్థితులు మార్చడానికి అసాధ్యమైన
ప్రచండ శక్తిగా కనిపిస్తాయి.
మార్పు ఇక అసాధ్యం అనే నిరాశావాదం పుట్టడానికీ,
సమాజంలో వ్యాపించడానికీ మూల కారణం ఇదే
నిరాశా వాదికి ఏదో విధంగా బతికితే చాలు
అనే ధోరణి ఏర్పడుతుంది. అది నైతికతను క్షీణింపచేసి
మనిషిని సర్వైవల్‌కు పరిమితం చేస్తుంది.
వర్తమానం అనే పంజరం తప్ప
భవిష్యత్ అనే ఆకాశం కోల్పోయిన రెక్కలిరిగిపోయిన
పక్షిగా మనిషి మారిపోతాడు.
తాను చిక్కుకున్న పరిస్థితులపై అవగాహన కలిగేంత
వరకూ
ఈ నిరాశావాదం, ఈ నిస్సహాయ ఆక్రోశం, సాటి
మానవులపై అనుమానం అనే రోగాలు తగ్గే అవకాశమే
లేదు.
నిరాశావాదాన్ని మించిన విషం లేదు.
చుట్టుముట్టిన పరిస్థితులను అర్థం చేసుకోలేని
అజ్ఞానం కన్నా చీకటి లేదు.

ఈ విషానికి ఏకైక విరుగుడు
అవగాహనతో కూడిన
ఆశావాదమే.
అణచేసే పరిస్థితులను మార్చుకోవడానికి
సహ బాధితులతో కలసి పోరాడ్డానికి
మనఃస్ఫూర్తిగా సిద్ధపడడమే.
మనం పుట్టిన సామాజిక స్థానం (social location)
సాంస్కృతిక వాతావరణం, చారిత్రక సందర్భం మనలను
చాలా వరకు రూపొందిస్తాయి.
మంచైనా చెడైనా ఆ చట్రంలోనే ఉంటాము.
అది మనలను బిగించి ఉంచిన చట్రం అనే ఎరుక కూడా
చాలా మందికి కలగకపోవచ్చును కూడా.
మన ఉనికి కారణంగా, పెరిగిన పరిసరాల కారణంగా
మనలో ఏర్పడిన భావాలు, నమ్మకాలు, అభిరుచులు,
అపోహలపై ఆత్మవిమర్శనాత్మక పరిశీలన చేసుకోగల
సామర్థ్యం, నిజాయితీ, నిర్భీకత మనలో ఏర్పడేంత వరకూ
మనం సంఘం చెక్కిన శిల్పాలమే.
మనలను మనం ఇచ్ఛా పూర్వకంగా తీర్చిదిద్దుకోవడం
ప్రారంభమైనప్పుడే మనం నిజమైన అర్థంలో వయోజనులం
అవుతాం.
అంతవరకూ.. వయసు పెరుగుతుంది. సమాచారం
పోగవుతుంది. ఏవో కొన్ని నైపుణ్యాలు అలవడతాయి.
కానీ మనసు ఎదగదు.
బుద్ధి అంతర్నేత్రం తెరచుకోదు. ❑

# కేపిటలిజమ్ అంటే..

Capitalism అంటే
టాటాలు, బిర్లాలు మాత్రమే కాదు
కేవలం అదానీ,అంబానీలు కాదు
ఆకాశ హర్మ్యాలు, అద్దాల మేడలు,
విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీస్ మాత్రమే కాదు.
Capitalism అంటే.. ఆస్తులు నిరంతరం చేతులు మారడం
చిన్న ఆస్తులు పెద్ద ఆస్తుల్లో కలసిపోవడం
చిన్న పెట్టుబడులు దివాలా తీసి నాశనం అయిపోవడం
ఎవరు ఆడిస్తున్నారో అర్థం కాని మార్కెట్ క్రీడలో
అందరూ పూనకంతో పాల్గోవడం
చట్టబద్ధంగా, సునాయాసంగా
శ్రమదోపిడీ సాగుతూ ఉండడం
తాము శ్రామికులమని
శ్రామికులే మరచిపోవడం
మనుషుల స్థానంలో
శ్రామికులో వినియోగదారులో
మిగలడం
అసంఖ్యాకమైన ప్రజలు ప్రభుత్వ సహాయం లేకుంటే బతకలేని స్థితికి చేరడం
పరస్పర సహకారం చచ్చిపోయి స్పర్ధ జీవన సూత్రం కావడం
పరాధీనత స్వేచ్ఛ ముసుగు ధరించడం
ప్రపంచం తలకిందులుగా నడవడం ❑

# ప్రాచీన భారతదేశంలో ఆహారపు అలవాట్లు

**అనువాదం : విశ్వం**



**- డి.ఎన్.ఝా**


**సంఘ పరివార్ సిద్ధాంత వేత్తలు సహజ మరణం పొందిన గోవు మాంస భక్షణను అంగీకరించారు. సంఘపరివార్ గోవధ నిషేధ కార్యాచరణ అంతా ముస్లింలు, దళితులపై ఉన్న తీవ్రమైన వ్యతి రేకత కారణంగానేననీ, వారికి హిందూ శత్రువులు, స్మృతులు, పురాణాలపై ఇసుమంత కూడా గౌరవం లేదనీ అర్థం కావడం లేదా? ఈ విషయాన్ని దేశభక్తులైన వారు గ్రహిస్తారని ఆశిస్తున్నాను.**

భారతీయులకు ఆవు మొదటినుంచీ పవిత్రమైనదా? హిందువులు గోవధ ఎప్పుడూ చేయలేదా? ఆవు మాంసం ఎప్పుడూ తిని ఉండలేదా? ఒకప్పటి బ్రాహ్మణులు ఆవును తిన్నారంటే నమ్ముతారా? నమ్మడానికి ఎవరైనా ఎందుకు బాధపడాలి? ఎందుకు సిగ్గుపడాలి? ఎవరి ఆహార అలవాట్లు వారివి. ఇష్టంలేని వారు గోమాంసం తినకపోతే ఎవరికీ ఏ అభ్యంతరం ఉండదు.కానీ దానిని తినడాన్ని నిషేధించడం మాత్రం నిస్సందేహంగా దానిని ఇష్టంగా తినేవారి స్వేచ్ఛను అరికట్టడమే అవుతుంది.ఇలాంటి పరిణామాలు ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదకరం. హరప్పా నాగరికతా కాలం నుంచీ హిందువులకు గోవు పవిత్రమైన జంతువేనా? కాదు. దాదాపు ఇటీవల వరకు హిందువులకు గోవు పవిత్రమైన జంతువు కాదు. ఆనాటి నుండి ఇటీవల కాలం వరకు హిందువుల దృష్టిలో గోవు స్థానాన్ని పరిశీలిద్దాం.. క్రీ.పూ. 3000 నుండి క్రీ.పూ.1750 వరకు విలసిల్లిన హరప్పా నాగరికతా కాలంలో గోమాంస భక్షణ ఉండేదని తవ్వకాలలో లభించిన ఆధారాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. 'అత్రంజిఖేరా (నేటి ఎటావా జిల్లా)లో లభించిన ఎముకలలో 60శాతానికి పైగా ఆవులవే. వీటిపై గంట్లు ఉన్నాయి. ("గోవు పవిత్రత ఓ కట్టుకథ" రచన: డి.ఎన్.ఝా, పేజీ 36) క్రీ.పూ. 1750 నుండి క్రీ.పూ. 600 వరకు చరిత్రకారులు వేదకాలంగా పరిగణిస్తున్నారు. వేద రుషులు యజ్ఞాలలో గోవులను బలియిచ్చేవారనీ, గోమాంస భక్షణ చేసేవారనీ అనేక వేదమంత్రాలు నిరూపిస్తున్నాయి. వాటిలో రెండు మూడు పరిశీలిద్దాం..

1. రుగ్వేదం 1వ మండలం 161వ సూక్తం 10వ మంత్రం : ఋభువులలో ఒకడు కోసిన ఆవు నెత్తురును పాత్రలో పడుతున్నాడు. ఇంకొకడు కత్తితో కండల్ని ముక్క ముక్కల క్రింద నరికి పోగులు పెడుతున్నాడు. మరొకడు దాని పొట్ట లోని మలమూత్ర భాగాల్ని వేరు చేస్తున్నాడు.

2. రుగ్వేదం 10-79-6: 'విపర్యశశ్ చకర్త గామివాసిః' అనగా 'ఈ కత్తి ఆవును కణుపు కణుపునా కోయిగాక.'

3. రుగ్వేదం 10-86-14: నా కొరకు ఇంద్రాణి యాజ్ఞీకులను ప్రోత్సహించినది.




వారు15, 20 ఆబోతులను వండినారు. వానిని తిందును.

4. శుక్ల యజుర్వేదము 13వ అధ్యాయం 43వ మంత్రం: 'గోశిర ఆగేయ్యా ముపథాతి' అనగా 'ఆగ్నేయమున గో శిరము నుంచవలెను.'

5. కృష్ణ యజుర్వేదము ఎనిమిదవ అనువాక్యములో పశువధ గురించి పూర్తిగా చెప్పబడింది (కృష్ణ యజుర్వేదం-1, దాశరథి రంగాచార్య రచన, పేజీ 49). క్రీ.పూ.600 తర్వాత కాలాన్ని ఉపనిషత్తులు, బ్రాహ్మణుల కాలం. ఆ కాలంలో కూడా గోవధ, గోభక్షణ ఈ రెండూ రుషులకు సామాన్య విషయాలే. ఉదాహరణకు తైత్తిరీయ బ్రాహ్మణం 3:9.8.2-3లో ఇలా ఉంది.:'.. గామాలభతే (2), యజ్ఞోవైగౌః యజ్ఞమేవాలభతే, అథో అన్నం వైగౌః, అన్నమేవా వరున్ధే..' అనగా 'అతను (అధ్వర్యుడు) ఆవును గట్టిగా పట్టుకుంటాడు. ఆ ఆవును బలియిస్తారు. ఆ రకంగా బలిని అతను(బలి ఇచ్చినవాడు) పొందుతాడు. అంతే కాక ఆ ఆవు ఆహారమే అవుతుంది.'

మరో ఉదాహరణ 'ఆవు, ఎద్దుకు చెందిన లేత మాంసం దొరికినంత కాలం తింటూనే ఉంటాన'ని యాజ్ఞవల్క్య మహర్షి శతపథ బ్రాహ్మణంలో అంటాడు. 'తస్మాద్దేన్వాణుడు హెూర్నాశ్నియాత్, అడుహెూవాచ, యాజ్ఞ వల్క్యహః అశ్నామియే వాహం మాంసలమ్

చేద్భవతితి (శతపథ బ్రాహ్మణం 3.1.2.21)

ఐతరేయ బ్రాహ్మణం ఇలా పేర్కొంది.. 'తద్ యద్దైవాదో మనుష్యరాజు ఆగతే న్యాస్మిన్ హర్వతి ఉక్షాణాంవా వెహతం వాక్షదంతే' (ఐతరేయ బ్రాహ్మణం 3.4) అంటే.. 'అతిథులుగా రాజు లేదా గౌరవార్హుడైన వ్యక్తి వస్తే జనులు ఎద్దు లేదా ఆవును వధిస్తారు' అని అర్థం. ఈ అంశాన్నే మహాకవి భవభూతి తన 'ఉత్తర రామ చరిత్ర'లో నాటకీయంగా వర్ణిస్తాడు. ఈ నాటకంలోని నాలుగో అంకం, మిశ్ర విష్కంభంలో ఇద్దరు శిష్యుల సంభాషణ ఇలా సాగుతుంది.

మొదటి శిష్యుడు: మిత్రమా! ఈ రోజు అతిథులు రావడం చేత వాల్మీకి మునీంద్రుని ఆశ్రమం ఎలాంటి కమ్మటి వాసనలు ఘుమాయిస్తున్నదో చూశావా?

రెండవ శిష్యుడు: అవును. ఆడాళ్ళని వెంటేసుకొచ్చిన ఈ అతిథిగారెవ్వరు?

మొదటి శిష్యుడు : వశిష్ఠుల వారు.

రెండవ శిష్యుడు: ఓహో! ఆయన వచ్చాడో లేదో ఆ పుల్లావును అమాంతం కోశేశారు.

మొదటి శిష్యుడు : అలా అనకూడదు. పెద్దలు వస్తే మధు పర్కం సమర్పించాలనీ, దానిలో తప్పకుండా ఆవు పెయ్యని గానీ, కోడె దూడను గానీ కోసి పెట్టాలని ఆపస్తంబ మునీంద్రులు ధర్మశాస్త్రాల్లో స్పష్టంగా రాశారుగా?

రెండవ శిష్యుడు : ఆ!

(భవభూతి ఉత్తర రామచరిత్ర నాటకానికి మల్లాది సూర్య నారాయణ శాస్త్ర తెలుగు అనువాదం)

హిందువుల వర్ణాశ్రమ ధర్మాలూర, ఆచార వ్యవహారాలను నిర్దేశించిన స్మృతులలో మనుస్మృతి అగ్రగణ్యమైనది. దానిలో మనువు మధుపర్కం, శ్రాద్ధ కర్మల వంటి సందర్భాలలో ఆవును తినడానికి అనుమతించాడనీ, ఇది వైదిక, వైదికానంతర ఆచారమనీ మనుస్మృతి 5.27కు వ్యాఖ్య చేస్తూ మేధాతిథి అన్నాడు. 'గోవ్యజ మాంస మప్రోక్షితమ్ భక్షయేదిత్య నేనైతదను పాకృతానామే వా సద్రూపమనూద్యతే' (మేధాతిథి వ్యాఖ్య)

అంతే కాదు. మనువుగానీ, యాజ్ఞవల్క్యుడు గానీ ఆవు నోరు అశుద్ధమైనదని పేర్కొన్నారు. 'ఆవు వాసన చూసిన ఆహారాన్ని గోయితీసి పూడ్చిపెట్టా'లని మనువు చెప్పాడు. (మనుస్మృతి 5.125) 'మేకల గుర్రాల నోళ్ళు శుద్ధమైనవే కాని ఆవునోరు మానవ మలము శుద్ధమైనవి కావు' అని యాజ్ఞవల్క్యుడు పేర్కొన్నాడు. (యాజ్ఞవల్క్య స్మృతి 1.194) మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, సంఘ పరివార్‌కు చెందిన సిద్ధాంతవేత్త కె.ఆర్.మల్కానీ ఆర్.ఎస్.ఎస్. వారి పత్రిక 'ఆర్గనైజర్'లో 1966 నవంబర్ 11 నాటి పత్రికా సంపాదకీయంలో 'సహజ మరణం పొందిన ఆవు మాంసాన్ని తిన వచ్చు'నని రాశారు. అందువలన ప్రాచీన శ్రుతి, స్మృతులు గోమాంస భక్షణ ఆమోదించాయని రుజువవుతోంది. సంఘ పరివార్ సిద్ధాంతవేత్తలు సహజ మరణం పొందిన గోవు మాంస భక్షణను అంగీకరించారు. సంఘ పరివార్ గోవధ నిషేధ కార్యాచరణ అంతా ముస్లింలు, దళితులపై ఉన్న తీవ్రమైన వ్యతి రేకత కారణంగానేననీ, వారికి హిందూ శత్రువులు, స్మృతులు, పురాణాలపై ఇసుమంత కూడా గౌరవం లేదనీ అర్థం కావడం లేదా? ఈ విషయాన్ని దేశభక్తులైన వారు గ్రహిస్తారని ఆశిస్తున్నాను. ❑

## తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు


(39వ పేజీ తరువాయి)

ఆడ పిల్లల పట్ల సామాజిక కట్టుబాట్లను పట్టించుకోకుండా ప్రోత్సహించి ఆదర్శవంతంగా నిలిచాడు. అన్న అండ, పూలే దంపతుల ప్రోత్సాహంతో ఫాతిమా షేక్ సావిత్రీ బాయి పూలే తో సమానంగా ఉపాధ్యాయురాలుగా అర్హత సాధించారు. సుమారు 180 ఏళ్ల కిందట అన్ని కట్టుబాట్లను తెంచుకుని సరిసమానంగా ఈ ఘనత సాధించిన ఇరువురు మహిళల్లో కేవలం ఒకరినే గుర్తిస్తూ మరొకరిని ఉపేక్షిస్తూ రావడం విచారకరం. ముఖ్యంగా పూలే దంపతుల కృషికి తాము బలీయమైన మద్దతు ఇవ్వకపోతే.. పరిస్థితి ఊహించడం కష్టం. దళిత, బహుజన అంబెద్కర్ వాదులు, ఫాతిమా విస్మరించడం విస్మయకరం. పూలే దంపతుల ఆదర్శ నీయ ఔన్నత్యాన్ని కీర్తించిన ఆయన వారి ఉన్నతికి, కృషికి వెన్నుముకలా నిలిచిన ఉస్మాన్, ఫాతిమా షేక్ ల గురించి కనీస ప్రస్తావన తీసుకురాక పోవడం అర్థం కాదు.

అదలా ఉంచితే...

కనీసం ముస్లిం మైనార్టీ లైనా గుర్తించి దివిటీలు పడతారేమో అని చూస్తే అదీ లేదు. దేశం గర్వించదగ్గ స్థాయిలో ఒక ముస్లిం సామాజిక వర్గంలో ప్రథమ ఉపాధ్యాయురాలుగా కీర్తి ప్రతిష్టల ను సాధిస్తే దానిని అత్యున్నత స్థాయిలో నిలపాల్సిన వాళ్ళు నిమ్మకు నీరెత్తినట్లు ముసుగేశారు. కనీసం కొంత సమాచారం తెలిసిన తరువాత అయినా ఫాతిమా షేక్ ఉనికిని గుర్తిస్తూ అయినా కార్యక్రమాలు చేయలేకపోవడం దురదృష్టకరం. ఈ రోజు (జనవరి 3 న) సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకల కార్యక్రమాల జోరు కొనసాగుతోంది. ఆమె అందుకు సంపూర్ణంగా అర్హురాలే. సందేహం లేదు. అయితే ఇదే సందర్భంలో పూలే దంపతులకు ఆలంబనగా, కొండంత అండగా నిలిచిన ఫాతిమా షేక్‌ను కూడా స్మరించుకోగలిగితేనే వారి స్మృతికి అసలైన గౌరవం లభిస్తుంది. ❑


**(సయ్యద్ నశీర్ అహ్మద్ రచించిన 'ఆధునిక భారత తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు - ఫాతిమా షేక్' పుస్తకం ఆధారంగా..)**




కొత్త నాటకం

పేలిపోయింది !









రక్షణ కవచం

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 1 - Issue No : 5 February 2023




## కొత్త పుస్తకాలు స్వీకారం




**if undeliverd please return to:**

**B.Ramesh Chandra Babu**

**34-15-1,**
**Doddipatal Vaari Thota Veedhi,**
**Tanuku - 534 211**
**West Godavari, Ap**
**Phone No : 93971 14495**

Printed Matter - Book Post

To :

**Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.**